




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 98 | ఆదివారం | 08-03-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


మహిళా దినోత్సవ శుభాకాంక్షలు..




ఒక స్త్రీ.., ప్రేమించగలదు, క్షమించగలదు, ఎదిరించగలదు, ఏదైనా సాధించగలదు... తన గుండె దర్పం ముందు ఎవరు నిలబడలేరు





# గణపతీ లొంగిపోండి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

సిఎం సమక్షంలో ఆయుధాలతో సహా లొంగిపోయిన 130 మంది మావోయిస్టులు

- మావోయిస్టులపై ఉన్న కేసులను చట్టపరిధిలో పరిశీలించి ఎత్తివేసేందుకు ప్రభుత్వం సిద్ధం
- వరవరరావుపై ఉన్న కేసులనూ పరిశీలిస్తాం
- అవసరమైతే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తాం
- ప్రజాస్వామిక మార్గంలోనే సమాజంలో మార్పు సాధ్యం
- శాంతియుత మార్గమే ఏకైక ఆయుధమని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు, ముఖ్యంగా మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి సహా ఇతర కేంద్ర కమిటీ సభ్యులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన మావోయిస్టులపై ఉన్న కేసులను చట్టపరిధిలో పరిశీలించి అవసరమైతే ఎత్తివేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వరవరరావుపై ఉన్న కేసులను కూడా పరిశీలిస్తామని, కేసుల పరిశీలన కోసం అవసరమైతే ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఆయుధాలు, హింస ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం దొరకదని, ప్రజాస్వామిక మార్గంలోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాట్లకు పెద్ద ఊతం లభించిన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి) లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులు పోలీసులకు మొత్తం 124 అత్యాధునిక తుపాకులను అప్పగించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. అప్పగించిన ఆయుధాల్లో ఒక ఇన్‌సాస్ ఎల్ఎంజి రైఫిల్, 31 ఎకె47 రైఫిళ్లు,

తరువాయి 2లో

# టెహ్రాన్ ఎయిర్‌పోర్టుపై బాంబుల మోత

- 16 ఎయిర్ క్రాఫ్టులను ధ్వంసం చేసిన ఇజ్రాయెల్
- ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో దాడులు
- డ్రోన్ దాడులను తిప్పికొట్టిన సౌదీ
- దుబాయ్, మనామాలలో పేలుళ్ళు
- యుద్ధ ముగింపు చర్యలకు పుతిన్ విజ్ఞప్తి





**జెరూసలెం :** చరిత్రలో మరచిపోనిరీతిలో ఇరాన్‌పై క్షిపణి, ఆయుధ తయారీ కేంద్రాలను సంపూర్ణంగా తుడిచిపెడతామని ట్రంప్ చేసిన హెచ్చరిక భయాల నడుమ పశ్చిమాసియాలో యుద్ధం రెండోవారంలోకి ప్రవేశించింది. శనివారం ఎనిమిదోరోజు యుద్ధంలో అమెరికా–ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో బాంబుదాడులు కొనసాగించాయి. దుబాయ్, మనాలలో భారీ పేలుళ్ళు సంభవించాయి. టెహ్రాన్‌కు పశ్చిమంగా ఉన్న మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 16 ఎయిర్‌క్రాఫ్టులను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. బ్రెంట్ క్రూడాయిల్ ధరలు కూడా ఎంతమాత్రం వెనక్కు తగ్గకుండా ఒక బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరుకుంది.ఇంకోవైపు ఇరాన్‌కు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. పాకిస్థాన్‌లోని కరాచీ, ఇస్లామాబాద్, బాగ్దాద్, సనాలో ప్రజలు భారీసంఖ్యలో వీధుల్లోకి వచ్చి అమెరికా–ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలు చేశారు. ఇరాన్ గగనతలాన్ని స్వాధీనం చేసుకునేదిశలో యుద్ధం సాగుతోందని ట్రంప్ చెప్పారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, ఆ తర్వాత చర్చలు ఉంటాయన్నారు. ఇరాన్ పౌర ప్రాంతాలపై తాము దాడులు చేయలేదని ట్రంప్, నెతన్యాహూ బొంకులు పలికారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీని నాలుగు లేదా ఆరు వారాల్లో పూర్తిచేస్తామని ట్రంప్ చెప్పగా, యుద్ధం ముగించేందుకు మధ్యవర్తులు

తరువాయి 2లో

## గల్ఫ్‌పై దాడులు చెయ్యం

ఆ దేశాలపై చేసిన దాడులకు ఇరాన్ అధ్యక్షుడు క్షమాపణ



**దుబాయ్:** గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ క్షమాపణలు తెలియజేశారు. ఇరాన్ తరపున తాను వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నానన్నారు. ఒకవైపు గల్ఫ్‌దేశాలలో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు విచ్చలవిడి దాడులు చేస్తున్న తరుణంలో ఈ ప్రకటన చేశారు. ఈ దాడులపై త్రిసభ్య సర్వోన్నత కమిటీ సాయుధ బలగాలతో సంబంధాలు నెరపి అదుపుచేస్తామన్నారు. తమపై దాడిచేస్తే తప్ప ఇకమీదట వారు క్షిపణి దాడులు చేయరన్నారు. ఇరాన్ బలగాలపై సర్వోన్నత పాలక మండలికి చాలా పరిమితమైన అధికారాలు ఉంటాయని స్పష్టం చేశారు. అమెరికా–ఇజ్రాయెల్

తరువాయి 2లో

టి–20 ప్రపంచకప్



## భారత్ వర్సెస్ న్యూజిలాండ్ నేడు ఫైనల్

టి–20 ప్రపంచకప్ 2026 తుది సమరానికి చేరుకుంది. నేడు (ఆదివారం) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్- న్యూజిలాండ్ జట్లు టైటిల్ కోసం పోరాడనున్నాయి.

09



చిరంజీవి ఎన్‌టిఆర్ అవార్డు | కమల్‌హాసన్ పైడి జయరాజ్ అవార్డు | జయసుధ ఎఎన్నార్ పురస్కారం | సుద్దాల అశోక్‌తేజ సినారే అవార్డు

గద్దర్ అవార్డుల ప్రకటన..

## చిరంజీవికి ఎన్టీఆర్ నేషనల్ అవార్డు

కమల్ హాసన్‌కు 'పైడి జయరాజ్ అవార్డు'

తెలుగు చలనచిత్ర రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కళాకారులకు ఇచ్చే ప్రతిష్టాత్మక 'గద్దర్ అవార్డుల' (2025) విజేతల జాబితా శనివారం విడుదలైంది. ఈ ఏడాది అత్యున్నత పురస్కారాల్లో భాగంగా చిత్రసీమకు చెందిన ఇద్దరు దిగ్గజ నటులకు అరుదైన గౌరవం దక్కింది. మెగాస్టార్ చిరంజీవికి ప్రతిష్టాత్మకమైన 'ఎన్టీఆర్ జాతీయ పురస్కారం', కమల్ హాసన్‌కు 'పైడి జయరాజ్ అవార్డు' వరించింది. ఈ ప్రతిష్టాత్మక జాబితాలో నటి జయసుధకు 'ఎఎన్నార్ పురస్కారం', ప్రముఖ నిర్మాత అశ్విని దత్‌కు 'నాగిరెడ్డి చక్రపాణి అవార్డు', గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు 'సినారే అవార్డు' దక్కాయి. అదే విధంగా సింగీతం శ్రీనివాసరావుకు బిఎన్‌రెడ్డి ఫిల్మ్ అవార్డు, అశ్వనీ దత్‌కు నాగిరెడ్డి చక్రపాణి అవార్డు, ఆర్. నారాయణ మూర్తికి కె.ఎల్.కాంతారావు ఫిల్మ్ అవార్డు, రమేశ్ ప్రసాద్‌కు రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డులు లభించాయి.

03

## ప్రపంచ ఆధిపత్యం కోసమే యుద్ధం

- ఇరాన్ సమర్థ ప్రాంతీయ రాజ్యంగా ఉండొద్దనే లక్ష్యం
- అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలను కాలరాస్తున్న అమెరికా, ఇజ్రాయెల్
- ఐక్యపోరాటాల ద్వారానే దోపిడీ పాలకుల నుంచి నిజమైన విముక్తి



ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా కమ్యూనిస్టు పార్టీల సంయుక్త ప్రకటన

ఇరాన్‌పై యుద్ధం ద్వారా ఆ ప్రాంతం(పశ్చిమాసియా), ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించేందుకు, నియంత్రించేందుకు అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రయత్నిస్తున్నాయని ఇరాన్ కమ్యూనిస్టు పార్టీ (టియుడిఇహెచ్), ఇజ్రాయెల్ కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), అమెరికా కమ్యూనిస్టు పార్టీ (సిపియుఎస్ఎ)లు ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించాయి. ఇరాన్, ఆ దేశ ప్రజలపై జరుగుతున్న దాడి ఈ ప్రాంతంలోని మిగిలిన దేశాలపై పూర్తి ఆధిపత్యానికి నాంది అవుతుందని పునరుద్ఘాటించాయి. ఈ మేరకు మూడు దేశాల కమ్యూనిస్టు పార్టీల ప్రకటన పూర్తి పాఠం ఇలా ఉంది. 'నెతన్యాహూ నేరపూరిత ప్రభుత్వం, అమెరికా సామ్రాజ్యవాదం గత శనివారం తెల్లవారుజామున ఇరాన్‌పై ప్రారంభించిన దురాక్రమణ యుద్ధం పూర్తి స్థాయి యుద్ధానికి పురికొల్పింది. ఈ ప్రాంతాన్ని, ఇక్కడి ప్రజలను మరిన్ని విపత్తులు, పౌరుల ప్రాణనష్టాల వైపుకు లాక్కెళ్ళింది. ఈ చర్యలు

తరువాయి 12లో

# భగ్గుమన్న గ్యాస్ ధరలు

ఆసియాలోని చిన్న దేశాల్లో ఆయిల్ కల్లోలం

పరిస్థితిపై అమెరికా, రష్యా చర్చలు



**మాస్కో:** యుద్ధం వల్ల హోర్ముజ్ జలసంధి నుండి నౌకల రవాణా ఆగిపోవడంతో ప్రధానంగా ఆసియాలోని చిన్న దేశాల్లో ఆయిల్ కల్లోల్ చెలరేగే పరిస్థితులు వచ్చాయి. అమెరికాలో యుద్ధం మొదలైన ఒక్క వారం రోజుల్లోనే చమురు ధర ఈనాటివరకూ 15 శాతం మేరకు పెరిగిపోయి, రెండేళ్ళక్రితం నాటి చరిత్రను తిరగరాసింది. భారత్, అమెరికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, దక్షిణ కొరియాలలో చమురు, వంటగ్యాస్ ధరలు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో తమదేశంపై ఉన్న ఆంక్షలను సడలించే విషయంపై అమెరికాతో చర్చలు జరుగుతున్నాయని విదేశీపెట్టుబడులు, ఆర్థిక సహకారంపై రష్యా అధ్యక్షుడి ప్రత్యేక దౌత్యవేత్త కిరిల్ డిమిత్రియేవ్ శనివారం మాస్కోలో చెప్పారు. రష్యాపై పాశ్చాత్య ప్రపంచం విధించిన ఆంక్షలు యావత్ ప్రపంచానికీ హానికరమని వాస్తవ ప్రాతపడికపై రుజువైనందువల్ల సమస్య పరిష్కారానికి ఆంక్షల తొలగింపే మార్గమని, ఈ విషయంపై అమెరికా–రష్యా మధ్య సంభాషణలు జరుగుతున్నాయని డిమిత్రియేవ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రష్యా

తరువాయి 2లో

## భారత్‌లో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.60 జంప్

**న్యూఢిల్లీ :** దేశంలో వంట గ్యాస్ సిలిండర్ ధరలు భారీగా పెరిగాయి. గృహ అవసరాల కోసం వినియోగించే 14.2 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ.60 పెంచింది. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు సహా వాణిజ్య అవసరాల కోసం వాడే కమర్షియల్ 19 కిలోల సిలిండర్ ధరను రూ.114.5 పెంచింది. ఈ పెంచిన ధరలు శనివారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వస్తాయని పేర్కొంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) వెబ్‌సైట్ ప్రకారం ఢిల్లీలో సబ్సిడీ లేని

తరువాయి 2లో

లెబనాన్‌లో హెజ్బొల్లా – ఐడిఎఫ్ యుద్ధం తీవ్రం

## బెక్కాపై దాడిలో 26 మంది మృతి

గాయపడిన ఇజ్రాయెల్ ఆర్థికమంత్రి కుమారుడు

02



పాకిస్థాన్‌లో 15 మంది

## ఉగ్రవాదులు కాల్చివేత



మహిళలు వ్యక్తులు కాదు...

# మహా శక్తులు

- అన్యాయాలను ఎదురించేందుకు ఉద్యమాలకు సంసిద్ధం కావాలి
- 'దోపిడీ, హింస, అసమానతలకు వ్యతిరేకంగా శ్రామిక మహిళల పోరాటం' సదస్సులో పలువురు మహిళా నేతలు పిలుపు
- 115 ఏళ్ల క్రితం మహిళలు పోరాడి సాధించుకున్న హక్కుల హననం : డాక్టర్ రజని

ప్రజాపక్షం /హైదరాబాద్

మహిళలు వ్యక్తులు కాదని, మహా శక్తులని, తమపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించేందుకు సంసిద్ధం కావాలని పలువురు మహిళా సమాఖ్య నేతలు పిలుపు నిచ్చారు. 116వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు), తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా ఫోరం గ్రేటర్ హైదరాబాద్ సమితి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సత్య నారాయణ రెడ్డి భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు పతాకాన్ని భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు ఆరుట్ల సుశీల దేవి ఆవిష్కరించారు. 'దోపిడీ, హింస, అసమానతలకు వ్యతిరేకంగా శ్రామిక మహిళల పోరాటం' అనే అంశంపై సదస్సు జరిగింది. శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు

తరువాయి 12లో

ఇండియా–యుఎస్ వాణిజ్య ఒప్పందం

# అమెరికా చేతిలో భారత్ డేటా



రాహుల్‌గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ :** భారత్ – అమెరికా ట్రేడ్ డీల్‌పై లోక్ సభలో రాహుల్‌గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇండియా–యుఎస్ వాణిజ్య ఒప్పందం భారత దేశ డేటాను అమెరికాకు అప్పగించిందని ఆరోపించారు. తాను తప్ప మరెవరూ ఈ విషయం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. భారతదేశ డేటా ప్రపంచంలోనే అత్యంత విలువైనదని చెప్పి ఉంటే వ్యవసాయం, చిన్న, మధ్యతరహా వ్యాపారాలపై ఎటువంటి

తరువాయి 12లో

ఇందిరమ్మ ఇండ్ల పథకం

# దేశానికే బెంచ్ మార్క్

ఈ నెలాఖరులోగా లక్ష ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని నిరుపేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్ల' పథకం దేశానికే బెంచ్ మార్క్‌గా నిలవబోతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సచివాలయం నుంచి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌లతో శనివారం (పిడిఎస్) నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు మంజూరు చేసిన 3.60 లక్షల ఇండ్లలో, కనీసం లక్ష ఇండ్లకు ఈనెల 31వ తేదీలోగా గృహప్రవేశాలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన శుభ ముహూర్తాలను ప్రభుత్వం త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తుందని తెలిపారు. మంజూరైన

తరువాయి 12లో



## ట్రంప్, బైడెన్, నిక్కీహేలీ హత్యకు
# ఇరాన్ ఐఆర్‌జిసి కుట్ర!

### ఫెడరల్ జ్యూరీ ఎదుట పాకిస్థాన్ వ్యాపారి సాక్ష్యం

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, మాజీ అధ్యక్షుడు జో బైడెన్, రిపబ్లిక్‌పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా గతంలో ముందుకు వచ్చిన దక్షిణ కరోలినా గవర్నర్ నిక్కీహేలీలను హత్య చేసేందుకు వారి శత్రుదేశం ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) కుట్ర చేసింది. ఐఆర్‌జిసి తనను ఇందులో భాగస్వామిగా చేసిందని పాకిస్థాన్ జాతీయుడు, ఆ దేశ వ్యాపారవేత్త ఆసిఫ్ మర్చంట్ (47) అమెరికా ఫెడరల్ జ్యూరీ ఎదుట సాక్ష్యం చెప్పారు. ఐతే అతడు చెప్పిన కథనానికి తగిన ఆధారాలు లేవని జ్యూరీ తోసిపుచ్చింది. 2024 జులై 12వ తేదీన పాకిస్థాన్‌కు విమానంలో తిరిగి వెళ్ళిపోయేందుకు సిద్ధమవుతుండగా అతడిని అరెస్టు చేశారు. ప్రముఖులను హత్య చేసేందుకు అతడు నియమించుకున్న కిరాయి నేరస్థులకు 5,000 డాలర్లు చెల్లించాడు. ఐతే కిరాయి నేరస్థులుగా అతడి వద్దకు వచ్చినవారంగా ఎఫ్‌బిఐ ఏజెంట్లే. మీరు వీలు కాకపోతే ఎవరినైనా చంపవచ్చునని కూడా ఆసిఫ్ మర్చంట్ వారితో చెప్పిన విషయాల రికార్డింగ్‌ను కూడా కోర్టులో సాక్ష్యంగా ఇచ్చారు. వ్యాపార భాగస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఒత్తిడిచేస్తూ న కుటుంబాన్ని బెదిరించి తనను ఐఆర్‌జిసి ఈ ఊబిలోకి లాగిందని ఆయన చెప్పాడు. 47 ఏళ్ళు వయసుగల పాకిస్థాన్ జాతీయుడు ఆసిఫ్ బ్రూక్లిన్‌లోని మర్చంట్ ఫెడరల్ కోర్టులో తన వాదన వినిపించాడు. ఉగ్రవాదం,హత్యకుట్ర, ఇతరులతో భాగస్వామ్యం అనే అరోపణలపై అతడు అరెస్టయ్యాడు. ఈ కేసులో అతడే ఉర్దూ భాషలో తన వాదన వినిపించగా దానిని న్యాయమూర్తికి తెలియజేసేందుకు మధ్యవర్తి అనువాదకుడు సహాయం అందించాడు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో తన భార్య, దత్తపుత్రిక ఉన్నారని, వారి ప్రాణాలకు హాని జరగకూడదనే భయంతో ఈ నేరానికి తాను అంగీకరించానని ఆసిఫ్ కోర్టుకు తెలియజేశాడు. ఈ పని ఇష్టపూర్వకంగా చేయాలని తాను కోరుకోలేదన్నాడు. అమెరికా వెళ్ళి హత్యకు ఏర్పాట్లు చేసుకోవాలని 2024లో ఐఆర్‌జిసికి చెందిన అధికారి మొహర్దాద్ యూసుఫ్ చెప్పాడని, అమెరికాలో పత్రాలు దొంగిలించి, నిరసన కార్యక్రమాలు నిర్వహించి మనీ లాండరింగ్ వంటి చర్యల ద్వారా నేరస్థులను నియమించుకుని నాలుగు దశల్లో హత్యకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించాడని ఆసిఫ్ జ్యూరీకి చెప్పాడు. ఎవరిని చంపాలో చెప్పలేదని, కానీ మాటల సందర్భంగా ట్రంప్,జో బైడెన్,నిక్కీ హేలీ పేర్లను ఆయన గట్టిగా చెప్పాడని జ్యూరీకి తెలియజేశాడు. ఇమ్మిగ్రేషన్ అధికారులు తనను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నప్పుడు కూడా తనకు నిజాలు తెలుసునని, ఇరాన్ అధికారులు ఆదేశం ఇచ్చాక తాను అమెరికా పెట్టినప్పుడే తన అంతం ఆరంభమైందని భావించానని చెప్పాడు.

## చర్చల్లేవ్-బేషరతుగా
# లొంగిపోవాల్సిందే

- 32 ఇరాన్ యుద్ధ నౌకలను నీట ముంచేశాం : ట్రంప్
- గగనతల, నౌకాదళాలను పూర్తిగా నాశనం చేశాం
- మూడు వంతుల ఇరాన్ నాయకత్వాన్ని చంపేశాం



**దుబాయ్:** ఇరాన్ ప్రభుత్వం బేషరతుగా లొంగిపోవాల్సిందేనని, రెండోవారంలో చాలా తీవ్రస్థాయిలో దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శనివారం కరాఖండీగా చెప్పారు. దీనిపై ఇరాన్ కూడా తీవ్రంగా ప్రతిస్పందిస్తూ ఎట్టిపరిస్థిల్లోనూ లొంగిపోయేది లేదని స్పష్టం చేసింది. వారితో (ఇరాన్ పాలకులు) ఒక ఒప్పందం చేసుకోవాలని తాను కోరుకోవడంలేదని, బేషరతుగా లొంగిపోయినప్పుడే మాట్లాడతామని, అప్పటివరకూ ఆ ఆస్కారమే లేదని ట్రంప్ అన్నారు. ఇరాన్ గగనతల దళాన్ని, నౌకాదళాన్ని పూర్తిగా నాశనం చేశామని ప్రకటించారు. ఇరాన్ వ్యతిరేక యుద్ధం బ్రహ్మాండంగా కొనసాగుతోందని చెప్పారు. రష్యా ప్రమేయాన్ని ఆయన పూర్తిగా తోసిపుచ్చుతూ, అమెరికా వద్ద చాలినన్ని ఆయుధాలు ఉన్నాయని మరోసారి ఉద్ఘాటించారు. రక్షణరంగ కాంట్రాక్టర్లతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. "యుద్ధం రెండోవారంలోకి ప్రవేశించింది, ఈసారి వారమంతా దాడులు చాలా భయంకరంగా ఉంటాయి, ఇప్పటివరకూ ఇరాన్‌కు చెందిన 32 యుద్ధ నౌకలను నీట ముంచేశాం, మూడు వంతులమంది ఇరాన్ నాయకులను హతమార్చాం, ఇరాన్‌లోని అనేక స్థావరాలు ధ్వంసమయ్యాయి, ఇప్పటివరకూ వేలాది లక్ష్యాలపై దాడులు చేశాం, ఇరాన్ గగనతలాన్ని పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకునే దశలో ఉన్నాం, ఇరాన్ పాలకులు ఇక లొంగిపోవడం తప్ప వేరేమార్గం లేదు, బేషరతుగా వారు లొంగిపోవాలి, కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి అవకాశం ఇవ్వాలి, బేషరతుగా లొంగిపోకుండా వారితో మాట్లాడే అవకాశం లేదు' అని ట్రంప్ హెచ్చరించారు.బేషరతుగా ఇరాన్ లొంగిపోతేనే యుద్ధం ముగుస్తుందని ఆయన అన్నారు. అమెరికా వైట్‌హౌస్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ నాయకత్వాన్ని పూర్తిగా చాపచుట్టి పారేయాలని ఆయన యుద్ధరంగంలో ఉన్న బలగాలకు పిలుపు ఇచ్చారు. ఇరాన్ సర్వాధినేత ఆయెతొల్లా అలీ ఖమేనీ ఫిబ్రవరి 28న దాడుల్లో మరణించిన తర్వాత ఆయన కుమారుడు మోర్తాజా ఖమేనీ తదుపరి వారసుడుగా ఎన్నికైనట్లు అస్పష్ట వార్తలు వెలువడిన తర్వాత ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మోర్తాజా అసమర్థ నాయకుడు, బలహీనుడు, దేశ ఆర్థిక,సైనిక,పరిపాలనాపరమైన వ్యవహారాలన్నింటినీ సమగ్రంగా చూసుకోలేడు, ఆయన కిందివారే ఆయన పేరుచెప్పి పెత్తనంచేసే పరిస్థితి ఉంది, అందువల్ల ఒక బలమైన నాయకుణ్ణి ఇరాన్ ఎన్నుకునేందుకు వీలుగా ఈ ఎన్నికల్లో తాను జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. అదేసమయంలో ఇరాన్ ప్రజలు అధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి వీలుగా గడచిన జనవరినెలలో వారిని అణచివేతకు గురిచేసిన సైనికబలగాలను గణనీయంగా బలహీనపరిచామని కూడా చెప్పారు.

## లెబనాన్‌లో హెజ్బొల్లా-ఐడిఎఫ్ యుద్ధం తీవ్రం
# బెక్కాపై దాడిలో 26 మంది మృతి

- గాయపడిన ఇజ్రాయెల్ ఆర్థికమంత్రి కుమారుడు
- వారం రోజుల్లో 500 హెజ్బొల్లా స్థావరాలపై దాడులు
- నిరాశ్రయులైన మూడు లక్షలమంది ప్రజలు



**బీరూట్:** లెబనాన్‌లోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ దళాలు వారం రోజులుగా 500 హెజ్బొల్లా స్థావరాలపై తీవ్ర దాడులు చేశాయి. హెజ్బొల్లా—ఐ.డి.ఎఫ్ మధ్య ఘర్షణ కొనసాగుతోంది. బెక్కాపై శనివారం ఐ.డి.ఎఫ్ దాడుల్లో 26 హెజ్బొల్లా దళాలు మరణించాయి. బాక్‌బక్‌పై చేసిన దాడిలో ముగ్గురు మరణించారు. బీరూట్ శివారు ప్రాంతాలలోనూ ఐ.డి.ఎఫ్ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా 70 రాకెట్లు ప్రయోగించింది. లెబనాన్—సిరియా సరిహద్దుల్లో హెజ్బొలా చేసిన రాకెట్ దాడిలో ఎనిమిదిమంది ఇజ్రాయెల్ సైనికులు గాయపడ్డారు. గాయపడినవారిలో ఇజ్రాయెల్ ఆర్థికమంత్రి బెత్‌జెలెన్ స్మోత్రిక్ కుమారుడు కూడా ఉన్నారు. గాయపడి వారిలో ఐదుగురి పరిస్థితి ప్రకమాదకరంగా ఉంది. పర్వత ప్రాంత పట్టణం నబీచిట్‌పై శనివారం తెల్లారేవరకూ ఇజ్రాయెల్ చేసిన గగనతల దాడుల్లో 16మంది మరణించారని, మరో 35 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్యశాఖాధికారులు చెప్పారు. ఇజ్రాయెల్ సైన్యం ప్రజల ఇళ్ళను ఖాళీ చేయించడంతో శరణార్థ సంక్షోభం తలెత్తిందని లెబనాన్ ప్రధానమంత్రి నవాఫ్ సలామ్ చెప్పారు. హెజ్బొల్లా—ఇజ్రాయెల్ ఐ.డి.ఎఫ్ దళాల మధ్య ప్రత్యక్ష పోరాటం,కాల్పుల యుద్ధం జరుగుతోంది. శనివారం మరోవైపు లెబనాన్—సిరియా సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశించేందుకు ఇజ్రాయెల్ దళాలు ప్రయత్నం చేయడంతో శనివారం ఉదయం నుండీ ఘర్షణలు ప్రారంభమైందనీ, హెజ్బొల్లా సైన్యం వారితో పోరాడుతోందని ఈ సంస్థ పేర్కొంది. దీనిపై ఇజ్రాయెల్ రక్షణ బలగాలనుండి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇరాన్‌పై ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభం కాగానే మద్దతుగా తాము కూడా ఇజ్రాయెల్‌పై పోరాటం ప్రారంభిస్తామని హెజ్బొల్లా ప్రటికటించి దాడులు చేయడంతో లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ సైన్యం ప్రవేశించింది. లెబనాన్ తూర్పు పర్వత ప్రాంతంలో పోరాటం జరుగుతోందని నేషనల్ న్యూస్ ఏజన్సీ ప్రకటించింది. నబీషీట్‌ను లక్ష్యంగా చేసుకుని ఐడిఎఫ్ శుక్రవారం 13 దాడులు చేసినట్లు పేర్కొంది. లెబనాన్‌లో ఉన్న ఐక్యరాజ్యసమితి శాంతిదళంలోని ఘనాదేశ సైనికుల కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. గడచిన సోమవారం ఇజ్రాయెల్ ఐ.డి.ఎఫ్ దళాలు లెబనాన్‌లో ప్రవేశించిన తర్వాత మారుమూల ప్రాంతాలకు చొచ్చుకువెళ్ళాయి. అనేక గ్రామాలను, పట్టణాలను ఖాళీ చేయాలని ప్రజలకు ఆదేశాలు ఇవ్వడంతో ప్రజలు దాడుల భయంతో ప్రాణాలు కాపాడుకునేందుకు ఇళ్ళు వదలి వెళ్ళిపోయారు. ఇప్పటివరకూ ఈ విధంగా 3,00,000 మంది నిరాశ్రయులైనట్లు నార్వేకు చెందిన శరణార్థం సంఘం పేర్కొంది. వీరిలో దాదాపు 60,000మంది శివారు ప్రాంతంలో ఐక్యరాజ్యసమితి శిబిరాలలో తలదాచుకున్నారు. గతవారం రోజులుగా లెబనాన్ నుండి 50,000 మంది లెబనాన్ నుండి సిరియాకు తిరిగి వెళ్ళిపోయారు. హెజ్బొల్లాను పూర్తిగా నిరాయుధులను చేసేవరకూ తాము లెబనాన్‌ను వీడి వెళ్ళేదేలేదని ఇజ్రాయెల్ సైన్యం ముందుగానే ప్రతిజ్ఞ చేసింది.

# పాకిస్థాన్‌లో 15 మంది ఉగ్రవాదులు కాల్చివేత



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ భద్రతా దళాలు చేసిన వేరు వేరు దాడుల్లో 15 మంది ఉగ్రవాదులు మరణించారు. బలూచిస్థాన్ రాష్ట్రంలోని వేరువేరు ప్రాంతాలలో గూఢచారి వర్గాల సమాచారం మేరకు ఈ దాడులు జరిగాయని ఆర్మీ శనివారం ప్రకటించింది. ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం సమాచారం మేరకు ఆర్మీ దాడులు చేసింది. మొదటిదాడి బలూచిస్థాన్‌లోని హర్నాయ్ జిల్లాలో జరిగిది. ఖవారిజ్ రక్షస్యస్థావరాన్ని దెబ్బతీశారు. ఈ దాడిలో 12 మంది ఉగ్రవాదులు మరణించారు. టెహ్రీక్—ఏ—తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాదులపై రెండేళ్ళుగా పాకిస్థాన్ ప్రభుత్వం తీవ్రస్థాయిలో గాలింపు చర్యలు కొనసాగిస్తూ ఎదురుకాల్పుల్లో వారిని మట్టుపెడుతోంది. బసీమా జిల్లాలో చేసన రెండోదాడిలో మరో ముగ్గురు మరణించారు. ఆయుధాలు, ఆయుధ సామాగ్రి కూడా స్వాధీనం చేసుకున్నారు.

**ఉక్రేన్—రష్యా పరస్పర దాడులు.. దాడుల్లో ఏడుగురు ఉక్రేనియన్లు మృతి**

కీవ్:ఉక్రేన్‌లో రష్యా ప్రయోగించిన క్షిపణి దాడుల్లో కనీసం ఏడుగురు మరణించారు. మరో పదిమంది గాయపడ్డారు. ఉక్రేన్ ప్రయోగించిన 124 మానవ రహిత వాహనాలను రష్యా గగనతల వ్యవస్థ రష్యా ధ్వంసం చేసింది. అదేవిధంగా 200 ఫిక్సెడ్ వింగ్ డ్రోన్లను కూడా రష్యన్ ఆర్మీ కూల్చివేసింది. దాడులకు ప్రతిగా 22 ప్రాంతాలపై రష్యా ఎదురుదాడులు చేసినట్లు రష్యన్ పత్రికలు పేర్కొన్నాయి. రష్యా దాడులవల్ల కీవ్ ప్రాంతంలోని మూడు జిల్లాలో తీవ్ర నష్టం జరిగింది. ఉక్రేన్‌లో రెండవ అతిపెద్ద నగరం ఖార్ఖివ్‌లోని ఐదు అంతస్తుల ఒక అపార్ట్‌మెంట్ బ్లాక్‌లో దాడులవల్ల ముగ్గురు మరణించారు. గాయపడినవారిలో పిల్లలు కూడా ఉన్నారు. ఈ దాడులను ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రపంచదేశాలు ఈ దాడులను ఖండించాలని కోరారు. శనివారం తెల్లవారకముందే రష్యా 29 క్షిపణులు, 480 డ్రోన్లతో దాడులు చేసిందని రాజధాని కీవ్, సెంట్రల్ రీజియన్‌లోని ఇతర ప్రాంతాలలో ఉన్న ఇంధన వనరుల మౌలిక కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని ఆయన చెప్పారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఉక్రేన్ రక్షణ వ్యవస్థ 19 క్షిపణులను,453 డ్రోన్లను కూల్చివేసింది. 22 ప్రాంతాలపై ఈ దాడులు జరిగాయి. అత్యవసర సిబ్బంది శిథిలాలు తొలగించి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.దక్షిణ ఒడెసా రీజియన్‌లో భారీ ఎత్తులన మంటలు చెలరేగడంతో 80 అగ్నిమాపకదళాలను రంగంలోకిదించారు. రైల్వే మౌలిక సదుపాయాలకు కూడా తీవ్ర నష్టం కలిగింది. "ఉక్రేన్ నివాసిత ప్రాంతాలను ధ్వంసం చేసి రష్యా తప్పించుకోలేదు, కీలక మౌలిక సదుపాయాలను రష్యా ధ్వంసం చేస్తోంది, దీనికి జవాబుదారీ వహించాలి, ఈ విషయంలో యూరోపియన్ భాగస్వాములతో తగిన చర్యలు తీసుకుంటాను'' అని జెలెన్‌స్కీ ఎక్స్‌వేదికగా పర్కొన్నారు. యుద్ధం మొదలైనప్పటినుండి వేలాది క్షిపణులను రష్యా తమ దేశంపై ప్రయోగించిందని ఆయన విమర్శించారు.

## హౌసింగ్ బోర్డు పరిధిలోని
# 5 వేల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలి

### హౌసింగ్ బోర్డు రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమం'లో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి శనివారం సచివాలయంలో ప్రారంభించారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డ్ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఇండ్లు, ఫ్లాట్లు, స్థలాలను వాయిదాల రూపంలో కొనుగోలు చేశారని, ఇందులో కొంత మంది అసలు మరికొంత మంది వడ్డీలు చెల్లించాలని, ఇంకొంత మంది వాయిదాల గడువు ముగిసిపోయిందని ఈ విధంగా దాదాపు ఐదు వేల మంది తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందని మంత్రికి అధికారులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదని, పూర్తి సమాచారం పోర్టల్‌లోనే ఉంటుందన్నారు. కేటాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ, ఇతర లావాదేవీల పర్యవేక్షణను ఒకే వేదిక ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చన్నారు. డిజిటల్ విధానం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, పౌరులకు సేవలు మరింత చేరువవుతాయని, ఇది హౌసింగ్ బోర్డు, అలాటీల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండి వి.పి.గౌతమ్, సిఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భగ్గుమన్న గ్యాస్ ధరలు (మొదటి పేజీ తరువాయి)

చమురు ఆంక్షలపై అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ చేసిన వ్యాఖ్యల తర్వాత డిమిత్రియేవ్ ప్రకటన విడుదలైంది. అమెరికాలో చమురు ధరలు పెరిగాయి. ఒక గ్యాలన్‌కు గ్యాసోలైన్ ధర 3.50 శాతం నుండి 3.75 శాతం వరకూ పెరిగింది. డీజిలు ధర పెరడగంవల్ల రవాణా, షిప్పింగ్ కార్యకలాపాలు కూడా ఖరీదైన వ్యవహారంగా మారింది. వ్యవసాయరంగంలో కూడా పనుల వ్యయాలు, ఉత్పాదక వ్యయాలు గణనీయంగా పెరుగుతాయ. అమెరికాలో డీజిలు ధర ఒక గ్యాలన్‌కు 4.33 డాలర్లు పెరిగింద. ఒక్కవారం రోజుల్లోనే అమెరికాలో చమురు ధర 15శాతం పెరిగింది. 2023 నవంబరునెల తర్వాత ఇంత భారీగా చమురు ధరల పెరుగుదల మళ్ళీ ఇదే మొదటిసారి. అదేవిధంగా రష్యా నుండి 30 రోజులపాటు భారతదేశం చమురు కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు అమెరికా వాణిజ్యమంత్రి స్కాట్ బెస్సెంట్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్‌తో మోదీ ప్రభుత్వం తీవ్ర విమర్శల పాలైంది. గ్యాస్ ధర పెరుగుదలవల్ల ఎరువుల ఉత్పత్తి కూడా తీవ్రంగా దెబ్బతినే పరిస్థితి వచ్చింది. దక్షిణ కొరియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భారత్,శ్రీలంక వంటి అనేక చిన్న దేశాలు ఖతార్ నుండి వచ్చే సహజవాయువుపైనే ఆధారపడి బ్రతుకుతున్నాయి. మరోవైపు అమెరికాలో చమురు ధరలు విపరీతంగా పెరగుతున్నాయి. దక్షిణ కొరియాలో ఈ వారాంతానికి చమురు నిల్వలు అడుగంటే పరిస్థితి వస్తోంది. భారత్‌లో కూడా శనివారం తెల్లారకముందే రాత్రికి రాత్రే వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వంటగ్యాస్ సిలిండరు ధర రూ.60లు పెరిగింది. ఢిల్లీలో ఎల్‌పిజి సిలిండరు ధర రూ.913లుగా ఉండేది. ఇక అమెరికాలో కూడా చమురు ధరలు పెరిగాయి. పాకిస్థాన్‌లో లీటరు పెట్రోలు ధర ఇప్పటివరకూ రూ.32లు ఉండగా అమాంతంగా ఈ ధర రూ.55లకు చేరుకుంది. ఇప్పటివరకూ రూ.36లుగా ఉండే డీజిలు ధర కూడా అనూహ్యంగా బాగా పెరిగింది. భారతదేశంలో కమర్షియల్ అవసరాలుకు ఉపయోగించే 19 కేజీల గ్యాస్ సిలిండరు ధర ఒక్కసారిగా రూ.115లు పెరగడంతో మొత్తం ధర ఇప్పుడు రూ.1930 ల నుండి రూ. 2045.50 లకు చేరింది. ఐతే మోదీ ప్రభుత్వం ఉజ్వల పథకం ద్వారా ఇచ్చే గ్యాస్ సిలిండరు ధరలో మార్పులేదు. కాగా ఎల్‌పిజి ఉత్పత్తులు పెంచాలని రిఫైనరీలకు కేంద్రం ఆదేశించింది. దేశీయ వినియోగదారులకు మాత్రమే విక్రయించాలని కూడా పేర్కొంది.

# గల్ఫ్‌పై దాడులు చెయ్యం

(మొదటి పేజీ తరువాయి)

భీకరమైన దాడులతో దేశాన్ని కుదిపేయడంవల్ల ఇస్లామిక్ రిపబ్లిక్ ఇరాన్ సాయుధ బలగాలను టెహ్రాన్ రాజకీయ నాయకత్వం అదుపు చేయలేకపోయిందని అన్నారు. అదే విధంగా బేషరతుగా లొంగిపోవాలంటూ అమెరికా పదే పదే చేస్తున్న డిమాండ్‌ను కూడా ఆయన తిరస్కరించారు. లొంగిపోయే ప్రశ్నేలేదు' అని స్పష్టం చేశారు. ఇరాన్ లొంగిపోవాలనే కలను అమెరికా ఇక ఖనం చేయాలన్నారు. 'పొరుగుదేశాలకు మేం క్షమాపణ చెప్పాలి, ఇకమీదట వారు (ఇరాన్ దళాలు)దాడులు చెయ్యరు, మనం సమస్యలను ఇక దౌత్యమార్గంలో పరిష్కరించుకోవాలని నేను భావిస్తున్నానన్నారు. ఇరాన్ సాయుధ బలగాల అధికార ప్రతినిధి జనరల్ అబ్దొల్‌ఫజల్ షెకార్చీ కూడా స్పందిస్తూ, ఇరాన్‌పై దాడి చేసేందుకు అవకాశం ఇచ్చి స్థావరాలు సమకూర్చి దేశాలపై దాడులు చెయ్యబోమని అన్నారు. దీంతో వీరిద్దరి ప్రకటనలమధ్యా పొంతన కనిపించలేదు. గల్ఫ్ అరబ్ దేశాలలోని స్థావరాల నుండి అమెరికా,ఇజ్రాయెల్ దేశాలు రెండూ ఇరాన్‌పై ఎలాంటి దాడులూ చేయలేదు. ఇరాన్‌పై దాడులు చేసేందుకు తమ దేశాలను అనుమతించబోమని గల్ఫ్ దేశాలు ముందుగానే ప్రకటించాయి. అందుకు తగ్గట్టుగానే కట్టుబడి ఉన్నాయి.

ఇరాన్ అధ్యక్షుడు తన ప్రకటన విడుదల చేసేందుకు చేసేందుకు చాలా ఆదరాబాదరాగా వీడియో షూటింగ్ చేసినట్లు స్పష్టమైంది. వృత్తిపరమైన నిపుణులు పెజెష్కియన్ ప్రకటనను వీడియో షూటింగ్ తీయలేదని చూడగానే అర్థమవుతున్నది. చరిత్రలో మరచిపోని విధంగా శనివారం (మార్చి 7) దాడులు చేస్తామని, ఇరాన్ నాయకత్వంలో మరింతమందిని లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరిక జారీ చేసిన తరుణంలో ఈ ప్రకటన వెలువడింది. ఎవరు యుద్ధం ప్రారంభించారో వారే చర్చలకు ప్రతిపాదన చేయాలని కూడా పెజెష్కియన్ తొలుత ఒక ప్రకటనలో తెలిజేశారు.

అమెరికా—ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ మరణించిన మరునాడే ముగ్గురు సభ్యులతో ఒక తాత్కాలిక పాలనా మండలిని ఇరాన్ అసెంబ్లీ ఎన్నుకుంది. ఈ మండలిలో అధ్యక్షుడు పెజెష్కియన్‌తోపాటు ఇరాన్ సర్వోన్నత న్యాయస్థానం అధిపతి ఘోలం హస్సేన్ మెహస్సెనీ ఎజీ, ఇరాన్ తొలి సర్వాధినేత రుహొల్లా ఖమేనీ కుమారుడు, మతాధిపతి ఆయెతొల్లా అలిరెజా అరాఫీ ఈ తాత్కాలిక పాలనా మండలి సభ్యులుగా ఉన్నారు.

పశ్చిమదేశాలపై మార్చి ఒకటో తేదీన ఇరాన్ యుద్ధం ప్రారంభించిన తర్వాత మొదటిసారి ఆ దేశాధ్యక్షుడు పెజెష్కియన్ ఈ విధమైన ప్రకటన చేశారు. యుద్ధం మొదలై వారం రోజులుపూర్తయింది. పశ్చిమాసియా అంతటికీ యుద్ధం వ్యాపించింది. అమెరికా ఈ ప్రాంతంలోని మిత్రదేశాలలో ఏర్పాటు చేసుకున్న స్థావరాలు, మౌలిక సదుపాయాలపై వందలు,వేలు క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ముఖ్యంగా అమెరికా దౌత్యకార్యాలయాలు, కాన్సొలేట్ భవనాలను ధ్వంసం చేసింది. దీంతో దాదాపు 9000 మంది అమెరికన్ జాతీయులను ఈ ప్రాంతం నుండి ట్రంప్ ప్రత్యేక ఛార్టర్డ్ విమానాలలో తరలించారు.

# రూ.60 జంప్

(మొదటి పేజీ తరువాయి)

14.2 కిలోల గృహ ఎల్‌పిజి సిలిండర్ ధర ఇప్పుడు రూ.913కి పెరిగింది. ముందుగా ఇది రూ.853గా ఉండేది. ఉజ్వల యోజన లబ్ధిదారులు 2016 నుండి ఉచిత ఎల్పీజి కనెక్షన్ పొందిన 10 కోట్లకు పైగా పేదలు కూడా అదే మొత్తంలో ధర పెరుగుదలను భరించాల్సి ఉంటుంది. సంవత్సరంలో 12 రీఫిల్‌లకు వారు పొందే బాటిల్‌కు రూ.300 సబ్సిడీని పరిగణనలోకి తీసుకున్న తర్వాత వారు ఇప్పుడు 14.2 కిలోల సిలిండర్‌కు రూ. 613 చెల్లించాలి. ఒక ఏడాదిలోనే గృహ గ్యాస్ ధరలు పెరగడం ఇది రెండోసారి. చివరిసారిగా గత ఏడాది ఏప్రిల్‌లో రూ.50 పెంచించారు. హైదరాబాద్‌లో ఈ వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.965కు చేరింది. అలాగే ముంబయి, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్‌లో ఎల్‌పిజి ధరలు వరుసగా రూ.రూ.912.50, రూ.939, రూ. 928.50గా ఉన్నట్లు ఐఒసి తెలిపింది. స్థానిక పన్నులు (వ్యాట్ లేదా సేల్స్ ట్యాక్స్) ఆధారంగా రాష్ట్రాల మధ్య ధరల్లో తేడాలు ఉంటాయి. అయితే ఈ కొత్త ధరలను పొరుగు దేశాలతో పోలిస్తే భారత్‌లో వంట గ్యాస్ ధర అత్యల్పంగా ఉందని అధికారులు అంటున్నారు.

**వాణిజ్య సిలిండర్ ధరల్లో భారీ పెంపు**

హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య సంస్థలు ఉపయోగించే 19 కిలోల కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ.114.5 పెంచారు. దీంతో ఢిల్లీలో ఈ సిలిండర్ ధర ఇప్పుడు రూ. 1,883కి చేరింది. అదే ముంబయిలో కోల్‌కతా, చెన్నైలో వాణిజ్య సిలిండర్ ధరలు వసరుసగా రూ.1835, రూ.1990 రూ.2043కి చేరుకున్నాయి. మార్చి 1న ఇప్పటికే రూ.28 పెంచింది. ఇది రెండోసారి పెంపు. ఈ ఏడాది ఇప్పటివరకు కమర్షియల్ ఎల్‌పిజి ధరలు మొత్తం రూ.302.50 మేర పెరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు ఇంకా కొనసాతున్నాయి. దాడులు, ప్రతిదాడులతో యుద్ధం రెండో వారానికి చేరింది. దాడుల నేపథ్యంలోనే ఇప్పటికే ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసింది. దీంతో ప్రపంచ ఇంధనంపై భారీగా ప్రభావం పడింది. ఇంధన లభ్యతపై ఆందోళనలు వ్యక్తం కావడంతో ఇటీవల కేంద్ర పెట్రోలియం శాఖమంత్రి హర్దీప్ సింగ్ పురి స్పందించారు. పౌరలకు అందుబాటు ధరలో ఇంధనం లభ్యమయ్యేలా చూడటం తమ ప్రాధాన్యత అని అన్నారు. దేశంలో ఎలాంటి ఇంధ కొరతా లేదని పేర్కొన్నారు. దీనిపై అందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. మరోవైపు దేశంలో పెట్రోల్, డీజిల్ కొరతపై చక్కర్లు కొడుతున్న ప్రచారాలను ఐఒసి కూడా తోసిపుచ్చింది. ముడిచమురు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్పీజీ విషయంలో భారత్ సౌకర్యవంతమైన స్థితిలోనే ఉందని శుక్రవారం ప్రభుత్వ వర్గాలు భరోసా ఇచ్చాయి. హర్మూజ్ అంతరాయాల వేళ వేర్వేరు సోర్సుల నుంచి దేశానికి భారీ స్థాయిలో ఇంధనం లభ్యమవుతోందని పేర్కొన్నాయి.

**గ్యాస్ ధర పెంపుపై నిరసనలు తెలుపుతాం : మమతా బెనర్జీ**

ఎల్‌పిజి ధరల పెరుగుదలపై తృణమూల్ కాంగ్రెస్ మహిళా విభాగం వీధుల్లో నిరసనలు నిర్వహిస్తుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. కేంద్రం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఎల్‌పిజి ధరలను ఏకపక్షంగా పెంచుతోందని మండిపడ్డారు. 'ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఎల్‌పిజి ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు నిర్వహించాలని మహిళలను కోరాలని చంద్రిమ (రాష్ట్ర మంత్రి, టిఎంసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమ భట్టాచార్య)ను నేను కోరుతున్నాను. అవసరమైతే, నల్ల దుస్తులు ధరించండి. మేము ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా నిరసన తెలుపుతాము' అని ఆమె అన్నారు.

బిజెపిని విమర్శిస్తూ శుక్రవారం వారు ఎల్‌పిజి ధరను రూ.60 పెంచారు. ఆపై గ్యాస్ బుకింగ్ కోసం 21 రోజుల లాక్‌ఇన్ పీరియడ్ పెట్టారు. వారి సిలిండర్ అయిపోతే ప్రజలు ఏమి చేస్తారు? వారు ఈ సమస్యల గురించి ముందుగానే ఆలోచించకూడదా? వారు కిరోసిన్ కోటాను కూడా తగ్గించారు. మీరు బలవంతంగా ధరలను పెంచుతున్నారు. మీరు ఇవన్నీ ముందుగానే ఎందుకు ప్లాన్ చేయలేదు? మీరు ఈ విషయాల గురించి ఎందుకు ఆలోచించలేదు? అని బెనర్జీ నిలదీశారు.

# గణపతీ లొంగిపోండి

(మొదటి పేజీ తరువాయి)

21 ఇన్‌సాస్ రైఫిళ్లు, 20 ఎస్ఎల్‌ఆర్ రైఫిళ్లు, 18 .303 రైఫిళ్లు, అలాగే 33 ఇతర తుపాకులు ఉన్నాయి. ఈ సందర్భంగా డిజిపి శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్, ఎస్ఐబి చీఫ్ బి.సుమతిలతో కలిసి ఆయుధాలను పరిశీలించిన అనంతరం మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి ఎలాంటి ప్రాణహాని కలగకుండా భరోసా కల్పించిన పోలీసు ఉన్నతాధికారులను ఆయన అభినందించారు. అజ్ఞాత మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి వచ్చి, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. లొంగిపోయే మావోయిస్టులకు ప్రాణరక్షణ కల్పించడంతో పాటు, సాధారణ జీవితం గడిపేందుకు ప్రభుత్వం అన్ని రకాల సాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు. భారతదేశం శాంతియుత మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించాలనే సిద్ధాంతాన్ని నమ్మే దేశమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహాత్మగాంధీ శాంతియుత పోరాటంతోనే స్వాతంత్ర్యాన్ని సాధించారని గుర్తుచేశారు. ఎంత పెద్ద సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని ఆయన తెలిపారు. ఇటీవల లొంగిపోయిన దేవ్‌జీ, దామోదర్ తదితర కేంద్ర కమిటీ సభ్యులతో సమావేశమై వారి ప్రతిపాదనలు వినిపించుకున్నట్లు సిఎం వెల్లడించారు. ఆ ప్రతిపాదనలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు తెలంగాణలో మొత్తం 721 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. లొంగిపోయిన వారికి మెరుగైన వైద్య సేవలు, నివాసానికి ఇందిరమ్మ ఇళ్లు, ఆర్థిక ప్యాకేజీలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఆర్థిక ప్యాకేజీ పెంపుపై త్వరలో అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో హింసకు స్థానం లేదని, సమస్యలను బుల్లెట్ ద్వారా కాకుండా బ్యాలెట్ ద్వారా పరిష్కరించుకోవాలని సిఎం పిలుపునిచ్చారు. ఒకేసారి ఇంత మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోవడం గతంలో జరగలేదని పేర్కొన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములవుతూ ప్రజల సమస్యలను ప్రజాస్వామ్య మార్గాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. లొంగిపోయిన మావోయిస్టులకు వారిపై ఉన్న రివార్డులను సిఎం వారికి అందించారు. డిజిపి శివధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో మావోయిస్టు పార్టీ పూర్తిగా అంతరించుకుపోయిందన్నారు. అజ్ఞాతంలో ఉన్న మరో ఏడుగురు మావోయిస్టు నేతలు కూడా లొంగిపోతే మావోయిస్టు రహిత తెలంగాణగా మారుతుందన్నారు.

# బాంబుల మోత

(మొదటి పేజీ తరువాయి)

తమ చర్యలను ముమ్మరం చేశారు. తక్షణం యుద్ధం ముగించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ కోరారు. గల్ఫ్‌దేశాలపై ఇక దాడులు చేయబోమని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ క్షమాపణలు చెప్పినప్పటికీ మరోవైపు దాడులు కొనసాగాయి. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా, ఖతార్ తదితర దేశాలు ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను అడ్డుకున్నాయి. ఇరాన్ డ్రోన్ దాడిని సౌదీ అరేబియా విఫలం చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రైన్,ఖతార్, కువైత్, సైప్రస్,సౌదీఅరేబియాలలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ క్షిపణి,డ్రోన్ దాడులు కొనసాగాయి. పశ్చిమ ఆసియాలో 12 దేశాలపై ఇరాన్ ఆవిశ్రాంత దాడులు కొనసాగించిందని అమెరికాకు చెందిన సెంట్ కామ్ అధ్యయనం వెల్లడించింది. ఇరాన్‌పై టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ ఇంటర్నేషనల్ ఏర్‌పోర్టులో ఉన్న ఇరాన్ రివల్యూషనరీ గార్డుల క్వడ్స్ ఫోర్స్ ఉపయోగించే 16 ఎయిర్ క్రాఫ్టులను బాంబుదాడుల్లో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. పశ్చిమ ఆసియాలో ఉగ్రవాదాన్ని పెంచిపోషించేందుకు ఇరాన్ తరపున పనిచేసే క్వెడ్స్ ఫోర్స్ మెహ్రాబాద్ విమానాశ్రయాన్ని ప్రధాన కేంద్రంగా చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తోందని ఐ.డి.ఎఫ్ పేర్కొంది. ఈ కేంద్రం నుండే పశ్చిమాసియా అంతటా ఉగ్రవాదాన్ని పోషించేందుకు ఆయుధాలను, భారీగా నగదు కట్టలను విమానాల్లో ఉగ్రవాద దళాలకు సరఫరా చేస్తూ ఉంటారని, అలాంటి కీలకమైన కేంద్రాన్ని ధ్వంసం చేశామని పేర్కొంది. హెజ్బొల్లా ఉగ్రవాదులకు కూడా ఇక్కడి నుండే ఆయుధాలను ఎగుమతి చేస్తూ ఉంటారని తెలిపింది. యూరోపియన్ యూనియన్ దురాక్రమణ చర్యలకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరికలమధ్య ఫ్రాన్స్ మధ్యధరా సముద్రంలో హెలికాప్టర్ వాహక నౌకలను మోహరించింది.

# మహిళల రక్షణ కోసం పురుషులే.. బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలి




**వేధింపులను చూసీచూడనట్టు ఉన్నా నేరాన్ని ప్రోత్సహించినట్టే**

**మహిళల శక్తిసామర్థ్యాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన నమ్మకం ఉంది**

**సిఎం రేవంత్ రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలో మహిళల రక్షణ కోసం మగవారే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలబడాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఫిర్యాదులు, కేసుల నమోదుతో పాటు మహిళల భద్రతను ఒక సామాజిక బాధ్యతగానూ భావించాలన్నారు. ఆడపిల్లలను ఎవరైనా ఇబ్బందికి గురిచేసినప్పుడు నిలబడి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని యువతకు ముఖ్యమంత్రి సూచించారు. వేధింపులను చూసీచూడనట్టు ఉండటం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అవుతుందని సిఎం పేర్కొన్నారు. సొంత కుటుంబ సభ్యులకు ఎక్కడైనా వేధింపులు ఎదురైతే ఏ విధంగా స్పందిస్తామో, ఇతర ఆడపిల్లల విషయంలోనూ అదే తీరుగా ఆలోచించాలన్నారు. హైదరాబాద్ జెఎన్‌టియు క్యాంపస్ ఆడిటోరియంలో తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్టాండ్ విత్ హర్' క్యాంపెయిన్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. 'స్టాండ్ విత్ హర్' ప్రచార బ్రోచర్‌ను సిఎం ఆవిష్కరించారు. మహిళల భద్రత, గౌరవం, సమానత్వాన్ని కాపాడడంలో పురుషులు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాల్సిన అవసరాన్ని తెలియజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన విమెన్ సేఫ్టీ విభాగాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల భద్రతతో పాటు వారి ఆర్థిక స్వావలంబన కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. 'అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంలో కేవలం కార్యక్రమాల నిర్వహణతో బాధ్యత తీరిపోయినట్టు కాదు. మహిళను శక్తితో పోల్చుతాం. మహిళలను కుటుంబ గౌరవంగా భావిస్తాం. అలాంటిది మహిళలు నిత్యం అభద్రతా భావంతో బయటికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండకూడదు. ఈ దుస్థితిని నివారించేలా మనల్ని మనం సవరించుకోవాల్సిన సమయం వచ్చింది' అని సిఎం అన్నారు. 'ఒక మహిళ సారథ్యంలో ఉన్న పార్టీ ఇప్పుడు తెలంగాణలో ప్రభుత్వాన్ని నడుపుతోంది. దేశ స్వతంత్రానికి ముందు, ఆ తర్వాత కూడా మహిళలకు కీలక పదవులు, బాధ్యతలు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉంది. నాడు తెలంగాణ ఏర్పాటులోనూ మహిళామణులే కీలకంగా వ్యవహరించారు. మహిళల శక్తిసామర్థ్యాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన నమ్మకం ఉంది' అని సిఎం అన్నారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ శాఖలోని కీలక విభాగాలకు, ప్రభుత్వంలోని ముఖ్యమైన శాఖలకు మహిళలే అధికారిణులుగా ఉన్నారని, ఆడబిడ్డలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతమైతేనే ఆ రాష్ట్రం లేదా దేశం పురోగతి సాధించినట్టుగా భావించాలన్నారు. తెలంగాణలో ఓవైపు మహిళా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళ కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, వడ్డీలేని రుణాలు మహిళల పేరుమీదే ఇస్తున్నామని, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు, ఆర్‌టిసి బస్సులకు వారిని యజమానులుగా చేస్తున్నామని సిఎం వివరించారు. తెలంగాణ రైజింగ్–2047 విజన్ లక్ష్య సాధనలో మహిళల ముందడుగే కీలకమని, మహిళలు ఆర్థిక ప్రగతి సాధించడంతోనే తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుందని, మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించడంతోనే ఇవన్నీ నెరవేరుతాయన్నారు. గతంలో కొన్ని ప్రాంతాల్లోనో, బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు వేధింపులు ఎదురయ్యేవని, కానీ ఈ రోజుల్లో ఫిజికల్ క్రైమ్ కంటే ఆన్‌లైన్ క్రైమ్ పెరిగిపోయిందని, డీప్ ఫేక్ వీడియోలు తయారు చేస్తున్నారని, వీటిని నియంత్రించడానికి తెలంగాణ సైబర్ క్రైమ్ విభాగాన్ని కూడా పటిష్టం చేశామన్నారు. ఏదైనా జరిగినప్పుడు అమ్మాయిదే తప్పు అని నిందలు వేసే చెడు సంప్రదాయాన్ని మనం వదులుకోవాలని, ఇబ్బందుల్లో ఉన్న మహిళల కోసం 'స్టాండ్ విత్ హర్' అనే నినాదం తీసుకుని వారికి అండగా నిలబడాలని సిఎం అన్నారు. కార్యక్రమంలో సిఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి, విమెన్ సేఫ్టీ విభాగం అడిషనల్ డిజిపి చారు సిన్హా, సినీ నటుడు సాయి ధరమ్ తేజ్, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# ట్రంప్‌తో ప్రపంచ శాంతికి భంగం

**అమెరికాకు మోదీ ప్రభుత్వం దాసోహం**

**కమ్యూనిస్టు పార్టీలకు ప్రపంచ శాంతే శాశ్వత ఎజెండా**

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని ప్రభుత్వం అలీనోద్యమానికి నాయకత్వం వహించి, ప్రపంచ శాంతికి కృషి చేయగా, ప్రస్తుత మోదీ ప్రభుత్వం మాత్రం అమెరికాకు దాసోహమైందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలోని ఖనిజ సంపద, చమురు నిక్షేపాలపై అధిపత్యం కోసమే అమెరికా సామ్రాజ్యవాదం యుద్ధాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీలకు ప్రపంచ శాంతే శాశ్వత ఎజెండా అని ఆయన ఉద్ఘాటించారు. హైదరాబాద్ మగ్దూం భవన్‌లో శనివారం అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ రచించిన 'ప్రపంచ శాంతి కోసం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం' అనే పుస్తక పరిచయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఐఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించగా, పల్లా వెంకట్ రెడ్డితో పాటు మాజీ ఎంఎల్‌సి, ఐప్సో జాతీయ నాయకులు కె.యాదవ రెడ్డి, ఐప్సో నాయకులు ఓబేదుల్లా కొత్వాల్, డాక్టర్ డి.సుధాకర్, పి.ప్రేమ్ పావని హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ రెండు ప్రపంచ యుద్ధాలతో అనేక దేశాలు తీవ్రమైన సంక్షోభాల్లో కూరుకపోయాయన్నారు. సోవియేట్ యూనియన్ నేతృత్వంలో సోషలిస్ట్ శిబిరం ఉండటం వల్లనే మూడవ ప్రపంచ యుద్ధం రాలేదన్నారు. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక ప్రపంచ శాంతికి భగం వాటిల్లిందన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికాలు యుద్ధం చేస్తున్నాయని అన్నారు. ఇరాన్ కూడా సమర్థవంతంగా ఎదుర్కొంటున్నదని తెలిపారు. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేయడంతో అమెరికాకు మద్దతు ఇవ్వబోమని గల్ఫ్ దేశాలు ప్రకటించాయన్నారు. ఇరాన్‌ను సమర్థించే వారు జోక్యం చేసుకుంటే మూడవ ప్రపంచ యుద్ధం వస్తుందన్నారు. జవహర్ లాల్ నెహ్రూ అంతర్జాతీయంగా అలీనోద్యమాన్ని అమలు చేశారని, అప్పట్లో ప్రపంచ శాంతికి అలీనోద్యమం దోహదపడిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలతో ప్రపంచంలో ఆర్థిక మాంద్యం వచ్చే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా అనుమతిస్తేనే రష్యా నుండి చమురు దిగుమతి చేసుకునేందుకు వేచిచూడటం మోదీ సర్కార్ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కెవిఎల్ 24 పుస్తకాలు రాయడం సాధారణ విషయం కాదన్నారు. ప్రపంచ శాంతి కోసం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం అనే పుస్తకం ప్రతీ ఒక్కరూ చదవాలన్నారు.

**అమెరికాను గడగడలాంచిన క్యూబా**

సోవియేట్ యూనియన్ శిబిరంలో ఉన్న క్యూబా అమెరికాను గడగడలాడించిందని, క్యూబాను అమెరికా ఏమిచేయలేకపోయిందని పల్లా వెంకట్ రెడ్డి చెప్పారు. క్యూబా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోబోమని, దండయాత్ర చేయబోమని అమెరికా ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. కరోనా సమయంలో క్యూబా ప్రపంచ దేశాలకు వైద్యులను, మెడికల్ సిబ్బందిని పంపించి, వైద్యం సహాయం అందించిందని తెలిపారు.

**ఒక ఏడాది యుద్ధం ఖర్చుతో 200 ఏళ్లకు విద్య, వైద్యం వస్తుంది : యాదవ రెడ్డి**

యాదవరెడ్డి మాట్లాడుతూ ఒక ఏడాది యుద్ధానికి అయ్యే వ్యయంతో 200 ఏళ్లకు సరిపడే విద్య, వైద్యం ఉచితంగా అందించవచ్చన్నారు. ప్రస్తుతం జరుగుతున్నది మూడవ ప్రపంచ యుద్ధమే అన్నారు. యుద్ధాలను నివారించి, ఆయుధాలకు వ్యయం చేసే డబ్బుతో ప్రజల సంక్షేమానికి వినియోగించాలని కోరారు. శాంతికోసం ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ పోరాడుతున్నదన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమైతే పేదలకు మేలు జరుగుతుందన్నారు. కెవిఎల్‌శాంతి సంఘానికి విశేష సేవలు అందిస్తున్నారని అభినందించారు.

**కెవిఎల్ రచనలు స్ఫూర్తిదాయకం : డాక్టర్ డి.సుధాకర్**

డాక్టర్ డి.సుధాకర్ మాట్లాడుతూ కెవిఎల్ రచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. కెవిఎల్ రాసిన పుస్తకాలను క్యూబాలో ఆవిష్కరించామని గుర్తు చేశారు. ఐప్సో చరిత్రను కూడా పుస్తకంగా తీసుకొచ్చేందుకు కెవిఎల్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఉద్యమాలకు పుస్తకాలు ఉపయోగపడుతాయన్నారు. యుద్ధాలను నివారించాలని, వాటి కోసం అయ్యే వ్యయాన్ని పేదల విద్య, వైద్యం కోసం ఖర్చు చేయాలని కోరారు. జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి, శాంతి కోసం కృషి చేయాలన్నారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వం ఇరుగుపొరుగు దేశాలతో వైరం తెచ్చిందన్నారు. యుద్ధోన్మాదంతో రగిలిపోయే ఇజ్రాయిల్‌తో మాత్రం స్నేహం ప్రహం వ్యక్తం చేశారు.

**పుస్తకాలు సమాజానికి అందించడం గొప్ప విషయం : ఒబెదుల్లా కోత్వాల్**

ఓబెదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ కెవిఎల్ శాంతి సంఘంలో సభ్యత్వం నుంచి నిర్మాణం వరకు పట్టుదలగా కృషి చేస్తున్నారు. పుస్తకాలు రాయడం ద్వారా యువతకు మార్గదర్శిగా పనిచేస్తారన్నారు. అనేక రంగాలలో సేవలు అందిస్తూనే పుస్తకాలు రాసి, సమాజానికి అందించడం గొప్ప విషయమన్నారు.

**అమెరికాకు ఊడిగం చేస్తున్న మోదీ ప్రభుత్వం : ప్రేమ్ పావని**

ప్రేమ్ పావని మాట్లాడుతూ గతంలో అలీనోద్యమానికి నాయకత్వం వహించిన భారతదేశం మూడవ ప్రపంచ యుద్ధాన్ని నివారించిందన్నారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అమెరికాకు ఊడిగం చేస్తూ, అమెరికా, ఇరాన్ యుద్ధం విషయంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అమెరికా ఇరాన్ యుద్ధం ఆపేందుకు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఐప్సో ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాచం సత్యనారాయణ, పడాల నళిని, రాంచంద్రా రెడ్డి, పోలగాని రవికిషోర్, అరసం నాయకులు రాపోలు సుదర్శన్, బొమ్మగాని నాగభూషణం, జిఎస్‌టి రిటైర్డ్ అధికారి లక్ష్మయ్య, నాయకులు డి.జి.నరేంద్ర ప్రసాద్, కె.శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటిన బిసి అభ్యర్థులు

**అభినందనలు తెలిపిన రాష్ట్ర బిసి కమిషన్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సివిల్ పరిక్షా ఫలితాల్లో తెలంగాణకు చెందిన 20 మంది అభ్యర్థులకు మంచి మార్కులు రావటం, అందులో 10 మంది అభ్యర్థులు ఒబిసి వర్గానికి చెందినవారు కావడం ఎంతో సంతోషదాయకమని తెలంగాణ బిసి కమిషన్ అభివర్ణించింది. తెలంగాణ నుండి మంచి ర్యాంకులు సాధించిన 20 మంది అభ్యర్థులకు బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి అభినందనలు తెలిపారు. తెలంగాణ నుండి మంచి ర్యాంకులు సాధించిన 20 మందిలో 10 మంది బిసి వర్గాలకు చెందిన వారు కావడం బిసిల్లో విద్యాపరంగా కలుగుతున్న చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

# గజ్వేల్ తహసీల్దార్ నివాసాల్లో ఎసిబి సోదాలు

**ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించిన అధికారులు**

**అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు**



**ప్రజాపక్షం/కరీంనగర్:** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మండల తహసీల్దార్ కమటం శ్రవణ్ కుమార్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం నిర్వహించిన సోదాల్లో భారీ స్థాయిలో అక్రమ సంపాదన వెలుగులోకి వచ్చింది. కరీంనగర్ పట్టణానికి చెందిన ఈ అధికారి అధికార పదవిలో ఉండగానే అనుమానాస్పద మార్గాల్లో కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఎసిబి అధికారులు కరీంనగర్‌లోని నిందితుడి నివాసంతో పాటు నగరంలోని మరో రెండు ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో కరీంనగర్‌లో రెండు ఇళ్లు, ఆరు ఫ్లాట్లు కలిగిన ఒక అపార్ట్‌మెంట్, నాలుగు ఖాళీ స్థలాలు బయటపడ్డాయి. ఈ స్థిరాస్తుల విలువ సుమారు రూ.2,47,33,540గా అధికారులు అంచనా వేశారు. చరాస్తుల పరంగా రెండు ద్విచక్ర వాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనం, బంగారు నగలు, గృహోపకరణాలు, భారీ నగదు గుర్తించారు. రెండు ద్విచక్ర వాహనాల విలువ రూ.1,60,000గా, ఒక నాలుగు చక్రాల వాహనం విలువ సుమారు రూ.30 లక్షలుగా నమోదు చేశారు. బంగారు నగలు సుమారు రూ.4,20,000 విలువగా ఉండగా, గృహోపకరణాల విలువ రూ.15,66,000గా అంచనా వేశారు. అదనంగా రూ.11,90,000 నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో బయటపడిన స్థిర, చరాస్తుల మొత్తం విలువ సుమారు రూ.4 కోట్లకు పైగా ఉన్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. అధికారిక అంచనాల కంటే మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని పేర్కొన్నారు. ప్రభుత్వ పదవిని దుర్వినియోగం చేసి ఈ ఆస్తులు కూడబెట్టినట్లు సోదాల్లో లభించిన పత్రాలు సూచిస్తున్నాయని తెలిపారు. ఈ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరచి జ్యుడీషియల్ కస్టడికి తరలించినట్లు ఎసిబి అధికారులు వెల్లడించారు. అక్రమ సంపాదనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై భారత ప్రభుత్వం మౌనం వీడాలి

**ఆల్ ఇండియా తంజీమ్ ఎ ఇన్సాఫ్ అధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై భారత ప్రభుత్వం తమ మౌన వైఖరి వీడాలని ఆల్ ఇండియా తంజీమ్ ఇన్సాఫ్ అధ్యక్షులు, మాజీ ఎంపి అజీజ్ పాషా అన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్–అమెరికా సంయుక్త దాడిని ఖండిస్తూ ఇన్సాఫ్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్క్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కేవలం 5 రోజుల్లోనే అమాయకుల ప్రాణాలు బలితీసుకోవడంతో పాటు 3 లక్షలకు పైగా ప్రజలను నిరాశ్రయులను చేసిందని విచారం వ్యక్తం చేశారు. యుద్ధం ప్రభావంతో కేంద్ర ప్రభుత్వం చమురు ధరలను ఇప్పటికే 20 శాతం పెంచిందని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. బాంబు దాడుల నుండి తమను తాము రక్షించుకోవడానికి ఇరాన్ ప్రజలు 11,770 షెల్టర్లు, బంకర్లను నిర్మించుకుని, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతుకుతున్నారని వివరించారు. అమెరికా మిత్రదేశమైన స్పెయిన్, ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. ఇరిస్డెనా నౌక లక్ష్యంగా 80 మంది భారతీయ సైనికులను అమెరికా హతమార్చినప్పటికీ, అమెరికాఇజ్రాయెల్ దురాగతాలపై భారత ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం అన్యాయమని అజీజ్ పాషా అన్నారు. ఇరాన్ నాయకుడిని తమ ఇష్టానుసారం ఎంపిక చేసుకోవాలన్న మూర్ఖపు వాదనపై సీనియర్ న్యాయవాది ఎండి.అఫ్జల్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తంజీమ్ ఎ ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి మునీర్ పటేల్, ఎఐవైఎఫ్ నాయకులు బాలకృష్ణన్, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.షంషోద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు వెంటనే ఐక్యరాజ్య సమితి కలుగజేసుకుని, ఇరు దేశాలతో చర్చలు జరిపి యుద్ధాన్ని నివారించే చర్యలు చేపట్టాలని నిరసనకారులు కోరారు.

# తెలంగాణ గద్దర్ అవార్డ్స్






**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు 2025 ఏడాదికిగాను చిన్న చిత్రాలకు అవార్డుల పంట పండింది. రాజు వెడ్స్ రాంబాయి, ఛాంపియన్, దండోరా, మిరాయ్, తండేల్ చిత్రాలు ఎక్కువ అవార్డులు దక్కించుకున్నాయి. తెలంగాణ నేపథ్యంలో రూపొందించిన ఛాంపియన్ చిత్రం అయిదు అవార్డులు దక్కించుకోగా, తెలంగాణ కథగా తెరకెక్కిన రాజు వెడ్స్ రాంబాయి సినిమా నాలుగు అవార్డులను గెలుచుకుంది. దండోరాకు మూడు, మిరాయ్ చిత్రం మూడు అవార్డులు గెలుచుకోగా, తండేల్ సినిమా రెండు అవార్డులను, యుఫోరియా సినిమా రెండు అవార్డులను గెలుచుకుంది. తెలుగు సినిమా కళాకారులు, సాంకేతిక నిపుణులకు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ప్రతిష్టాత్మక తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు–2025 విజేతలను వెల్లడించారు. ఫీచర్ ఫిలిమ్స్ జ్యూరికి చైర్మన్‌గా వ్యవహరించిన సంగీత దర్శకుడు మణిశర్మ శనివారం ఎఫ్‌డీసిలో జరిగిన విలేకరుల సమావేశానికి హాజరు కాకపోవడంతో ఫీచర్ ఫిలిమ్స్ అవార్డులను ఎఫ్‌డీసి చైర్మన్ దిల్ రాజు ప్రకటించారు. గత ఏడాది ఎన్టీఆర్ జాతీయ అవార్డుతో పాటు మరో అయిదు అవార్డులను మాత్రమే ప్రకటించిన ప్రభుత్వం ఈ సారి సి.నారాయణ రెడ్డి, అక్కినేని నాగేశ్వర్ రావు పేరిట అవార్డులను ప్రకటించింది. 2025వ సంవత్సరానికిగాను ఎన్టీఆర్ జాతీయ అవార్డు చిరంజీవిని వరించింది. పైడి జయరాజ్ ఫిలిం అవార్డు కోసం ప్రముఖ నటుడు కమల్ హాసన్ ను ఎంపిక చేశారు. దర్శకులకు ఇచ్చే బిఎన్‌రెడ్డి ఫిలిం అవార్డును అవార్డును సింగీతం శ్రీనివాస రావుకు అందజేయనున్నారు. నిర్మాతలకు ఇచ్చే నాగిరెడ్డి, చక్రపాణి ఫిలిం అవార్డు కోసం చలసాని అశ్విని దత్ ను ఎంపిక చేశారు. టిఎల్ కాంతారావు ఫిలిం అవార్డును అభ్యుదయ చిత్రాల నటుడు ఆర్.నారాయణ మూర్తికి బహుకరించనున్నారు. రఘుపతి వెంకయ్య ఫిలిం అవార్డు కోసం ఎల్‌వీ ప్రసాద్ అధినేత రమేష్ ప్రసాద్‌ను ఎంపిక చేశారు. సి.నారాయణ రెడ్డి ఫిలిం అవార్డు కోసం ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, అక్కినేని నాగేశ్వర్ రావు ఫిలిం అవార్డు కోసం సహజ నటి జయసుధను ఎంపిక చేశారు. ఈ అగ్ర శ్రేణి అవార్డుల కమిటీకి జ్యూరీ చైర్మన్‌గా వ్యవహరించిన తమ్మారెడ్డి భరద్వాజ ఈ విజేతలను ప్రకటించారు.

**ఫీచర్ ఫిలిమ్స్ విజేతలు వీరే !**

తొలి ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి, ద్వితీయ ఉత్తమ చిత్రంగా దండోరా, తృతీయ ఉత్తమ చిత్రంగా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమాలు ఎంపికయినట్టు ఎఫ్‌డీసి చైర్మన్ దిల్‌రాజు ప్రకటించారు. నేషనల్ ఇంటిగ్రేషన్ ఉత్తమ చిత్రంగా తండేల్, ఉత్తమ ఎన్విరాన్మెంట్ చిత్రంగా ఎగువ, ఉత్తమ తొలి ఫీచర్ ఫిలింగా లిటిల్ హార్ట్స్, ఉత్తమ వినోదాత్మక చిత్రంగా సంక్రాంతికి వస్తున్నాం, ఉత్తమ సందేశాత్మక చిత్రంగా కోర్టు, ఉత్తమ స్పెషల్ ఎఫెకట్స్ ఫిలింగా మిరాయ్, ఉత్తమ బాలాల చిత్రంగా అనగనగ ఎంపికయ్యాయి. అయితే ఉర్దూ చిత్రాలు, ఉత్తమ యానిమేషన్ చిత్రాలు ఎంట్రీకి రాలేదని దిల్ రాజు చెప్పారు.

**జ్యూరీ స్పెషల్ అవార్డ్స్**

ఈ సినిమాలను చూసిన జ్యూరీ నలుగురికి స్పెషల్ అవార్డులను ప్రకటించింది. చిలకలూరిపేట బస్సు హదానం కేసును తీసుకుని 23 అనే సినిమాను రూపొందించిన దర్శకుడు రాజ్ రాచకొండను స్పెషల్ జ్యూరీ అవార్డు వరించింది. రాజు వెడ్స్ రాంబాయిలో నటించిన చైతు జొన్నలగడ్డ, ఛాంపియన్ సినిమాలో హీరోగా నటించిన శ్రీకాంత్ తనయుడు రోషన్ మేక, 8 వసంతాలు సినిమాలో హీరోయిన్‌గా నటించిన అనంతిక సనీల్ కుమార్‌లను జ్యూరీ స్పెషల్ అవార్డ్స్ కోసం ఎంపిక చేశారు.

## వ్యక్తిగత అవార్డు విజేతలు!

ఉత్తమ దర్శకుడిగా సాయిలు కంపాటి (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ లీడింగ్ నటుడిగా అక్కినేని నాగచైతన్య (తండేల్)
ఉత్తమ లీడింగ్ నటిగా రష్మిక మందాన (ది గర్ల్ ఫ్రెండ్)
ఉత్తమ సహాయ నటుడిగా శివాజీ (దండోరా)
ఉత్తమ సహాయ నటిగా భూమిక చావ్లా (యుఫోరియా)
ఉత్తమ సంగీత దర్శకుడిగా మార్క్ కె.రాబిన్ (దండోరా)
ఉత్తమ గాయకుడిగా అనురాగ్ కులకర్ణి (రాజు వేడ్స్ రాంబాయి) (రాంబాయి నీమీద మనసాయెనే పాటకు)
ఉత్తమ గాయనిగా సాహితి చాగంటి (కన్నప్ప సగమై చేరి అనే పాటకు)
ఉత్తమ హాస్య నటుడిగా కృష్ణ తేజ రెడ్డి (జిగ్రీస్)
ఉత్తమ బాల నటుడిగా మాస్టర్ రోహన్ రెడ్డి (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ కథ రచయితగా గుణశేఖర్ (యుఫోరియా)
ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ గేయ రచయితగా నందకిషోర్ (కుబేర సినిమాలో అమ్మపాట)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్‌గా కార్తీక్ ఘట్టమనేని (మిరాయ్ )
ఉత్తమ ఎడిటర్‌గా శేఖర్ ప్రసాద్ (మిరాయ్ )
ఉత్తమ ఆడియోగ్రాఫర్‌గా ఎం.ఆర్ రాధా కృష్ణన్ (కిష్కింధపురి)
ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా ఆట సందీప్ (గిరా గిరా పాటకు)
ఉత్తమ ఆర్ట్ దర్శకుడిగా తోట తరణి (ఛాంపియన్)
ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పీటర్ హెయిన్ (ఛాంపియన్)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా గోవిందరాజు (అఖండ–2)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా చంద్రకాంత్ సోనావాని (ఛాంపియన్)

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, చింతల్ సర్కిల్-54.**

NIT No. 02/DB/EE/Chintal Circle-54/CMC/2025-26 తేది: 07.03.2026

పని పేరు: డిజిల్టింగ్ వర్క్ (5 నెం.లు), అంచనా విలువ: రూ.32.00 లక్షలు, ప్రారంభ తేది & సమయం: 09.03.2026న మ.3.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 16.03.2026న మ.3.00గం.ల వరకు, టెండర్‌ను ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం.: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701414306, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్ సెల్ నెం. 8712034411. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telenagana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చింతల్ సర్కిల్-54, సిఎంసి.

DIPR R.O. No. : 16596-PP/CL/ADVT/1/2025-26, Date: 07-03-2026

**hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

HMDA Act. 2008లోని సెక్షన్ 15 (4) ప్రకారం బహిరంగ ప్రకటన

(G.O. Ms. No. MA & UD డిపార్ట్‌మెంట్ తేదీ : 24.02.2026)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (2008 చట్టం నెం.8) సెక్షన్ 15లోని సబ్ సెక్షన్-1 ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, ప్రభుత్వం G.O.Ms. No. 33 MA & UD ద్వారా జారీచేయబడిన ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్-2031లో ఊహించిన భూ వినియోగానికి ఈ క్రింది మార్పును చేస్తుంది.

మోకిల (గ్రామం), శంకర్‌పల్లి (మండలం), రంగారెడ్డి (జిల్లా)లోని సర్వే నెంబర్లు 294/P, 295/P, 296, 297/P, 301/P, 302/P, 303/P, 323, 324/P, 325/P, 326 & 327 లోని స్థలం 73349.27 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఇదివరకు ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ MDP-231 G.O.Ms. No.33, MA&UD డిపార్ట్‌మెంట్, తేదీ: 24.01.2013 ప్రకారం పెరి అర్బన్ యూజ్ జోన్‌గా ప్రస్తుతం గుర్తించబడి ఉన్నది ఏదైతే ఉందో దానిని ఇప్పుడు రెసిడెన్షియల్ వినియోగ జోన్‌గా గుర్తించబడింది.

పైన పేర్కొన్న వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచబడినాయి.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (PR), HMDA.

DIPR R.O. No. : 16554-PP/CL/ADVT/1/2025-26, Date: 07-03-2026

దర్శించండి — తరించండి

**శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము, ధర్మపురి,జగిత్యాల జిల్లా.**
**శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవములు (జాతర) ఆహ్వానము**
తేది: 27.02.2026 నుండి 11.03.2026 వరకు అత్యంత వైభవముగా జరుగును

**బ్రహ్మోత్సవముల ముఖ్య కార్యక్రమములు**

తేది: 28.02.2026 శనివారము రోజున "శ్రీస్వామి వారల కళ్యాణోత్సవములు"
తేది: 03.03.2026 మంగళవారం రోజున చంద్రగ్రహణం సందర్భంగా ఉ.6.00గం.ల నుండి 7.00గం.ల వరకు "శ్రీలక్ష్మీ (యోగ) నర్సింహస్వామి వారి డోలోత్సవము"
తేది:04.03.2026 బుధవారం రోజున మ.3.00గం.లకు కోనేరు (బ్రహ్మపుష్కరిణిలో) "శ్రీ ఉగ్ర నర్సింహస్వామి వారి తెప్పోత్సవము, డోలోత్సవము"
తేది: 05.03.2026 గురువారం రోజున మ.3.00గం.లకు కోనేరు (బ్రహ్మపుష్కరిణిలో) "శ్రీ వేంకటేశ్వరస్వామి వారి తెప్పోత్సవము, డోలోత్సవము"
తేది: 08.03.2026 ఆదివారం రోజున మ.3.00గం.లకు "రథోత్సవము"
తేది:09.03.2026 సోమవారం నుండి 11.03.2026 బుధవారము వరకు రా.9.00గం.లకు శ్రీ స్వామి వారల ఏకాంతోత్సవములు

**ముఖ్య అతిథి: మాన్యశ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి గారు, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు**

ఇట్టి బ్రహ్మోత్సవములలో పాల్గొను విశిష్ట అతిథులు :
గౌ॥శ్రీమతి కొండ సురేఖగారు, రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయశాఖ మాత్యులు
గౌ॥శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, రాష్ట్ర ఎస్సీ,ఎస్సీ సంక్షేమ శాఖామాత్యులు
గౌ॥శ్రీ గడ్డం వంశీకృష్ణగారు, పార్లమెంట్ సభ్యులు, పెద్దపల్లి

గమనిక: బ్రహ్మోత్సవములు (జాతర) సందర్భముగా ప్రతిరోజు స్థానిక ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం, రైస్‌మిల్లర్స్, దాతలు మరియు స్వచ్ఛంద సంస్థలు, భక్తుల సహాయ సహకారములతో ఉచిత అన్నదానము జరుపబడును. ఇట్టి అన్నదానమునకు తమ వంతు ధన, వస్తు రూపేణా విరాళములు చెల్లించి రశీదు పొందగలరని కోరుచున్నాము.

శ్రీ జక్కు రవీందర్, అధ్యక్షులు
ధర్మకర్తలు:
శ్రీ బొల్లారపు పోచయ్య, శ్రీగుడ్ల రవీందర్, శ్రీ మందుల మల్లేష్, శ్రీ నేదునూరి శ్రీధర్
శ్రీ రావర్తి సాయికిరణ్, శ్రీ స్తంభంకాడి గణేష్, శ్రీ సంబెట తిరుపతి.
శ్రీమతి వొజ్జల సౌజన్య, శ్రీ అవ్వ సుధాకర్, శ్రీ నేరెళ్ల శ్రీనివాసాచారి (ఎక్స్‌అఫిషియో మెంబర్)
అర్చకులు & సిబ్బంది
సహాయ కమీషనర్ & కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఎ.సి)
జారీ చేసినవారు: సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

**LOST PASSPORT**

I, **KONGARI MALLAREDDY, S/o. KONGARI RAJI REDDY**, R/o. H.No. 3-9, Gullapeta Village, Jagtial Mandal, Jagtial District - 505529, lost my **Passport No. S9684463** while I was travelling from My residential place to old bus stand jagtial. If anybody found please return the same to me. **Contact No. 8688897771.**

## బిసిల ధర్నాలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.50వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల ముందు జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూలిపాళ ధనుంజయనాయుడు కోరారు. శనివారం ఆయన మిర్యాలూగడలోని బీసీ హక్కుల సాధన సమితి కార్యాలయంలో విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తిఅయినప్పటికీ పాలకులు బీసీలను ఉద్ధరిస్తామని బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని బీసీలకు న్యాయం జరగాలంటే తమ పార్టీకి ఓటు వేయడమే మార్గమని, కల్లబొల్లి కబుర్లు చెబుతూ బీసీ డిక్లరేషన్ పేరుతో మరో మారు తెరమీదకు తీసుకొచ్చిన పాలకుల నిజ స్వరూపాన్ని బీసీలు గ్రహించాలని అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు జరగాలంటే ఉద్యమాలు నిర్వహించడం ఒక్కటే మార్గమని ఆయన అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీల అభివృద్ధి కోసం ప్రతి బడ్జెట్‌లో రూ.20వేలు కేటాయిస్తామని చెప్పారని, ఐదు సంవత్సరాల కాలంలో రూ.1లక్షల కేటాయించకపోగా కేవలం రూ.10వేల కోట్ల మాత్రమే కేటాయించారని అందులో సగం వరకు కూడా ఖర్చు చేయలేదన్నారు.

## పంచలోహ విగ్రహ చోరీ కేసులో ఇద్దరి నిందితుల అరెస్టు




**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మఠంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహ చోరీకి పాల్పడ్డ ఇద్దరు దొంగలను గరిడేపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. టిఎస్ 29 ఇ 9878 నంబర్ మోటర్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వెళ్తుండగా గరిడేపల్లి గ్రామంలో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహం ఉండడంతో అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరపగా మఠంపల్లి మండలం కామంచికుంట గ్రామ పంచాయితీలోని బక్కలచ్య తండకు చెందిన బానోతు సైదులు వృత్తి టిప్పర్ డ్రైవర్ అదే మండలంలోని జామ్లాతండకు చెందిన భూక్య నరసింహ ప్రైవేటు ఉద్యోగులుగా గుర్తించారు. మండలంలోని హనుమంతులగూడెం గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడిలో పంచలోహ విగ్రహం దొంగతనం చేసి మిర్యాలగూడెలో అమ్మేందుకు వెళ్తున్నామని, అదేవిధంగా కల్మలచెర్వు గ్రామంలోని శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో అంప్లిఫెయిర్‌ను కూడా చోరీ చేసినట్లు వారు ఒప్పుకున్నట్లు తెలిపారు. గతంలో బానోతు సైదులుపై హుజూర్‌నగర్, మఠంపల్లి, చింతలపాలెం, కూసుమంచి, మేళ్ళచెర్వు, గరిడేపల్లి, అనంతగిరి, ఆంధ్రప్రదేశ్‌లోని పెనుగ్రంచిపోలు పోలీసు స్టేషన్‌లలో 17 కేసులు నమోదైనట్లు తెలిపారు. వారి నుండి పంచలోహ విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐ నరేష్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చడానికి...



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వేసవి కాలంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు పోలీస్ పెట్రోల్ బంక్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు దాహార్తిని తీర్చుకోవాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ కోరా రు. శనివారం నల్లగొండలోని పోలీస్ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్పి ప్రారంభించి స్వయంగా మట్టి కుండలలోని చల్లని నీటిని ప్రజలకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో రహదారులపై ప్రయాణించే ప్రజలు,కార్మికులు,ఆటో డ్రైవర్లు, వాహనదారులు పాదచారులు తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడకుండా వారికి చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏర్.ఆర్ డిఎస్పి శ్రీనివాసులు,ఆర్ఐలు సంతోష్, శ్రీను,ఆర్ఎస్ఐ నాగరాజు,హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.

## అవగాహనతోనే అసలైన సాధికారత




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మహిళలు తమకు ఉన్న చట్టపరమైన హక్కులను, రక్షణ చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకున్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వైజర్, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ, సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అడ్డుకోవాలంటే చట్టాలపై అవగాహన ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. మగవారు ఆడవారిపై భౌతిక దాడులకు దిగితే ఏమాత్రం సహించవద్దు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు, ఆయా విభాగాల డీన్లు, డైరెక్టర్లు, హెచ్ఓడీలు, అధ్యాపక బృందం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** మహిళ విద్యతోనే సమాజానికి మేలు జరుగుతుందని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కోదాడ కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. ముఖ్యంగా భారతదేశంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతరామన్ వంటి వారు దేశాన్ని శక్తివంతంగా మారుస్తున్నారని పేర్కొన్నారు. చట్ట సభ లు, సైనిక, న్యాయ వ్యవస్థలో మహిళలకు సమాన వాటా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్టేట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామకృష్ణ, మహిళ ప్రతినిధి ధనలక్ష్మి, న్యాయవాదులు హేమలత, శిల్ప, కోర్టు సూపరిండెంట్ రజిని పాల్గొన్నారు.




# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలులో నిర్లక్ష్యం ఉండొద్దు

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలపాలి

పెండింగ్ ఫైళ్ల పరిష్కారం,ప్రజలకు పథకాల అవగాహన కల్పించాలి

ఉమ్మడి నల్లగొండ జిల్లా సన్నాహక సమావేశంలో మంత్రులు లక్ష్మణ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రజా పాలనప్రగతి ప్రణాళిక అమలులో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్,రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక ద్వారా అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రత,పెండింగ్ ఫైళ్ల పరిష్కారం,రైతుల సమస్యలు, మహిళలు మరియు పిల్లల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు సోమవారం లోపు క్లియర్ చేస్తామని,ఏప్రిల్ నుంచి మరో విడత ఇళ్ల మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా చూడాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థంగా చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజాపాలనప్రగతి ప్రణాళిక అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అన్నారు. కార్యక్రమం పర్యవేక్షణ కోసం ప్రత్యేక వాట్సాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలనప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామపంచాయతీలకు గతంలో ఇచ్చిన ట్రాక్టర్లన్నీ సద్వినియోగం అయ్యేలా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులు,ఉపాధ్యాయుల సంఖ్యను క్రమబద్ధీకరించడంతో పాటు రైతులకు యూరియా కొరత రాకుండా సరఫరా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్‌పై రైతులు, ప్రజలను చైతన్యం చేయాలని, వేసవిలో విద్యుత్ కొరత నివారణకు సోలార్ విద్యుత్ ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుఅధికారుల సమన్వయంతోనే ప్రజాపాలనప్రగతి ప్రణాళిక విజయవంతమవుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో ఎల్1, ఎల్2 సమస్యలను పరిష్కరించాలని, మిషన్ భగీరథ కింద తాగునీటి సమస్య రాకుండా అధికారులు ప్రత్యేక ప్రణాళికతో పని చేయాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,నల్లగొండ ఎస్పి శరత్ చంద్ర పవార్ ఉమ్మడి జిల్లాల అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

### డిండి ప్రాజెక్టుపై వివక్ష ఆపాలి: సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

### 436 లెవల్ నుంచే డిండి ప్రాజెక్టుకు నీరు తీసుకొస్తాం: మంత్రి కోమటిరెడ్డి




ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాపాలనప్రగతి ప్రణాళిక అమలుపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో డిండి శివన్నగూడెం ప్రాజెక్టులపై తీవ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ డిండి ప్రాజెక్టు విషయంలో నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేశారు.ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి తరలింపు విషయంలో పాలమూరురంగారెడ్డి (వట్టెం) ప్రాజెక్టుకు 436 మీటర్ల ఎత్తు నుంచే నీటిని తరలించే అవకాశం కల్పిస్తుండగా డిండి కాలువకు మాత్రం 440 మీటర్ల ఎత్తు నుంచే నీటిని తీసుకునేలా నిబంధనలు పెట్టడం నల్లగొండ జిల్లాపై జరుగుతున్న అన్యాయమని అన్నారు. వట్టెం ప్రాజెక్టు వైపు ఆరు మోటార్లకు బదులుగా ఎనిమిది మోటార్లు ఏర్పాటు చేసి రోజుకు రెండు టీఎంసీల నీటిని తరలించేలా అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. డిండి ప్రాజెక్టుకు 436.70 మీటర్ల స్థాయి నుంచి నీరు ఇవ్వకుండా 440 మీటర్ల నిబంధన విధించడం వల్ల రోజుకు రావాల్సిన ఆరు వేల క్యూసెక్కుల నీరు బదులుగా కేవలం 1500 క్యూసెక్కుల నీరు మాత్రమే అందుతోందని చెప్పా రు. రిజర్వాయర్‌లో నీటి మట్టం 440 మీటర్ల నుంచి 436.70 మీటర్లకు తగ్గిన తర్వాత ఈ 1500 క్యూసెక్కుల నీరు కూడా కేవలం 56 రోజుల పాటు మాత్రమే డిండి కాలువకు అందే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు.దీంతో ప్రభుత్వం నిర్ణయించిన 30 టీఎంసీల నీటికి బదులుగా కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే నల్లగొండ జిల్లాకు వచ్చే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్,నల్లగొండ, యాదాద్రి భువనగిరి,రంగారెడ్డి జిల్లాల్లోని 21 మండలాలకు చెందిన 3.61 లక్షల ఎకరాల ఆయకట్టుకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాబట్టి నీటిపారుదల శాఖ మంత్రి వెంటనే స్పందించి ఈఎన్‌సీ తీసుకున్న వివక్షాపూరిత నిర్ణయాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. వట్టెం ప్రాజెక్టుతో సమానంగా డిండి ప్రాజెక్టుకు కూడా 436 మీటర్ల లెవెల్ నుంచే నీటిని విడుదల చేసేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ, డిండి ప్రాజెక్టుకు 436 లెవెల్ నుంచే నీటిని తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిండిశివన్నగూడెం ప్రాజెక్టులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## యూరియా కోసం రైతుల అవస్థలు

క్షణాల్లో ఆన్‌లైన్‌లో యూరియా ఖతం..

దీనావస్థలో రైతాంగం..దళారులకు వరంగా మారిన ఆన్‌లైన్

రైతుల ధర్నాలో రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్



**ప్రజాపక్షం/డిండి:** ఆన్‌లైన్ యూరియాతో పంటలు వేసుకున్న నిజమైన రైతులకు యూరియా దొరకక తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఆన్‌లైన్ యూరియా రైతుల పాలిట శాపంగా మారిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని తవక్లాపూర్ పిఏసిఎస్ సెంటర్ వద్ద రైతులతో కలిసి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా మైనోద్దీన్ మాట్లాడుతూ ఆన్‌లైన్ యూరియా దళారులకు వరంగా మారిందని, కొందరి రైతుల పాస్ బుక్కులు తీసుకొని వెంట వెంటనే ఓటిపితో యూరియా బుక్ చేసుకోవడం జరుగుతుందని దీనివల్ల దళారులు యూరియాను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. నిజమైన రైతులు పంట వేసి తమ పంటకు యూరియా వేయలేని స్థితిలో ఆందోళన చెందుతున్నారని అన్నారు. కనీసం స్మార్ట్ ఫోన్ లేని, అవగాహన లేని రైతులు చదువులేక రైతులు యూరియాను బుక్ చేసుకోలేక పంట వేసి తీవ్ర అన్యాయమే జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ విధానంతో రైతులకు మేలు జరుగుతుందో, దళారులకు మేలు జరుగుతుందో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఆన్‌లైన్ యూరియాతో నిజంగా పంట వేసుకున్న రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది తప్ప ఎలాంటి ఉపయోగం లేదని తక్షణమే ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి పంటకు సరిపడే యూరియాను మండల యూనిట్‌గా పిఏసిఎస్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చదువుకోని రైతులు ఆన్‌లైన్ యూరియాతో చేసేదేమి లేక తమ పంటను కోల్పోవాల్సిన పరిస్థితిని ఎదురైతుందని, తక్షణమే ప్రభుత్వం ఆన్‌లైన్ యూరియా విధానాన్ని ఎత్తివేయాలని మైనోద్దీన్ డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


## రబీ ధాన్యం కొనుగోళ్లకు పూర్తి సన్నాహాలు

రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు చేయాలి: కలెక్టర్




**ప్రజాపక్షం/నల్లగొండ :** 2025/26 రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా,వేగవంతంగా నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శనివారం నల్లగొండలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన రబీ ధాన్యం సేకరణ సన్నాహక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో రబీ సీజన్‌లో సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.అవసరమైన చోట కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచే అవకాశం ఉందని తెలిపారు.ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు చెల్లింపులు చేయాలని,కేంద్రాల్లో గన్ని బ్యాగులు,టార్పాలిన్లు,తూకం పరికరాలు వంటి సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. వేసవి దృష్ట్యా కేంద్రాల్లో త్రాగునీరు,టెంట్లు, నీడ వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులతో అధికారులు గౌరవంగా వ్యవహరించాలని, ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,పౌరసరఫరాల అధికారి వెంకటేష్ ,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి,డిసిఓ పత్యా నాయక్,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్,పౌర సరఫరాల డిఎం రామ్ పత్ నాయక్,ట్రాన్స్‌పోర్ట్ అధికారి లావణ్య,మెట్రాలజి అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

## సంఘ బంధం-2లో నిధులపై ఆరోపణలు



కలెక్టర్ ఆదేశాలతో విచారణ

**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూరు):** మండలం చెర్వు అన్నారం గ్రామంలోని సంఘ బంధం2లో ఐకేపీ,శ్రీనిధి,సీఐఎఫ్ నిధుల వినియోగంపై అవినీతి జరిగిందని ఆరోపిస్తూ వివోఏ నిధులు దారి మళ్లించారని పేర్కొంటూ సంఘ బంధం అధ్యక్షురాలు గద్దపాటి రేణుకతో పాటు కొందరు సభ్యులు గతంలో జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ డే కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు శనివారం గ్రామంలో విచారణ చేపట్టారు.డీపీఎం వీరయ్య,శ్రీనిధి ఆర్ఎం శ్రీలేఖ,ఏపీఎం రాములు,ఆడిటర్ సత్తిరెడ్డి,సీసీ ప్రసాద్ చెర్వు అన్నారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సమభావన సంఘాల, లీడర్స్,సభ్యులతో సమావేశమయ్యారు.సభ్యుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కొంత గందరగోళం జరిగింది. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా విచారణ ప్రారంభించామని తెలిపారు.అయితే సంఘానికి సంబంధించిన బుక్కులు సీరియల్ క్రమంలో లేకపోవడం, శ్రీనిధి ఖాతాలకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో లేకపోవడంతో విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాల సేకరించిపై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. ఇదిలా ఉండగా, గతంలో పని చేసిన సీసీ సత్యనారాయణ బదిలీపై మహిళలు అధికారులను ప్రశ్నించారు.ఈవిషయాన్ని డీఆర్‌డీఏ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ చిలుముల సైదులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి టీకా మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లాలో బాలికల ఆరోగ్య రక్షణ కోసం హెచ్‌పివి టీకాకరణ కార్యక్రమాన్ని ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకట రమణ తెలిపారు. 14 సంవత్సరాలు పూర్తి చేసి 15 సంవత్సరాలు పూర్తి కాని బాలికలకు ఈ టీకాను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా ఆసుపత్రి, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి ఏరియా ఆసుపత్రులు నడిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె కోటి రత్నం మాట్లాడుతూ జిల్లాలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నామన్నారు. సూర్యాపేట జిల్లా మొత్తం జనాభా 11,96,409 ఉండగా అందులో 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు పూర్తి కాని బాలికలు సుమారు 1 శాతం ఉంటారని అంచనా వేయగా, మొత్తం 11,964 మందికి ఈ టీకా అవసరం ఉంటుందని చెప్పారు. తేది.01.04. 2011 నుండి 31.03.2012 మధ్య జన్మించిన అర్హత గల బాలికలను సం బంధిత వ్యాక్సినేషన్ కేంద్రాలకు తీసుకవెళ్లి టీకా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు, ఉపా ధ్యాయులు, స్థానిక నాయకులు, ఎన్‌జిఓ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్య సిబ్బందికి సహకరించి జిల్లాలో 100 శాతం టీకా జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి పోలీసులు సిద్ధం

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొనటానికి పోలీసు శాఖ సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన వివిధ అంశాలపట్ల ప్రజలను, యువతను చైతన్యవంతం చేసి కార్యక్రమంలో విజయవంతంగా ముందుకు వెళ్తామన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలను పోలీసు సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైల్స్‌ను పరిష్కరించడం, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ కార్యాచరణ, బడుగు బలహీన వర్గాల సంక్షేమం చట్టాల అమలు, పిల్లల మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, వ్యవసాయం నకిలీ విత్తనాల నిర్మూలన, విద్య, యువత క్రీడలు, పర్యావరణం మొదలగు అంశాల మీద ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమాల నిర్వహణ కార్యక్రమాల్లో పాల్గొనడానికి పోలీసు శాఖ ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, రోజువారి ప్రణాళిక ప్రకారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో పాల్గొంటారని స్పష్టం చేశారు. పరిశుభ్రత కార్యక్రమంలో డిఎస్‌పి నరసింహ చారి, ఆర్ఐ జానయ్య, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా దశలవారీగా సరఫరా చేస్తున్నాం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యూరియా పై రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని కావలసినంత స్టాక్ సిద్ధంగా ఉందని యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లాలో ప్రతి మండలానికి అవసరమైన మేరకు యూరియా నిలువలు అందుబాటులో ఉన్నాయని దశలవారీగా రైతులకు సరఫరా చేస్తున్నామని అన్నారు. మండల కేంద్రంలోని పిఎస్‌సిఎస్‌లో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కొందరు అపోహాలు సృష్టిస్తూ సూర్య కొరత ఉందని ప్రచారం చేస్తున్నారని వాటిని రైతులు నమ్మవద్దని సూచించారు. ఇప్పటికే మండలానికి 48 వేల బస్తాలను సరఫరా చేశామని, మరో 20,000 బస్తాలు సరఫరాకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవసరం లేకుండా యూరియా బస్తాలు కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని కొందరు రైతులు వచ్చే సీజన్‌కు కూడా ఇప్పటినుండే నిలువలు ఉంచుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మండల వ్యవసాయ అధికారిని బి.పూజ, పిఎసిఎస్ సీఈవో బి.శేఖర్, రైతులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని వారి సేవలు సమాజానికి అమూల్యమైనవని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా 15 మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఆమె సత్కరించి మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులకు టిఫిన్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి, వైస్ చైర్మన్ షఫీఉల్లా, మేనేజర్ బుచ్చిబాబు, ఆర్ఓ కళ్యాణి, టిపిఓ సోమయ్య, శానటరీ ఇన్‌స్పెక్టర్లు సారగుండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఓట్ల తొలగింపు
# రాష్ట్రాన్ని విభజించేందుకే

- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఆరోపణ
- రెండవ రోజూ ధర్నా చేసిన టిఎంసి అధినేత్రి



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో 'సర్' తరువాత ఓటరు జాబితాలో ఓట్ల తొలగింపు రాష్ట్రాన్ని విభజించే లక్ష్యంతో జరిగిందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా నుండి ఏకపక్ష తొలగింపులకు వ్యతిరేకంగా శనివారం జరిగిన ప్రదర్శనలో బెనర్జీ పాల్గొని ప్రసంగించారు. బెంగాలీ మాట్లాడే ప్రజల ఓటు హక్కులను బిజెపి వంచిస్తోందని ఆరోపించారు. మధ్య కోల్‌కతాలోని మెట్రో ఛానల్ వద్ద ఉన్న ధర్నా స్థలంలో రాత్రి గడిపిన తర్వాత, ముఖ్యమంత్రి వరుసగా రెండవ రోజు తన నిరసనను కొనసాగించారు. 'బెంగాల్‌ను విభజించడమే వారి (ఎన్నికల సంఘం, బిజెపి) ఉద్దేశ్యం. బెంగాల్‌ను విభజించడం ద్వారా బిజెపి ఓట్లను లాక్కొని రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలని యోచిస్తోంది. వారు (బిజెపి నాయకులు) ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు, బెంగాలీల ఓటు హక్కులను హరించడానికి కుట్ర పన్నారు' అని బెనర్జీ ఆరోపించారు. బెంగాల్, బిహార్‌లను విభజించి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేయవచ్చని ఇంతకు ముందు రోజు ముఖ్యమంత్రి ట్వీట్‌లో చూశారని పేర్కొన్నారు. 'వారికి ధైర్యం ఉంటే బెంగాల్‌ను తాకనివ్వండి. ఇది వారి కుట్ర. వారు బిహార్‌లో ఒకసారి జార్ఖండ్‌ను సృష్టించారని, ఇప్పుడు వారు మళ్ళీ దీన్ని చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సర్ అనంతర ఓటర్ల జాబితాలో లక్షలాది పేర్లను తొలగించడంపై ఎన్నికల కమిషన్‌ను విమర్శిస్తూ, దిన్హాటా వంటి ఒకే అసెంబ్లీ నియోజకవర్గం నుండి 36,000 ఓట్లు తొలగించబడ్డాయని బెనర్జీ అన్నారు. 'నా సొంత నియోజకవర్గంలో, 60,000 ఓట్లు తొలగించబడ్డాయి. మొత్తం ఓటర్ల జాబితాను తొలగించమని నేను మిమ్మల్ని సవాలు చేస్తున్నాను' అని ఆమె తన భబానీపూర్ నియోజకవర్గం నుండి అనేక మంది మహిళలను వేదికపైకి వచ్చి వారి పత్రాలను చూపించమని కోరారు. వారు దేశ పౌరులు కాదా? వారికి ఓటు హక్కు లేదా? అని నిలదీశారు. ఎన్నికల కమిషన్ ఓట్లను దోచుకుంటోందని ఆరోపించారు. మాపై ఎంత ఎక్కువ దాడి చేస్తే, ప్రతీకారం అంత బలంగా ఉంటుందని హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా ఓటర్ల జాబితా నుండి మహిళల పేర్ల తొలగింపు, ఎల్‌పిజి ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఆదివారం నగరంలో వేలాది మంది మహిళలు వీధుల్లోకి వస్తారని, నిరసనకారులు నల్ల దుస్తులు ధరిస్తారని టిఎంసి అధినేత్రి అన్నారు. సమాన హక్కులు, మహిళల సాధికారత ఎన్నికల వాగ్దానాలను బిజెపి ఎప్పుడూ అమలు చేయదని, టిఎంసి నేతృత్వంలోని బెంగాల్ వీటిని అక్షరాలా, స్ఫూర్తితో అమలు చేస్తుందన్నారు. పార్లమెంటులో 37 శాతం ఎన్నికైన మహిళా ప్రతినిధులు ఉన్న ఏకైక రాష్ట్రం బెంగాల్ అని, వారు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ గురించి మాట్లాడుతారు! పంచాయతీలు, మునిసిపాలిటీలలో ఇప్పటికే మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఉందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు బెంగాల్ ఓటర్లను ఓటు వేయడానికి బిజెపితో ఎన్నికల కమిషన్ కుట్ర పన్నిందని ఆరోపిస్తూ టిఎంసి అధినేత్రి శుక్రవారం సెంట్రల్ కోల్‌కతాలో ప్రదర్శన ప్రారంభించారు.

### నిరుద్యోగభృతి రూ.1500: మమత

త్వరలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెర్జీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉద్యోగాలు లేని వారికి నెలకు రూ.1500 నిరుద్యోగ భతి అందించనున్నట్లు వెల్లడించారు. ఈ రోజు నుంచే ఈ నగదు నిరుద్యోగుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. 'యువ సాథి' అనే ఈ స్కీమ్ 21 నుంచి 40 ఏళ్ల వయసు వారికి వర్తిస్తుందని తెలిపారు. ఈ సాయంతో వారు స్వయం సమద్ధిగల భవిష్యత్తు వైపు పయనించగలుగుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. యువ సాథి స్కీమ్‌ను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని ముందు భావించినట్లు మమత తెలిపారు. అయితే ఈ నెల ఎనిమిదో తేదీ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తేదీలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)కు వ్యతిరేకంగా... కోల్‌కతాలో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. తమ పాలనలో బెంగాల్‌లో నిరుద్యోగిత రేటు 40 శాతం తగ్గిందని సీఎం తెలిపారు. ప్రభుత్వం దాదాపు 40 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందించిందని... వారిలో 10 లక్షల మంది ఇప్పటికే ఉపాధి పొందుతున్నారని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇప్పటికే ప్రతినెలా రూ.10 వేలు ఇస్తోందన్నారు. బెంగాల్‌లో పెట్టుబడులు పెట్టడానికి అనేక ఐటీ కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు.

## ప్రపంచ శాంతికి
# అమెరికా పెద్ద శత్రువు

**యుద్ధానికి, వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా 10న నిరసన దినం : సంయుక్త కిసాన్ మోర్చా**



ఫైల్ ఫోటో

**న్యూఢిల్లీ:** ప్రపంచ శాంతికి అమెరికా పెద్ద శత్రువుగా మారిందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) విమర్శించింది. ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలకు ముప్పుగా ఉన్నదని వ్యాఖ్యానించింది. గల్ఫ్‌లో యుద్ధం తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని హెచ్చరించింది. భారత్ కంటే గల్ఫ్‌లో ఉద్యోగాలకు మెరుగైన వేతనాలు లభిస్తాయని, 90 లక్షల మందికిపైగా భారతీయులు అక్కడ పని చేస్తున్నారని, వారిపై ఆధారపడిన వారు ఐదు కోట్ల మంది వరకు ఉన్నారని ఎస్‌కెఎం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈనెల 10వ తేదీని యుద్ధానికి, వాణిజ్య ఒప్పందానికి నిరసన దినంగా పాటించాలని పిలుపునిచ్చింది. ప్రపంచం మళ్లీ వలసవాద రాజ్యంగా మారకుండా పోరాటం తప్పదని దేశ ప్రజలకు సూచించింది. పశ్చిమాసియాను రణరంగంగా మార్చి... సార్వభౌమ ఇరాన్ దేశాధినేతతో పాటు సీనియర్ నాయకులు, వేలాది మంది అమాయక ప్రజలు, వందల మంది చిన్నారుల ప్రాణాలు తీసి... స్కూళ్లుఆసుపత్రులపై బాంబులు వేసి... ఐరిస్ దీనా యుద్ధ నౌకపై దాడి చేసి... 85 మంది సైనికులను పొట్టన పెట్టుకున్న ఇజ్రాయిల్‌అమెరికాను ఆక్షేపించింది. ఇరాన్‌పై దాడులకు రెండు రోజుల ముందు ఇజ్రాయిల్‌లో ప్రధాని మోదీ పర్యటించడాన్ని విమర్శించింది. 75వేల మంది పలస్తీనియన్ల మరణహోమాన్ని విస్మరించడమే కాకుండా ఇరాన్ అధినేత హత్యను ఖండించకపోవడం ఫాసిస్టు శక్తులతో మోదీ ప్రభుత్వానికి ఉన్న సాన్నిహిత్యాన్ని బహిర్గతం చేసిందని ఎస్‌కెఎం వ్యాఖ్యానించింది. భారత్‌కు దీర్ఘకాల మిత్రదేశంగా ఇరాన్ ఉన్నదని, మంచి వాణిజ్య భాగస్వామి అని గుర్తుచేసింది. బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వ వైఖరి దేశ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని దుయ్యబట్టింది. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి, అన్యాయమైన వాణిజ్య ఒప్పందానికి అంగీకరించిందని కేంద్రాన్ని ఎస్‌కెఎం ఎండగట్టింది. కార్మికులకు, రైతులకు, వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం పనిచేస్తున్నదని రుజువు అయిందని పేర్కొంది. అమెరికా వాణిజ్య ఒప్పందానికి అంగీకరించి దేశ రైతాంగాన్ని, కార్మికులను, ఎంఎస్‌ఎంఈలను నాశనం చేసే దిశగా సర్కారు అడుగులు వేసిందని సంయుక్త కిసాన్ మోర్చా తీవ్రంగా విమర్శించింది.

## కేన్సర్‌ను జయించి... సివిల్స్‌లో మెరిసి...

**చత్తీస్‌గఢ్ యువకుడి విజయగాథ**



రాయ్‌పూర్: ఆరేళ్లు కేన్సర్‌తో పోరాడాడు. స్వల్ప దష్టి లోపంతో బాధపడుతున్నాడు. లక్ష్యం కోసం మూడు ఉద్యోగాలకు రాజీనామా చేశాడు. సివిల్స్‌లోనూ రెండుసార్లు ఆశించిన ఫలితం రాలేదు. అయినా వెనకడుగు వేయలేదు. పట్టుదలతో ప్రయత్నించాడు. చివరకు అనుకున్నది సాధించాడు. మూడో ప్రయత్నంలో సివిల్స్‌లో మెరిశాడు. అతడే చత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్ జిల్లాకు చెందిన సంజయ్ దహరియా. బేల్‌టుక్రి గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ కుటుంబంలో సంజయ్ దహరియా (38) జన్మించాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అతడి విద్యాభ్యాసం ప్రారంభమైంది. అనంతరం రాయ్‌పూర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యాడు. చదువు పూర్తి చేసుకున్న అనంతరం ఎస్‌బీఐలో ఉద్యోగం సాధించాడు. 2009 నుంచి 2011 వరకు పశ్చిమ బెంగాల్‌లో పనిచేశాడు. 2012లో కేన్సర్ ఉన్నట్లు తేలింది. దాదాపు ఆరేళ్ల పాటు మహమ్మారిపై పోరాడి, గెలిచాడు. స్వల్ప దష్టి లోపంతో బాధపడుతున్నప్పటికీ... ఏమాత్రం నిరుత్సాహపడకుండా సివిల్ సర్వీసెస్ కోసం ప్రయత్నాలు కొనసాగించాడు. ఒకవైపు పరీక్షలకు సన్నద్ధమవుతూనే... మరోవైపు రాయ్‌పూర్‌లోని ఓ బ్యాంకులో, ఆపై మహాసముంద్‌లోని పోస్టాఫీసులో ఉద్యోగాలు చేశాడు. 2022లో తొలిసారి సివిల్స్ పరీక్ష రాశాడు. ఆశించిన ఫలితం రాలేదు. రెండో ప్రయత్నంలోనూ నిరాశే ఎదురైంది. తాజాగా మూడో ప్రయత్నంలో 946వ ర్యాంకు సాధించాడు. 'సివిల్ సర్వీసెస్ ద్వారా దేశానికి సేవ చేయాలని ఆశిస్తున్నాను. ఏ సర్వీస్ వచ్చినా... ప్రజా సేవ విషయంలో నిబద్ధతగా వ్యవహరిస్తాను' అని సంజయ్ తెలిపాడు. అనారోగ్యంతో ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు, మెంటార్‌లు అండగా నిలిచారని, వారు అందించిన మద్దతే విజయానికి కారణమని చెప్పాడు. సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై మహాసముంద్ కలెక్టర్ వినయ్ కుమార్ తదితరులు సంజయ్‌ను అభినందించారు.

## రష్యా చమురు కొనుగోలుకు అమెరికా అనుమతి వెనక...
# మోదీ 'పిరికితనం..రాజీ'

**కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేష్ ఎద్దేవా**




**న్యూఢిల్లీ :** భారతదేశం రష్యా చమురు కొనుగోలుకు సంబంధించి అమెరికా అధికారుల వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నరేంద్రమోదీ ప్రభుత్వంపై విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేసింది. అది 'పిరికితనం, రాజీ' చర్య అని ఆరోపించింది. పశ్చిమాసియా సంఘర్షణ మధ్య ప్రపంచ వ్యాప్తంగా సరఫరాలను సులభతరం చేసే ఉద్దేశంతో ఇప్పటికే తేలియాడే జల మార్గాల ద్వారా సరఫరా అవుతున్న ఓడల్లో ఉన్న రష్యన్ చమురును కొనుగోలు చేయడానికి భారతదేశానికి అనుమతి ఇచ్చామని అమెరికా ప్రకటించిన అనంతరం ప్రతిపక్ష కాంగ్రెస్ ఈ విమర్శనాస్త్రాలను సంధించింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్ చార్జి ఇన్ కమ్యునికేషన్స్ జైరాం రమేష్ శనివారం తన 'ఎక్స్'లో అమెరికా ట్రెజరరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మాట్లాడిన వీడియో క్లిప్‌ను పోస్ట్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలను నమ్మకంగా పాటించినందుకు మోదీ ప్రభుత్వానికి అమెరికా సర్టిఫికెట్ ఇచ్చిందని జైరాం రమేష్ అన్నారు. స్వయ ంగా ప్రకటిత 56 అంగుళాల ఛాతీ ఎంత పిరికితనంగా మారిందో చెప్పాల్సిన అవసరం ఉందా ? అని జైరాం రమేష్ ఎద్దేవా చేశారు. అమెరికా ట్రెజరరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా చమురు అంతరాన్ని తగ్గించడానికి భారతదేశం రష్యన్ చమురును కొనుగోలు చేయడానికి అమెరికా అనుమతించిందని విమర్శించారు. అమెరికా అభ్యంతరం వ్యక్తం చేసి ఆంక్షలు విధించిన తర్వాత కూడా రష్యా చమురు భారతదేశంలోకి ప్రవహిస్తూనే ఉందని, 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అమెరికా ఆంక్షల మినహాయింపు ఘర్షణను తొలగిస్తున్నప్పటికీ అది దేశ విధానాన్ని నిర్వచించదని శుక్రవారం ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి చెప్పారు. భారత శుద్ధి కర్మాగారాలు రష్యన్ చమురును తాత్కాలికంగా కొనుగోలు చేయడానికి 30రోజుల మినహాయింపు ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించిన తర్వాత శుక్రవారం బిజెపి ఈ అభివృద్ధిని ప్రధాని మోదీ నేతృత్వంలో వ్యూహాత్మక చమురు దౌత్యం విజయంగా అభివర్ణించింది. 'ఇది భారత వ్యతిరేక రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ముఖంపై పెద్ద గుద్దు' అని బిజెపి ఎద్దేవా చేసింది.

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలు... ప్రజాస్వామ్యానికి పునాది

**త్వరలో జరుగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల 'సర్' కసరత్తు సన్నాహకాలపై సిఇసి జ్ఞానేష్‌కుమార్ సమీక్ష**

**కేరళ యావత్ దేశానికీ, ప్రపంచానికీ ప్రజాస్వామ్య పద్ధతులను నేర్పించిన రాష్ట్రమని కితాబు**




**కొచ్చి :** కేరళ రాష్ట్రంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రత్యేక సమగ్ర సవరణ సన్నాహకాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ పర్యవేక్షించారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరునూ మినహాయించకుండా, అనర్హమైన వ్యక్తిని చేర్చకుండా జాగ్రత్త వహించాలనే స్పష్టమైన లక్ష్యంతో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) పారదర్శకంగా నిర్వహించబడిందని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. త్వరలో జరుగనున్న కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలను సమీక్షించిన అనంతరం శనివారం ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రజాస్వామ్యం రాష్ట్రానికి కొత్త కాదని, దేశంలోని, ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు కేరళ రాష్ట్రం ప్రజాస్వామ్య పద్ధతులను నేర్పించిందని చెప్పారు. ఈ సందర్భంగా జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కేరళ రాష్ట్రం18 సంవత్సరాలుగా తాను ఉద్యోగ విధులు నిర్వర్తించిన స్థలం అని, దాదాపు 22 సంవత్సరాల క్రితం తాను ఎర్నాకుళం జిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేశానని చెప్పారు. కేరళలో 1,000 ఏళ్ల క్రితం 'నట్టుకుట్టంలు' (గ్రామ సమావేశాలు) ఉండేవని, ఇది సమష్టి నిర్ణయానికి పునాది వేసిందని సిఇసి జ్ఞానేష్ కుమార్ తెలిపారు. కేరళ చాలా క్రితం మొదటి ప్రవర్తనా నియమావళిని రూపొందించిందని, దీని తర్వాత భారత ఎన్నికల కమిషన్ అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదించి ఆమోదించిందన్నారు.దానినే నేడు మనం ఇప్పుడు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అని పిలుస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో కేరళ కూడా అగ్రగామిగా నిలిచిందని, 1982లో పరవూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పైలట్ పద్ధతిలో ప్రవేశపెట్టారని వివరించారు. ఈ బలమైన పునాదితో కేరళలోని అన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్రంలోని మొత్తం ఎన్నికల యంత్రాంగం రాబోయే ఎన్నికలు మొత్తం రాష్ట్రానికే కాకుండా యావత్ ప్రపంచానికే ఒక మోడల్‌గా ఉంటాయని ఏకగ్రీవంగా ప్రకటించాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలియజేశారు. కేరళ రాష్ట్రంలో 140 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అందులో షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎస్‌సి) కోసం 14 అసెంబ్లీ నియోజవర్గాలు, రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్‌టిల కోసం రిజర్వ్ చేయబడ్డాయని తెలిపారు. కేరళ రాష్ట్రంలో 2,69, 53, 644 ఓటర్లు ఉన్నారని సిఇసి జ్ఞానేష్ కుమార్ వివరించారు. ఇది ఆస్ట్రేలియా, నార్వే, కోస్టారికా దేశా ల జనాభా కంటే అధికమని సిఇసి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 30, 471 పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. వాటిలో 5,000 కొత్తవి కాకుండా ఉంటాయని, 100శాతం వెబ్‌కాస్టింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏ పోలింగ్ కేంద్రానికైనా 1200మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండరని జ్ఞానేష్ కుమార్ చెప్పారు. 397 పోలింగ్ స్టేషన్లను మహిళల కోసం కేటాయించగా. 790 మోడల్ పోలింగ్ పోలీస్ స్టేషన్లకు పైగా నెలకొల్పబడ్డాయన్నారు. కేరళలో దాదాపు 2.43లక్షల మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, వంద సంవత్సరాల వయసు దాటిన ఓటర్లు 1,571 మంది ఉండగా, 85సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటీజన్లు రెండు లక్షల మందికి పైగా ఉన్నారని, వీరు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులని సిఇసి జ్ఞానేష్ కుమార్ చెప్పారు. కేరళ రాష్ట్రంలో 1819 వయసు గ్రూప్ వారు 4.24లక్షల మంది ఓటర్లు ఉండగా, 2029 వయసు గ్రూప్ వారు దాదాపు 45లక్షల మంది ఓటర్లుగా ఉన్నారని, వీరి కోసం విద్యాసంస్థల్లో ప్రత్యేక ప్రచారాలు నిర్వహించి 'ప్రజాస్వామ్య పండుగ'(ఓటింగ్)లో పాల్గొనేలా వారిని ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగ ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనేందుకు వీలుగా సౌకర్యాలను మెరుగుపరిచామన్నారు. దీనిలో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్ పోలింగ్ స్టేషన్లు, ర్యాంపులు. వీల్ చైర్లు, ఓటింగ్ ప్రాధాన్యత సౌలభ్యాలు కల్పించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల ప్రవేశ ద్వారం వరకూ మొబైల్ ఫోన్లను తీసుకువెళ్లవచ్చని, డిపాజిట్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని సిఇసి చెప్పారు. ఎలాంటి సందేహానికి తావు లేకుండా ఓటర్లు తమ నియోజకవర్గ అభ్యర్థుల ఫోటోలను కలర్‌లో చూసి ఇవిఎంలలో ఓటు వేసే సదుపాయాన్ని కేరళలో మొట్టమొదటిసారి కల్పించినట్లు చెప్పారు. గతంలో ఎన్నికల కమిషన్ వద్ద 4 కంటే ఎక్కువగా విభిన్న ధరఖాస్తులు ఉండేవని, వాటిని ఇప్పుడు 'ఎసినెట్' అనే ఒకే ప్లాట్‌ఫారమ్‌లో విలీనం చేయడం జరిగిందని తెలియజేశారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పారదర్శకతను నిర్ధారించడానికి 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుందని చెప్పారు. ప్రతీ రెండు గంటలకు ఒకసారి ఓటర్ల సంఖ్యతో పాటు ఎన్నికల సమీకరణలను అందిస్తామని సిఇసి జ్ఞానేష్ కుమార్ వివరించారు. రిటర్నింగ్ అధికారులపై వత్తిడిని నివారించేందుకు ఇవియం ఓట్లకు ముందు రెండు రౌండ్లు పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నట్లు ఆయన చెప్పారు.ఇండెక్సింగ్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన డేటా మొత్తాన్ని లెక్కింపు జరిగిన 72గంటలలోపు అందుబాటులో ఉంచుతామని, వివిప్యాట్ స్లిప్స్ తప్పనిసరిగా లెక్కింపు జరుగుతుందని సిఇసి జ్ఞానేష్ కుమార్ వివరించారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, కేరళ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ రతన్ యు ఖేల్కర్ తదితరులు హాజరయ్యారు.

# ఈ ఏడాది కూడా ఛార్జీల పెంపు లేదు

**విద్యుత్ వినియోగదారులకు ఊరట**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వచ్చే 2026–27 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిపాదించలేదని తెలంగాణ సదర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టిజిఎస్‌పిడిసిఎల్) వెల్లడించింది. బహిరంగ విచారణలో మాట్లాడిన సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ విషయాన్ని తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంస్థకు అవసరమైన మొత్తం ఆదాయం రూ.50,242 కోట్లుగా అంచనా వేయగా, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన మొత్తం రూ.38,492 కోట్లుగా ఉందన్నారు. ప్రస్తుత టారిఫ్‌ల ద్వారా వచ్చే ఆదాయం రూ.40,659 కోట్లు మాత్రమే ఉండడంతో రూ.9,583 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుందన్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మద్దతు ఆశిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం టిజిఎస్‌పిడిసిఎల్ పరిధిలో 1,20,95,963 మంది వినియోగదారులు ఉన్నారని, గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు 12,09,563 మంది కొత్త వినియోగదారులు చేరినట్లు తెలిపారు. కనెక్టెడ లోడ్ కూడా గణనీయంగా పెరిగి ప్రస్తుతం 35,175 ఎంవిఎలకు చేరిందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ వరకు 39,556 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. అందులో గృహ రంగం 23 శాతం, పారిశ్రామిక రంగం 31 శాతం, వ్యవసాయ రంగం 21 శాతం, వాణిజ్య రంగం 16 శాతం, ఇతర విభాగాలు 9 శాతం వినియోగం చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 3న 18,139 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. టిజిఎస్‌పిడిసిఎల్ పరిధిలో ఈ నెల 6న 11,129 మెగావాట్లు వినియోగం నమోదైంది. అలాగే జిహెచ్‌ఎంసి పరిధిలో ఈ నెల 3న 4,421 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20,975 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని వివరించారు. డిమాండ్ ఎంత పెరిగినా వినియోగదారులకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సంస్థ సిద్ధంగా ఉందన్నారు. సరఫరా, పంపిణీ నష్టాలను కూడా గణనీయంగా తగ్గించామని తెలిపారు. 2020–21లో 9.60 శాతంగా ఉన్న నష్టాలు ప్రస్తుతం 8.04 శాతానికి తగ్గాయని వెల్లడించారు. అలాగే పవర్ పర్చేసింగ్ ఖర్చు కూడా యూనిట్కు రూ.6.35 నుంచి రూ.5.54కు తగ్గిందన్నారు. ప్రతి యూనిట్‌కు లభిస్తున్న ఆదాయం రూ.6.11 నుంచి రూ.6.26కు పెరిగిందని చెప్పారు. పంపిణీ వ్యవస్థలో తీసుకున్న చర్యల వల్ల పిటిఆర్ ఫెయిల్యూర్స్ 1.82 శాతం నుంచి 1.49 శాతానికి తగ్గగా, డిటిఆర్ ఫెయిల్యూర్స్ 9.12 శాతం నుంచి 8.03 శాతానికి తగ్గాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా టిజిఎస్‌పిడిసిఎల్ పరిధిలో దాదాపు 30 శాతం గృహ వినియోగదారులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 5.44 కోట్ల జీరో బిల్లులు జారీ చేసినట్లు వెల్లడించారు. దీనికి గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1,930.66 కోట్ల సబ్సిడీ అందినట్లు చెప్పారు. గృహజ్యోతి పథకం వల్ల విద్యుత్ చౌర్యం కూడా తగ్గిందన్నారు. వచ్చే 2026–27 ఆర్థిక సంవత్సరంలో 71,916 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా చూస్తే రానున్న ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ టారిఫ్ పెంపు లేదా టైమ్ ఆఫ్ ది డే టారిఫ్ పెంపు ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు. బహిరంగ విచారణలో వ్యక్తమైన అభ్యంతరాలు, సూచనలపై స్పందించిన సిఎండి జితేష్ వి. పాటిల్, వ్యవసాయ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పరిశ్రమల సంఘాల ప్రతినిధులు బిల్లింగ్‌కు సంబంధించి వ్యక్తం చేసిన అభ్యంతరాలపై తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్‌సి)ను సంప్రదించి పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని చెప్పారు. ఇక టిజిఎస్‌పిడిసిఎల్‌కు ఉన్న రెవెన్యూ గ్యాప్‌ను భర్తీ చేయడానికి అవసరమైన నిధులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ అధికారి సభాముఖంగా వెల్లడించారు.

## మండలికి ఉద్ధవ్: రౌత్



**ముంబయి:** సంకీర్ణ రాజకీయాల కారణంగా గెలిచే ఏకైక రాజ్యసభ స్థానానికి శరద్ పవార్‌కు మద్దతు ప్రకటించాల్సి వచ్చిన శివసేన (యుబిటి) ఇప్పుడు ఉద్ధవ్ ఠాక్రే కోసం శాసనమండలి ఎన్నికల్లో ఎంవిఎ గెలుచుకోగల 'కచ్చితమైన' సీటు కోసం తన వాదనను వాస్తవంగా నిరూపించుకుంది. ఉద్ధవ్ ఠాక్రే శాసన మండలికి తిరిగి ఎన్నిక కావడం ముఖ్యమని సీనియర్ ప్రతిపక్ష నాయకులందరూ విశ్వసిస్తున్నారని ఆ పార్టీ ఎంపి సంజయ్ రౌత్ అన్నారు. మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) శాసన మండలి ఎన్నికల్లో ఒక స్థానాన్ని గెలుచుకోగలదని పేర్కొంటూ, రౌత్ వ్యతిరేకత లేకుండా పోటీ చేయాలని పిలుపునిచ్చారు. 20 మంది ఎమ్మెల్యేలతో శివసేన (యుబిటి) మహా వికాస్ అఘాడిలో అతి పెద్ద పార్టీ. తరువాత కాంగ్రెస్ (16 మంది ఎమ్మెల్యేలు), శరద్ పవార్ (ఎస్‌పి) అసెంబ్లీలో 10 మంది సభ్యులు ఉన్నారు. 'ఉద్ధవ్ ఠాక్రే శాసన సభ, మండలిలో బలమైన స్వరం. ఉద్ధవ్ థాకరే మళ్లీ శాసన సభకు వెళ్లడం ముఖ్యం అని మనమందరం కోరుకుంటున్నాము. అన్ని ప్రతిపక్ష పార్టీల సీనియర్ నాయకులందరూ కోరుకుంటున్నారు' అని రౌత్ విలేకరులతో అన్నారు. అయితే రాష్ట్ర శాసన మండలి ఎన్నికలు ప్రకటించబడినప్పుడు తగిన సమయంలో ఎంవిఎ పార్టీలు ఐక్యంగా అన్ని నిర్ణయాలు తీసుకుంటాయని ఆయన నొక్కి చెప్పారు. ఎంవీఏ ఎమ్మెల్యేలు ఎటువంటి తప్పుడు నిర్ణయం తీసుకోరని రౌత్ పేర్కొన్నారు.

## 4 వారాలు టిఆర్‌పి రేటింగ్స్ నిలిపివేత



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో న్యూస్ ఛానళ్లకు నాలుగు వారాల పాటు టెలివిజన్ రేటింగ్ పాయింట్స్(టిఆర్‌పి) నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇజ్రాయిల్‌ఇరాన్ ఘర్షణలకు సంబంధించి సంచలనాత్మక, కల్పిత రిపోర్టింగ్‌పై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార ప్రసార శాఖ ఈ ఆదేశాలు జారీచేస్తూ ప్రజల్లో అనవసర భయాందోళనలు సష్టించే వార్తా కథనాలను అనేక న్యూస్ చానళ్లు ప్రసారం చేస్తున్నట్లు తాము గమనించామని పేర్కొంది. యుద్ధ ప్రభావిత ప్రాంతాలతో సంబంధం ఉన్న తమ బంధువులు, స్నేహితులు లేదా వత్తిపరమైన సంబంధాలు ఉన్న వ్యక్తులకు ఇటువంటి సంచలనాత్మక, ఊహాజనిత కథనాలు ఆందోళన కలిగించే అవకాశం ఉందని కేంద్రం పేర్కొంది. సున్నితమైన అంతర్జాతీయ పరిణామాలు సంభవిస్తున్న కాలంలో బాధ్యతారహిత రిపోర్టింగ్ వీక్షకుల్లో ఆందోళన కలిగిస్తుందని తెలిపింది.


# కశ్మీర్‌లో ఆంక్షలు ఎత్తివేత

**శ్రీనగర్ :** ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత లోయలోని అనేక ప్రాంతాల్లో నిరసనలు చెలరేగిన నేపథ్యంలో వారం మొత్తం అమలులో ఉన్న ఆంక్షలను అధికారులు ఎత్తివేయడంతో శనివారం కశ్మీర్ అంతటా జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంది. 'లోయలోని అన్ని ప్రాంతాల నుండి ఆంక్షలు ఎత్తివేయబడ్డాయి, పరిస్థితి సాధారణంగా ఉంది' అని అధికారులు తెలిపారు. ప్రజలు గుమిగూడకుండా నిరోధించడానికి ఇక్కడి లాల్ చౌక్ నగర కేంద్రంతో సహా కొన్ని ప్రదేశాలలో ఏర్పాటు చేసిన బారికేడ్లను భద్రతా దళాలు తొలగించాయని వారు తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో ఖమేనీ హత్య తర్వాత ఆదివారం భారీ నిరసనలు జరగడంతో లాల్ చౌక్లోని ఐకానిక్ ఘంటా ఘర్ చుట్టూ బారికేడ్లు నిర్మించారు. లాల్ చౌక్, నగరంలోని ఇతర ప్రాంతాలలో శనివారం ఉదయం దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు తిరిగి తెరిచాయని, ప్రభుత్వ, ప్రైవేట్ రవాణా రెండూ సాధారణంగా నడుస్తున్నాయని అధికారులు తెలిపారు. సోమవారం విధించిన మొబైల్ ఇంటర్నెట్, ప్రీపెయిడ్ సిమ్ కార్డ్ సేవలపై ఆంక్షలు శుక్రవారం సాయంత్రం పునరుద్ధరించబడ్డాయి. అయితే, విద్యాసంస్థలు మూసివేయబడ్డాయి, మార్చి 9న తిరిగి తెరవబడతాయి. నగరం అంతటా బారికేడ్లు, చాలా మంది పోలీసులు, పారామిలిటరీ సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని తొలగించినప్పటికీ, పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.




## టికెట్ల సేకరణ అతని హాబీ..

చాలా మందికి ఏదో ఒక హాబీ ఉంటుంది. అయితే, సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్న పోస్టు ప్రకారం, ఒక వ్యక్తి తాను ప్రయాణించిన ప్రతిసారీ టికెట్లను దాచుకోవడం హాబీగా పెట్టుకున్నాడు. సాధారణంగా, దూర ప్రాంతాలకు ప్రయాణాలు ఆనందాన్ని ఇస్తాయి. అయితే వాటి తర్వాత అలసట, ఒత్తిడి కూడా కలుగుతాయి. కానీ ఒక యువ ప్రయాణికుడు తన టూర్ ముగిసిన తర్వాత చేసే చిన్న అలవాటుతో సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంటున్నాడు.



స్మారక చిహ్నాలుగా ఫ్రిజ్ మాగ్నెట్లు, కీచైన్లు కొనుగోలు చేయడం బదులు, అతను తన ప్రతి విమాన ప్రయాణ టికెట్‌ను జాగ్రత్తగా దాచుకుని గదిలోని గోడపై అతికిస్తాడు. తాజాగా అతను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న వీడియో వైరల్ అయింది. వీడియోలో, కొత్తగా చేసిన ప్రయాణానికి సంబంధించిన ఫ్లైట్ టికెట్‌ను గోడపై అతికిస్తూ, తన టికెట్ల సేకరణను గర్వంగా చూపించాడు. ఇప్పటికే అతని గోడపై వివిధ ఎయిర్‌లైన్స్‌కు చెందిన అనేక టికెట్లు అలంకరించాయి. ప్రతి టికెట్ అతని ఒక ప్రయాణ కథను గుర్తు చేస్తుంది. తన వీడియోలో మీరు టూర్ ముగిసిన తర్వాత ఏం చేస్తారు? అంటూ ఇతరులను కూడా తమ అలవాట్లు పంచుకోవాలని కోరాడు. దీనికి నెటిజన్లు ఆసక్తికరంగా స్పందించారు. నేను ఫ్రిజ్‌పై మాగ్నెట్ పెడతాను అని ఒకరు కామెంట్ చేయగా, మరొకరు ఇదే నిజమైన ఫ్లెక్స్ అంటూ ప్రశంసించారు. ఇంకొకరు డిల్లీ మెట్రో కార్డులు కూడా అతికించాడు అని వ్యాఖ్యానించారు. ఈ సృజనాత్మక ఆలోచన సాధారణ ప్రయాణ జ్ఞాపకాలను వ్యక్తిగత కళాఖండంగా మార్చింది. సోషల్ మీడియాలో అతని పోస్ట్‌కు విస్తృత స్పందన లభిస్తూ, సింపుల్ ఐడియా కూడా ఎంత ప్రత్యేకమవుతుందో మరోసారి నిరూపించింది.

## సరస్సులో ప్రమాదకర పరాన్నజీవి



అమెరికాలోని లేక్ మీడ్, లేక్ మొహావ్ సరస్సుల పరిసర ప్రాంతాల్లో కుక్కలకు ప్రమాదకరమైన పరాన్నజీవి ఆనవాళ్లు గుర్తించారు. నేషనల్ పార్క్ సర్వీస్ నిర్వహించిన రెండేళ్ల సర్వేలో ఈ పరాన్నజీవి వన్యప్రాణుల్లో ఉన్నట్లు ఆధారాలు లభించాయి. అయితే సాధారణంగా ఈ జీవిని వ్యాప్తిచేసే తీయని నీటి నత్తల్లో ఇది కనిపించకపోవడంతో ప్రస్తుతం ప్రమాదం తక్కువగా ఉన్నట్టు పరిశోధకు లు తెలిపారు. ఈ పరాన్నజీవి పేరు హెటెరోబిల్హార్జియా అమెరికానా. ఇది కుక్కల్లో కేనైన్ స్కిస్టోసోమియాసిస్ అనే తీవ్రమైన వ్యాధికి కారణమవుతుంది. ఇటీవల కొలరాడో నది పరిసర ప్రాంతాల్లో కొన్ని కుక్కలు అనారోగ్యానికి గురైన తర్వాత పరిశోధనలు ప్రారంభమయ్యాయి. సరస్సుల దగ్గర సేకరించిన రాకూన్ మల నమూనాల్లో ఈ పరాన్నజీవి గుడ్లు గుర్తించారు. నత్తలు అరుదుగా ఉండటం, ముఖ్యంగా వాటికి అవసరమైన మొక్కలు తక్కువగా ఉండటంతో, ఈ ప్రాంతాల్లో కుక్కలకు సంక్రమణ ప్రమాదం ప్రస్తుతం పరిమితంగానే ఉందని నిపుణులు భావిస్తున్నారు. లాస్ వేగాస్–లేక్ మీడ్ ప్రాంతంలో ఇప్పటివరకు కుక్కల్లో నిర్ధారిత కేసులు లేవు. మనుషుల్లో ఈ పరాన్నజీవి స్విమ్మర్'స్ ఇచ్ అనే చర్మ సమస్యకు దారితీస్తుంది. నీటిలో ఈదిన తర్వాత చర్మంపై ఎర్రదనం, గజ్జి వంటి లక్షణాలు కనిపించవచ్చని నిపుణులు అంటున్నారు.

## గగనతలంలో రక్షణ వ్యవస్థ



భారత వైమానిక దళం కోసం ఎయిర్‌షిప్స్ ఆధారిత హైఆల్టిట్యూడ్ సూడోశాటిలైట్ (ఎఎస్‌హెచ్‌ఎపిఎస్) కొనుగోలుకు రక్షణ కొనుగోలు మండలి తాజాగా అవసర ఆమోదం ఇచ్చింది. ఇది దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. ఎఎస్‌హెచ్‌ఎపిఎస్ అనేది సౌరశక్తితో నడిచే మానవరహిత వైమానిక వాహనం. ఇది భూమి ఉపరితలం నుంచి సుమారు 18–20 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న స్ట్రాటోస్ఫియర్‌లో దీర్ఘకాలం పనిచేయగలదు. సంప్రదాయ ఉపగ్రహాలు కనీసం 200 కిలోమీటర్ల ఎత్తులో భూమిని చుట్టుకుంటూ తిరుగుతాయి. వాటి ప్రయోగం కోసం ఖరీదైన రాకెట్ ప్రయోగాలు అవసరం. కానీ హెచ్‌ఎపిఎస్ వ్యవస్థలు పగలు సౌరశక్తి, రాత్రి అధిక సాంద్రత గల బ్యాటరీల సహాయంతో నెలల పాటు లేదా సంవత్సరాల పాటు గాల్లో నిలిచి పనిచేయగలవు. అందుకే వీటిని ప్సూడో సాటిలైట్ అని పిలుస్తారు. ఈ ప్లాట్‌ఫారమ్ నిర్దిష్ట ప్రాంతంపై స్థిరంగా తేలియాడుతూ నిరంతర పర్యవేక్షణ అందిస్తుంది. హై డెఫినిషన్ ఆప్టికల్, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు, ఆధునిక సెన్సార్లతో ఇది సరిహద్దు గస్తీ, లక్ష్యాల ట్రాకింగ్, సముద్ర పర్యవేక్షణ, నావిగేషన్ సహాయం, క్షిపణి గుర్తింపు వంటి 24 గంటల మిషన్లకు అనుకూలం. రియల్‌టైమ్ డేటా అందించగలగడం దీని ప్రధాన ప్రయోజనం. భారతదేశం స్వదేశీ హెచ్‌ఎపిఎస్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి బెంగళూరులోని నేషనల్ ఆరోస్పేస్ లాబొరేటరీస్ ద్వారా పరిశోధనలు కొనసాగిస్తోంది. 2024 ఫిబ్రవరిలో కర్ణాటకలోని చల్లాకెర్ ఆరోనాటికల్ టెస్ట్ రేంజ్‌లో 23 కిలోల బరువున్న, 12 మీటర్ల రెక్కల విస్తీర్ణం కలిగిన నమూనాను విజయవంతంగా పరీక్షించారు. ఇది సుమారు 3 కిలోమీటర్ల ఎత్తులో ఎనిమిది గంటలకుపైగా ఎగిరి అన్ని పనితీరు ప్రమాణాలను సాధించింది. ఎఎస్‌హెచ్‌ఎపిఎస్ అమలు ద్వారా భారత రక్షణ వ్యవస్థకు తక్కువ వ్యయంతో, దీర్ఘకాలిక. విశ్వసనీయ పర్యవేక్షణ సామర్థ్యం లభించనుంది.

– బిఎస్ఎస్ మైత్రేయి

# నేపాల్‌లో కొత్తగాలి

హిమాలయన్ పర్వత సానువుల దేశం నేపాల్‌లో ప్రజా ఉద్యమంతో రాచరిక వ్యవస్థ అంతమై ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా అవతరించిన గత రెండు దశాబ్దాల పైబడిన చరిత్రకు భిన్నంగా నేపాలీ ఓటర్లు తాజా ఎన్నికల్లో సాంప్రదాయ పార్టీలను త్రోసివేసి యువతరం అండతో ఏర్పడిన కొత్త పార్టీ రాష్ట్రీయ స్వతంత్రపార్టీ (ఆర్‌ఎస్‌పి)కి ఘనవిజయం చేకూర్చారు. గత అనేక ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల్లో ఏ పార్టీకి కనీస మెజారిటీ రానందున ఏ రెండు పార్టీలో జట్టుకట్టి – విడిపోయి– కొత్త జట్టు కట్టి ఇలా సంకీర్ణ ప్రభుత్వాలు నడపటంతో రాజకీయ అస్థిరత పరాకాష్టకు చేరింది. సోషల్ మీడియా వేదికలను నిషేధించిన ప్రభుత్వ ఉత్తర్వుకు వ్యతిరేకంగా స్కూలు విద్యార్థులు సహా యువతరం (జన్–జడ్) నిర్వహించిన ఉద్యమం పాలక కె.పి.ఎస్.ఓలీ ప్రభుత్వానికి, స్థిరపడిన రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా సర్వవ్యాప్త తిరుగుబాటుగా పరిణమించటంతో ఓలి ప్రభుత్వం రాజీనామా చేసింది. సైన్యం తటస్థంగా ఉంది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి నాయకత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం మార్చి 5న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించింది. సిపిఎన్–యుఎంఎల్ నేత, మాజీ ప్రధాని కె.పి.ఎస్.ఓలి, మాజీ మావోయిస్టు , మాజీ ప్రధాని పుష్పకుమార్ దహాల్ (ప్రచండ) నాయకత్వంలో నాలుగైదు కమ్యూనిస్టు గ్రూపులతో ఏర్పడిన నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), యువనాయకుడు గగన్ థాప నాయకత్వంలో నేపాలీ కాంగ్రెస్ విడివిడిగా పోటీ చేశాయి. అయితే యువత తిరుగుబాటులో వారికి ప్రేరణ, ఆకర్షణ శక్తిగా అవతరించిన మాజీ సంగీత కారుడు, కాఠ్మండ్ మాజీ మేయర్ బాలెంద్రషా నాయకత్వంలో కొత్త రాజకీయ పార్టీ ఆర్‌ఎస్‌పి పరిశీలకులు ముందునుంచీ ఊహిస్తున్న దానికి మించిన ఫలితాలతో ఏకపక్ష మెజారిటీ సాధించింది. షా కాబోయే ప్రధానమంత్రి.

నేపాల్ పార్లమెంట్ దిగువ సభలోని 275సీట్లలో 165కు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. దామాషా ఓటు ప్రకారం 110 సీట్లు కేటాయిస్తారు. ప్రత్యక్ష ఎన్నికలు జరిగిన 165 సీట్లలో అత్యధికం ఆర్‌ఎస్‌పి ఖాతాలో పడ్డాయి. మిగతా మూడు సాంప్రదాయక పార్టీలు రెండంకెలకు చేరలేదు. ఆర్‌ఎస్‌పి 2022 ఎన్నిక ల ముందు ఏర్పడింది. 131సీట్లకు పోటీచేసి 10.7 శాతం ఓట్లతో ప్రత్యక్ష ఎన్నికల్లో 7, దామాషాలో 13 సీట్లు పొందింది. మీడియా ఓనర్ బాబా లచానే దీని వ్యవస్థాపకుడు. బాలేంద్ర షా అటు తర్వాత చేరారు. అతను జన్–జడ్ కు మెంటార్‌గా పనిచేశారు. జన్–జడ్ ఒక దశలో సొంత పార్టీ ఏర్పాటు గూర్చి ఆలోచించింది. కాని అంతిమంగా షా వెనుక సమీకృతమై ఆర్‌ఎస్‌పిని బలపరిచింది.

ఆర్‌ఎస్‌పి ఘనవిజయం ఆ చిన్న పర్వత దేశంలో మాత్రమే గాక, దక్షిణాసియాలో రూపుదిద్దుకుంటున్న రాజకీయాల్లో కూడా మార్పుకు సంకేతం. కమ్యూనిస్టుపార్టీల వ్యక్తి అహంభావ రాజకీయాలు, ఒంటెత్తు పోకడకు నేపాల్ ఫలితాలు చెంపపెట్టు కూడా. ఒక ఎన్నికల్లో ఓటమితో వాటి చరిత్ర, త్యాగాలు చెరిగిపోవు. అనుభవాలనుంచి గుణపాఠాలు తీసుకోవటానికి, వైఖరుల దిద్దుబాటు ద్వారా ఐక్యం ఛత్రం కిందకు రావటానికీ అన్ని బ్రాండ్ల కమ్యూనిస్టుపార్టీలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సందర్భం ఇది.

యువత అయత్నకృత తిరుగుబాటుద్వారా దక్షిణాసియాలో సాంప్రదాయక రాజకీయ పార్టీల పాలనను గద్దెదించి జన్–జడ్ అండతో ప్రభుత్వం ఏర్పడిన రెండవదేశం నేపాల్. మొదటిదేశం శ్రీలంక. అక్కడ 2024లో దాదాపు ఇవే దృశ్యాలు సాక్షాత్కరించాయి. 2022లో ప్రజాతిరుగుబాటు, 2023లో ఎన్నికలు. దీవి దేశం శ్రీలంకను దశాబ్దాలుగా ఏలుతున్న సాంప్రదాయ పార్టీలను యువత సారధ్యంలో ప్రజలు తిరస్కరించి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి–పూర్వ జనతా విముక్తి పెరుమున – కమ్యూనిస్టు) అభ్యర్థి అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. అనంతరం పార్లమెంటు ఎన్నికల్లో కూడా అదే ఫ్రంట్ అభ్యర్థులకు పట్టంకట్టారు.

బంగ్లాదేశ్‌ది భిన్నమైన కథ. జన్–జడ్ ఉద్యమం 2024 ఆగస్టులో అధ్యక్షురాలు హసీనా ప్రభుత్వాన్ని కూల్చింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 12 న జరిగిన పార్లమెంటు ఎన్నికల దాకా జన్–జడ్ రాజకీయ పార్టీగా ఏర్పడికూడా ప్రజాదరణ నిలుపుకోలేకపోయింది. మతోన్మాద జమాతె ఇస్లామీతో జట్టుకట్టి విఫలమైంది. హసీనా భారత్‌లో ఆశ్రయం పొందగా, బంగ్లాదేశ్‌లో ఆమె వ్యతిరేక సాంప్రదాయక బిఎన్‌పి మూడింట రెండువంతుల మెజారిటీతో అధికారంలోకి వచ్చింది.

నేపాల్‌లో విజయం సాధించి సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న ఆర్‌ఎస్‌పికి, దాని నాయకుడు బాలేంద్ర షాకు అభినందనలు. కొన్ని విషయాల్లో ఆయన భారత వ్యతిరేక అభిప్రాయాలు వ్యక్తం చేసినా భారత్ ద్వేషి కాదు. కాబట్టి భారత ప్రభుత్వం తన ఇరుగుపొరుగు విధానంలో సవరింపులు చేసుకుని దక్షిణాసియాలోని కొత్తతరం ప్రభుత్వాలతో కలిసి పనిచేయటం, పాత ప్రభుత్వాలతో శాంతి, స్నేహ, సహకార సంబంధాల పటిష్టతకు కృషి చేయటం అవసరం.

# మహిళా సాధికారత, బహుముఖీయ అభివృద్ధికై పోరాడుదాం!



నేదునూరి జ్యోతి
ప్రధాన కార్యదర్శి
భారత జాతీయ మహిళా సమాఖ్య
తెలంగాణ రాష్ట్రం
9908284996

ప్రపంచ మహిళలు ప్రతిఘటన విప్లవోద్యమంలో పాల్గొనడం ద్వారా స్వేచ్ఛా సమానత్వం సాధించడం సాధ్యమవుతుందని ప్రపంచ కమ్యూనిస్టు సోషలిస్టు ఉద్యమ నాయకురాలు క్లారా జెట్కిన్ మార్చి 8, 1910న జరిగిన 2వ అంతర్జాతీయ సోషలిస్టు మహిళా సదస్సులో ప్రపంచ మహిళ లోకానికి పిలుపు నివ్వడం జరిగింది. అప్పటినుండే ప్రతి సంవత్సరము మార్చి 8న శ్రామిక మహిళల హక్కుల సాధన దినంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పాటించబడుతోంది. 1911 మార్చి 8న ప్రథమంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగింది. పని గంటల తగ్గింపు, మహిళల ఓటు హక్కు, విశ్రాంతి సమయం, కూలి పెంపుకోసం ఉద్యమం ప్రారంభమైంది. 1820లో న్యూ ఇంగ్లాండులో టైలరింగ్ ట్రేడ్స్‌లో మహిళలు సమ్మె చేయడం జరిగింది. 1834లో వేతనాలలో కోతకు వ్యతిరేకంగా కాటన్ మిల్లు మహిళా కార్మికులు జౌళి పరిశ్రమలలో సంస్కరణలు చేయాలని డిమాండ్ చేస్తూ వీధుల్లోకి వచ్చారు. 1857 మార్చి 8న న్యూయార్క్ నగరంలో మహిళలు యూనియన్ ఏర్పాటు చేసుకొని సమాన పనికి సమాన వేతనాలు కల్పించాలని, పరిశ్రమలలో మెరుగైన పని పరిస్థితుల కొరకు పోరాడినారు.



క్లారా జట్కిన్ పోరాట స్ఫూర్తితో వర్గ చైతన్యాన్ని సంతరించుకొని మహిళాలోకాన్ని ఐక్యపరిచి సమస్యల సాధనకు పోరాటాలను నిర్వహించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహిళాలోకానికి పిలుపు నిచ్చింది మానవజాతి లో సగభాగంగా ఉన్న మహిళల సమస్యలు పరిష్కారం కావాలంటే అసమానతలతో, వివక్షతలతో నిండియున్న సామ్రాజ్యవాద దోపిడీ పాలనను నిర్మూలించి దోపిడీ పీడనలేని నవ సమాజాన్ని నిర్మించుట కొరకు మహిళాలోకం ప్రజాస్వామిక జాతీయ ప్రజాతంత్ర విప్లవంలో భాగస్వాములు కావలసిన ఆవశ్యకత ఆసన్నమైంది. మహిళలకు నిజమైన విముక్తి సమసమాజం ఏర్పాటుతోనే కలుగుతుంది. 1975లో ఐకరాజ్యసమితి మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినంగా జరపాలని నిర్ణయించడం ఒక గొప్ప విజయం. కానీ, క్రమంగా పాలక వర్గాలు మహిళలను ఆకర్షించడం కొరకు అందాల పోటీలు, ముగ్గుల పోటీలు, కేక్ కటింగ్ అభినందన సభలు, సంక్షేమ పథకాల పేరుతో మహిళలను ఓటు బ్యాంకులుగా చూడడం జరుగుతున్నది. విప్లవ కమ్యూనిస్టు పార్టీలు మాత్రం మహిళల హక్కుల దినంగా జరుపుకోవాలని నిర్ణయించడం జరిగింది.

దేశాభివృద్ధికి స్త్రీల శక్తి సామర్థ్యాలు సంపూర్ణంగా బయటకు రావాలన్నా, ఉపయోగపడే రీతిగా అందరికీ అవకాశాలు కల్పించాలన్నా, సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక రంగాలలో స్త్రీల భాగస్వామ్యాన్ని, క్రియాశీల పాత్రను పెంచాలన్నా, పురుషులతో సమానంగా విద్యా ఉద్యోగ అవకాశాలను పొందాలన్నా, ఆరోగ్యంగా, ఆత్మగౌరవంగా జీవించాలన్నా, వివక్ష, హింసలేని సమాజాన్ని నిర్మించాలన్నా, అందు కొరకు చేయబడిన చట్టాలు సక్రమంగా అమలుకావాలన్నా మహిళా ఐక్య ఉద్యమాలు నిర్మించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యు) మహిళా లోకానికి పిలుపునిస్తోంది.

పితృస్వామిక సామాజిక దృక్పథము సమూలంగా మారాల్సి ఉంది. పురుష దృక్పథం నుండి పురుష ప్రయోజనాల కోణం నుండి నిర్మించబడిన వ్యవస్థలు, విలువలు మారాల్సి ఉంది. అందువల్లనే మహిళా దృక్పథానికి, ఈ సాధికారతా విధానానికి పెద్దపీట వేయాల్సి ఉంది. మహిళా సాధికారిత జాతీయ విధానం లక్ష్యాలలో ఒకటిగా ఉండాలి. సామాజిక వైఖరులను ఆచార వ్యవహారాలను మార్చడానికి స్త్రీ పురుషులిద్దరి భాగస్వామ్యంతో నిబద్ధతతో కృషి చేయవల్సి ఉంది. పితృస్వామ్య ఆధిపత్య భావజాలాన్ని నిర్మూలించేందుకు మహిళా సంఘాలను నిర్మించడం, బలోపేతం చేయడం నేటి తక్షణ ఆవశ్యకత. జండర్ స్పృహను పెంచి, అవగాహన కల్పించడానికి పాలక వర్గాలు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మహిళల రక్షణ ప్రపంచ శాంతి, రక్షణతో ముడిపడి ఉన్నది. ఈ క్రమములో అంతర్జాతీయ మహిళా దినోత్సవనాడు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ మహిళా శక్తి విజృంభించాల్సిన సమయం ఆసన్నమైనది. అమెరికన్ సామ్రాజ్యవాదం 195 దేశాలలో 80 ప్రాంతాలలో 800 సైనిక స్థావరాలను ఏర్పర్చుకొని ప్రపంచాన్ని శాసించాలని చూడటాన్ని భారత జాతీయ మహిళా సమాఖ్య తీవ్రంగా ఖండిస్తున్నది.

సమాజంలో మహిళలు, బాలికలు, పసిపిల్లలపై పెరుగుతున్న అణిచివేతకు, హింసకు, అత్యాచారాలకు పాలకులు పెంచి పోషిస్తున్న భూస్వామ్య పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద విష సంస్కృతే ప్రధాన కారణమనేది నగ్న సత్యం. సామ్రాజ్యవాదం తన విష సంస్కృతిని ఇంటర్‌నెట్ ద్వారా, టి.వి.ల ద్వారా, సినిమాల ద్వారా, పత్రికల ద్వారా విస్తృత ప్రచారం చేస్తూ మహిళా యువశక్తిని, నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగంగా అందాల పోటీలు, అర్థనగ్న ప్రదర్శనలు విరివిగా ప్రోత్సహిస్తున్నది. పర్యవసానంగా మహిళాశక్తి కూడ నిర్వీర్యం అవుతున్నది. ఈ సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షించే శక్తులతో కలిసి ప్రజాస్వామిక పోరాటాలలో మహిళాలోకం భాగస్వాములు కావాలని ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యు. పిలుపునిస్తున్నది.

వర్ల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూ.హెచ్.ఓ), ఐక్యరాజ్య సమితి సంయుక్తంగా ప్రకటించిన రిపోర్టు ప్రకారంగా ప్రపంచవ్యాప్తంగా రోజుకు 137 మంది మహిళలు అంటే 10 నిమిషాలకు ఒక మహిళ తన జీవిత భాగస్వామితో గానీ, కుటుంబ సభ్యులచేత గానీ హత్యకు గురౌతున్నారు. ఏ దేశము మహిళలకు రక్షణ కల్పించలేక పోతున్నదని డబ్ల్యు హెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ అన్నారు. ఆర్థిక రక్షణ లేకపోవడం, సంక్షోభాలు, మహిళల పట్ల పెరుగుతున్న హింసకు కారణాలు అని చెబుతున్నారు. ఇక మనదేశంలో మనువాద భావజాలం, మరోవైపు ఆర్థిక సంక్షోభంవల్ల మహిళలపై హింస మరింత పెరుగుతున్నదని ఎన్.సి. ఆర్.బి డేటా కూడా మనకు తెలియజేస్తున్నది. మనదేశంలో మహిళలు అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నారు. రైతు, కూలీ మహిళలు తరతరాలుగా భూ స్వామ్య దోపిడీ దౌర్జన్యాలకు గురి అవుతుండగా, మరోవైపు పట్టణాలలో శ్రామిక స్త్రీలు ఫ్యాక్టరీలలో, అసంఘటిత రంగాలలో పెట్టుబడిదారుల దోపిడీకి గురిఅవుతున్నారు.

స్త్రీ పురుషుల అసమానత్వం, వివక్షల వల్లనే స్త్రీలు అన్ని రకాల హింసలకు గురి అవుతున్నారు. ఈ భరించరాని హింసకు కారణం భర్తలే కనుక వారిని చంపడమే పరిష్కారంగా కొంతమంది స్త్రీలు ఎంచుకుంటున్నారు. ఇక్కడ ఇంకొ క పురుషుడి సహాయం తీసుకుంటున్నారు. కానీ నేటి సమా జం, మీడి యా ఆ పురుషులను కాకుం డా పూర్తి గా మహిళలనే నేరస్తులను చేస్తూ ప్రచారం చేస్తున్నారు. సమాజంలో పెరుగుతున్న హింస, సామ్రాజ్యవాద సంస్కృతి, మీడియా ప్రభావాలకు గురైన మహిళలు ఈ తాత్కాలిక పరిష్కారాలను ఎంచుకుంటున్నారు. సమాజంలో మార్పులు సాధించగలిగేది మహిళా ఉద్యమాలే. ఉద్యమాలు లేకుంటే చైతన్యం రాదు. చైతన్యం లేకపోతే సరైన, శాస్త్రీయమైన నిర్ణయాలు తీసుకోలేరు. సమాజంలో ఈ చైతన్యవంతమైన మార్పు రావాలంటే సంఘటిత ఉద్యమాలు ఇంకా బలపడవలసిన అవసరం ఉంది. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం ఒక స్ఫూర్తి దాయక మహత్తర చరిత్ర కలిగిన పోరాట దినంగా గుర్తిస్తూ మహిళా హక్కుల దినంగా జరుపుకోవడం సముచితం. అదేవిధంగా మహిళా సమస్యలను మహిళా ఉద్యమాల ద్వారా పరిష్కరించుకుంటూ మహిళా హక్కుల్ని సమర్థించే సంఘాలతో ఐక్య పోరాటాలు కొనసాగిస్తూ కలసికట్టుగా నిలబడుదాం. మహిళా ఉద్యమాల వలన అనేక చట్టాలు సాధించుకున్నాం. మహిళలపై జరుగుతున్న దోపిడీ, పీడన, హత్య, అత్యాచారాలను, లింగ వివక్షతలను మహిళా చైతన్యంతో ఎదుర్కొని పోరాడాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యు) మహిళా లోకానికి పిలుపునిస్తోంది. నేడు సమాజంలో మహిళలపై జరుగుతున్న సకల సాంఘిక దురాచారాలను మహిళా ఉద్యమాల ద్వారానే అరికట్టగలం. పాలక వర్గాలు కూడా సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి ముందుకు రావాలి. అత్యాచారాలు, హత్యలకు మూలమైన మద్యము, పోర్న్ వీడియోలు, అశ్లీల సాహిత్యము, చిత్రాలను నిషేధించాలని ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యు డిమాండ్ చేస్తున్నది.

**నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా**

# నాలుగు దశాబ్దాల ఆకాంక్ష...విద్యార్థి సంఘ ఎన్నికలు

**రాజధాని సందడి**

– బొమ్మగాని కిరణ్‌కుమార్

ఇటీవల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి తెలంగాణ విద్యా కమిషన్ అందించిన తెలంగాణ విద్యా విధానం నివేదిక విద్యార్థి సంఘం ఎన్నికలు పునరుద్ధరించాలనే సిఫార్సు చేసింది. తక్షణమే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని కమిషన్ గట్టిగానే ప్రభుత్వానికి సూచన చేసింది. ఇది మంచి సిఫార్సే కాకుండా, ప్రస్తుత కెరియరిజం యుగంలో అత్యంత ఆవశ్యకం. దేశానికి, సమాజానికి నిర్మాణాత్మకమైన భవిష్యత్తు నాయకత్వాన్ని అందించడంలో విద్యార్థి రాజకీయాలు, విద్యార్థి సంఘ ఎన్నికలు భూమికను అందించటాన్ని గతంలో చూసాం. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యూనివర్సిటీల నుంచి జాతీయ స్థాయి నాయకులుగా ఎదిగిన వారిలో మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు, కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు. వీరు తాము ప్రాతినిధ్యం వహించిన జాతీయ పార్టీలకు నాయకత్వ బాధ్యతలను సైతం పోషించారు. పాత్రికేయ దిగ్గజం సి.రాఘవాచారి, జార్జిరెడ్డి, ఎం.శ్రీధర్‌రెడ్డి, పులి వీరన్న, తదితర విభిన్న సిద్ధాంతాలకు ప్రాతినిధ్యం వహించిన వారు సైతం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులే. అప్పట్లో యూనివర్సిటీలు సైద్ధాంతిక చర్చలు, ప్రజా ఉద్యమాలకు కేంద్రాలుగా విలసిల్లేవి. విద్యార్థి రాజకీయాల కారణంగా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్యం ప్రాధాన్యత, సామాజిక బాధ్యత పెంపొందుతాయి. జెఎన్‌యు విద్యార్థి సంఘ నాయకులుగా గుర్తింపు పొందిన సీతారాం ఏచూరి, ప్రకాశ్ కారాత్‌లు సిపిఐ(ఎం) పగ్గాలు చేపట్టారు. ప్రస్తుత కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఆ యూనివర్సిటీలో చదివినవారే. బిహార్ ముఖ్యమంత్రులుగా పనిచేసిన నితీష్ కుమార్, లాలు ప్రసాద్ యాదవ్‌లు సైతం పాట్నా యూనివర్సిటీ విద్యార్థి రాజకీయాలనుండి ఎదిగిన వారే.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిజాం కాలేజీ విద్యార్థి సంఘ ఎన్నికల్లో జరిగిన హత్యతో 1988లో విద్యార్థి సంఘ ఎన్నికలపై నాటి రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఆ తరువాత కూడా విద్యార్థి సంఘ రాజకీయాలు తెలుగు నాట విస్తృతంగానే సాగాయి. క్యాపిటేషన్ ఫీజు, మండల్ కమిషన్, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలకు నేతృత్వం వహించాయి. 90వ దశకంలో ఆర్థిక సంస్కరణల ప్రవేశం అనంతరం, క్రమం గా విద్యార్థులు కెరీరిజం వైపు మొగ్గు చూపుతూ, విద్యార్థి సంఘాలలో గతంలో మాదిరిగా క్రియాశీలంగా పాల్గొనడం లేదనేది వాస్తవం. ఇంజనీరింగ్ కాలేజీల విస్తరణ తరువాత ఇది మరింత తగ్గిపోయింది. దీంతో సామాజిక అంశాలు, సామాజిక బాధ్యతల నుంచి వారు దూరమవుతున్నారు. అయితే, దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘ ఎన్నికలు జరుగుతున్న విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు సామాజిక, రాజకీయ అంశాల పట్ల చురుకుగానే ఉంటున్నారు. అందుకు ఢిల్లీలోని సుప్రసిద్ధ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయమే నిదర్శనం. ఆ విశ్వవిద్యాలయం నుంచి అనేక మంది విద్యార్థి నాయకులు ప్రత్యక్ష రాజకీయాలలోకి కూడా ప్రవేశిస్తున్నారు. జెఎన్ యు విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎఐఎస్ఎఫ్ తరపున పోటీ చేసి గెలిచిన కన్హయ్యకుమార్ తదనంతర కాలంలో బిహార్‌లోని బేగూసరాయి నుంచి సిపిఐ తరపున, గత ఎన్నికల్లో ఈశాన్య ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అదే యూనివర్సిటీ నుంచి అధ్యక్షుడిగా ఎన్నికైన ధనుంజయ్ గత



బిహార్ శాసనసభ ఎన్నికల్లో భోరే నియోజవర్గం నుంచి సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థి గా పోటీ చేశారు. పాట్నా యూనివర్సిటీ విద్యార్థి నాయకురాలు దివ్య గౌతమ్ అదే పార్టీ తరపున దిఘా శాసనసభ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు. జెఎన్‌యులోనే వివిధ స్థానాలతో పాటు, అధ్యక్షుడిగా కూడా ఎన్నికైన నాసిర్ హుస్సేన్ కాంగ్రెస్ తరుపున ప్రస్తుతం రెండవసారి కర్నాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అదే జెఎన్‌యులో ఎఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడిగా పని చేసిన ముహమ్మద్ ముహస్సిన్ సిపిఐ నుంచి కేరళలో రెండవసారి ఎంఎల్‌ఏగా గెలుపొందారు.తెలంగాణలో యూనివర్సిటీ ఎన్నికల నిషేధం తరువాత విద్యార్థి నాయకులు పెద్దగా రాజకీయాలలో రాణించలేదు. మలి దఫా తెలంగాణ ఉద్యమం లో మరోసారి యూనివర్సిటీలో విద్యార్థి రాజకీయాలలో కొంత కదలిక వచ్చింది.ఎన్ఎస్‌యు ఐ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వాన్ని చేపట్టిన పొన్నం ప్రభాకర్ ఎంపిగా, ఎంఎల్‌ఏగా ఎన్నికై మంత్రిగా కొనసాగుతుండగా, మరో నాయకుడు వంశీచంద్‌రెడ్డి సైతం ఒకమారు ఎంఎల్‌ఏగా గెలుపొంది, గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో లోక్‌సభ ఎన్నికల్లో విజయానికి దూరమయ్యారు. బిఆర్ఎస్ నుంచి బాల్క సుమన్, కిషోర్ వంటి ఉస్మానియా యూనివర్సిటీ విద్యా ర్థి నాయకులు ఎంఎల్‌ఏలుగా ఎదిగారు. బొంతు రామ్మోహన్ హైదరాబాద్ మహానగర మేయర్‌గా కూడా పని చేశారు.

యూనివర్సిటీలలో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణ ద్వారానే విద్యార్థులను యూనివర్సిటీ పరిపాలనలో, అకడమిక్స్‌లో భాగస్వామ్యం చేయబడతారని లింగ్డో కమిషన్ సిఫార్సు చేసింది. సుప్రీం కోర్టు సైతం ఎన్నికలు నిర్వహణకు మార్గదర్శనం చేసింది. చివరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సైతం యూనివర్సిటీలలో ఎన్నికలు నిర్వహించాలని అన్ని రాష్ట్రాలకు గతంలో లేఖలు పంపింది. అయినప్పటికీ, తెలుగు రాష్ట్రాలలో అమలు కాలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో విద్యార్థి సంఘ ఎన్నికల నిర్వహణకు సుముఖత వ్యక్తపరిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అనేక మార్లు యూనివర్సిటీ ఎన్నికల నిర్వహణకు హామీ ఇచ్చారు. తాజా విద్యా కమిషన్ విశ్వవిద్యాలయాలలో విద్యార్థి సంఘ ఎన్నికలను నిర్వహించాల్సిందేనని స్పష్టంగా చెప్పింది. విద్యా సంవత్సరంలో 75 శాతం హాజరు కలిగిన యూనివర్సిటీలో ఎన్‌రోల్ అయిన విద్యార్థి మాత్రమే పోటీకి అనుమతించాలని సూచించింది. ఈ ఎన్నికలు రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలు, విద్యార్థి సంఘాల పేరిట ప్రచారం జరపకూడదని కూడా పేర్కొంది. అంతే కాకుండా విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అడమిక్ కౌన్సిల్‌లో ప్రాతినిధ్యం కల్పించాలని, చట్టబద్ధంగా ఎన్నికైన విద్యార్థి సంఘం సభ్యులు మాత్రమే విద్యార్థుల అంశాలపై డీన్స్, చీఫ్ వార్డెన్, రిజిస్ట్రార్, విసిలకు ప్రాతినిధ్యం చేయాలి అనే సిఫార్సులు చేసింది విద్యా కమిషన్. పొరుగు రాష్ట్రమైన కర్నాటకలో రెండు రోజుల క్రితం శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన ప్రసంగంలో విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘ ఎన్నికల నిర్వహణపై విధించిన నిషేధాన్ని సమీక్షిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం తెలంగాణలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఇఫ్లూ, మనూ విశ్వవిద్యాలయాలలో ఎన్నికలు జరుగుతున్నాయి. రాష్ట్ర యూనివర్సిటీలలో చివరిసారిగా ఎన్నికలు 1988లో జరిగా యి. సుమారు నాలుగు దశాబ్దాల ఆకాంక్ష అయిన విద్యార్థి సంఘ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే సానుకూల ప్రకటన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## 13 నుంచి సిపిఐ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్

ప్రజాప్రతినిధులకు రెండు రోజుల శిక్షణా శిబిరం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పక్షాన ఎన్నికైన కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని సుగుణ గార్డెన్స్‌లో 13వ తేదీ ఉదయం 10 గంటలకు వర్క్‌షాప్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రారంభించనున్నారు. మొదటిగా డాలర్ పుట్టుక ప్రాధాన్యత, మారకపు విలువ, బడ్జెట్‌పై అవగాహన అంశాన్ని ఆయన బోధించనున్నారు. ప్రారంభ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె. నారాయణ, జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్‌పాషా లు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 73, 74 రాజ్యాంగ సవరణలు, రాజ్యాంగ బద్ధత, స్థానిక సంస్థల ప్రాధాన్యత అనే అంశంపై మాడభూసి శ్రీధర్ బోధించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై ప్రొ॥ కోదండరాం, సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక సంస్థలు కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై ప్రొ॥ హరగోపాల్ బోధించనున్నారు. 14న ఉదయం 10.30కు భారతదేశ సమైక్య విధానం స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు వివక్ష అనే అంశంపై పరకాల ప్రభాకర్, ప్రభుత్వాలు చట్టాల దుర్వినియోగం అనే అంశంపై ప్రొ॥ ఖాసీం లు బోధించనున్నారు. 14న మధ్యాహ్నం మూడు గంటలకు ప్రజాప్రతినిధులుగా కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై ప్రొ॥ నాగేశ్వర్ బోధించనున్నారు.

## వెలుగుమట్ల భూ వివాదంలో 19 కేసులు నమోదు

అడిషనల్ డిసిపి ప్రసాదరావు

**ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం :** యుసిసిఆర్ఎల్ (ఎంఎల్) ఒపిడిఆర్ భూదాన్ కమిటీ సభ్యులమని తప్పుడు ప్రచారంతో వెలుగుమట్ల నిరుపేద బాధితుల నుంచి రూ.3 కోట్లు వసూలు చేసి మోసం చేశారని అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు శనివారం తెలిపారు. భూదాన్ యజ్ఞ బోర్డు లెర్నిడ్ స్టాండింగ్ కౌన్సిల్ సమగ్ర విచారణలో నకిలీ పత్రాలు, అక్రమ కేటాయింపులుగా వెలుగు చూశాయని తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే 19 కేసుల్లో 21 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయన్నారు. నిందితులంతా ఒక గ్యాంగ్‌గా ఏర్పడి తాము ఒపిడిఆర్ భూదాన్ కమిటీ సభ్యులమని తప్పుడు ప్రచారం చేసుకుని అమాయక ప్రజలను ప్రేరేపించి వారికి ఆశపెట్టి భూదాన్ భూముల్లో ఇంటి స్థలాలు ఏర్పాటు చేస్తామని ఒక్కొక్కరి నుంచి రూ. 50వేల నుంచి లక్ష వరకు వసూలు చేశారన్నారు. ఈ ముఠా సభ్యులపై గతంలో 15 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఎవరైనా బాధితులు మోసపోయినట్లయితే ఫిర్యాదు చేయాలని తెలిపారు. దీనికి సంబంధించి ఖానాపురం హవేలీ, సత్తుపల్లి, కొణిజర్ల పోలీస్ స్టేషన్లలో కూడా కేసులు నమోదైనట్లు తెలిపారు. కొప్పెర వెంకన్న, కొట్టె బాసు, సంపంగి వెంకటాచలం, బల్లి శ్రీనివాసరావు, తాళ్లూరి కృష్ణ, బుడిగె రాములు, మంకిడి లింగరాజు, రాచకొండ నర్సింహాచారి, దండ లింగయ్యలను అరెస్టు చేసినట్లు అడిషనల్ డిసిపి తెలిపారు.

## ఉపాధ్యాయుడికి దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత



**ప్రజాపక్షం/ ఖమ్మం :** విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయునికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం నగరంలోని ఖాజీపుర పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అర్షద్‌పాషా పాఠశాలలో బాలికలను వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడిని నిలదీశారు. ఉపాధ్యాయుని తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ పోలీసులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఉపాధ్యాయుడి తీరును నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. వెంటనే కీచక ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే నీచానికి పాల్పడటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు మస్తాన్, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుర్రా మనోజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక పటిష్టంగా అమలు

జిల్లా కలెక్టర్ అనుదీప్




**ప్రజాపక్షం/వైరా :** పట్టణంలో పరిశుభ్రతను మెరుగుపరిచి ప్రజలకు శుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా అభివృద్ధి పనులను వేగవంతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం వైరా మున్సిపాలిటీలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా వైరా మున్సిపాలిటీ 20, 14 వార్డులో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కౌన్సిలర్లు వుండ్రు వరలక్ష్మి, శ్యామ్‌బాబు, ధీరావత్ వెంకటేశ్వర్లు, మోర్ శ్రీకాంత్, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం వైరాలో 100 పడకల హెల్త్ కమ్యూనిటీ సెంటర్ పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తూ, పనులు నాణ్యత ప్రమాణాలతో, జూన్2 లోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపా లు లేకుండా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, తహసీల్దార్లు సురేష్, అరుణ, ఎంపిడిఓలు, సక్రునాయక్, వైరా మున్సిపాల్ కమిషనర్ గురులింగం, ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలకు కృషి

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగ ం చేసుకోండి

ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపాలన ఉచిత వైద్య శిబిరానికి ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని, ప్రభుత్వం ద్వారా ప్రజా పాలనలో భాగంగా అందిస్తున్న ఉచిత వైద్యాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం సుజాతనగర్ పిహెచ్‌సిలో కలెక్టర్ అంకిత్‌తో కలిసి ఆయన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లాలో ప్రతీ రోజు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరాలు ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు శిబిరానికి వచ్చిన ప్రతీ రోగిని క్షుణ్ణంగా పరిశీలించి సరైన వైద్యం అందించి మందులు ఇవ్వాలన్నారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించి హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రధానంగా రక్త పరీక్షలు, గుండె పరీక్షలు చేయించుకుని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుకుని మెరుగుపరుచుకోవాలన్నారు. అవసరమైన రోగులను కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి పంపించాలని, అక్కడ స్కానింగ్, ఎక్స్‌రే వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్, తహసీల్దార్ ప్రసాద్, వైద్యాధికారి రమేష్, ఎంపిడిఓ భారతి, సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ట్రాన్స్ జెండర్స్ సమాజంలో ఎలాంటి వివక్షను ఎదుర్కోకుండా స్వయం ఉపాధి పొందాలని, ఇందుకోసం ప్రభుత్వం సబ్సిడీ రుణాలను అందిస్తుందని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాలు, దివ్యాంగ వివాహక ప్రోత్సాహకాలు, ట్రాన్స్ జెండర్స్‌కు సబ్సిడీ రుణాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు దినచర్యలో ఎంతగానో ఉపయోగపడతాయని, లబ్ధిదారులు వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. రెట్రో ఫిట్టెడ్ మోటరా స్కూటీలు అర్హులైన వారికి సిఎస్ఆర్ ద్వారా కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాన్స్ జెండర్స్ స్వయంగా ఉపాధి పొందాలని, ఇందు కోసం ప్రభుత్వం నుండి సబ్సిడీ రుణాలు అందుతాయని చెప్పారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఐదుగురు ట్రాన్స్ జెండర్స్‌కు సబ్సిడీ రుణాలు అందినట్లు తెలిపారు. మొత్తం రెట్రో పిట్టెండ్ స్కూటీలు 25, బ్యాటరీ ట్రై సైకిళ్లు 7, బ్యాటరీ విల్‌చైర్స్ 7, దివ్యాంగుల ఆర్థిక పునరావాస సబ్సిడి 8 మందికి, వివాహ ప్రోత్సహాక బహుమతి 8 మందికి, ట్రాన్స్ జెండర్స్ ఆర్థిక పునరావాస సబ్సిడి 5 గురికి అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాలరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ శ్యామల, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు గుండెపూడి సతీష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# దళారీ వ్యవస్థతో నష్టపోతున్న రైతులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యర్రాబాబు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో దళారీ వ్యవస్థతో రైతులు భారీగా నష్టపోతున్నారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యర్రా బాబు తెలిపారు. ప్రతి ఏడాది వ్యవసాయ ఉత్పత్తుల ధరలను దళారులు నియంత్రించి రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని ఆయన తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది రైతులకు అంత సానుకూలంగా లేదని పునాస పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా పెసలను కొనుగోలు చేయకపోవడంతో దళారులు క్వింటాకు మూడు నుంచి నాలుగువేలకు మించి కొనుగోలు చేయలేదని వాస్తవానికి క్వింటాకు రూ. 8,648 మద్దతు ధర ఉందని ఆయన తెలిపారు. ఈ ఏడాది మొక్కజొన్న పంటపై రైతాంగం ఎన్నో ఆశలు పెంచుకుందని మిర్చికి వరుసగా వస్తున్న తెగుళ్ల కారణంగా రైతులు ఎక్కువ భాగం మొక్కజొన్న సాగు చేశారని ఆయన తెలిపారు. ఖమ్మంజిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారని మొక్కజొన్న రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారని ఆయన తెలిపారు. మొక్కజొన్నకు ప్రభుత్వం రూ.2400 మద్దతు ధర ప్రకటించిందని కానీ అమలు జరగడం లేదన్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో దళారులు రైతుల వద్ద నుంచి క్వింటా రూ. 1500 చొప్పున కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఐ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలను దళారీ వ్యవస్థే నియంత్రిస్తూ నిర్దేశిస్తుందని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు అమలు జరగడం లేదన్నారు. మిర్చి, మొక్కజొన్న ధర పెరుగుతుందని నిల్వ చేసిన రైతులు గతేడాది బాగా దెబ్బతిన్నారని ఇప్పు డు ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తే రైతులకు ఊరట లభిస్తుందన్నారు. మరో పక్క విత్తన కంపెనీలు రక రకాల పేర్లతో రైతులతో మొక్కజొన్న సాగు చేయించారన్నారు. అయితే రైతులు మొక్కజొన్న విక్రయించినప్పుడు రైతుల ఖాతాల్లో కాకుండా సంస్థకు చెందిన ఏజెంట్ల ఖా తాల్లో జమ చేస్తున్నారని ఆయన తెలిపారు. ఏజెంట్లు రైతులకు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. సంస్థ ప్రతినిధుల ద్వారా సాగు చేసిన పంటను తిరిగి ఆ సంస్థే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఏజెంట్ల వ్యవస్థను ప్రోత్సహించకుండా నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని బాబు కో రారు.

## మహిళలు విద్యావంతులైతే సమాజం బాగుంటుంది

మేయర్ పునుకొల్లు నీరజ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహిళలు విద్యావంతులైతే ఆ కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. పిఆర్‌టియు జిల్లా కార్యాలయంలో శనివారం పిఆర్‌పిఎ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. సమాజంలో మంచి విలువలు కలిగిన వ్యక్తులు తయారు కావడానికి ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. అనంతరం మహిళా విశ్రాంత ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించి మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. మధు, కె. వెంకటనర్సయ్య, జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శేఖర్‌రావు, కొండలరావు, సుమతి, జయమ్మ, కస్తూరి, కనకదుర్గ, సంపూర్ణ, విజయశ్రీ, సీతారామయ్య, లక్ష్మ ణ్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ బాధితులకు అండగా ఉంటాం

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వెలుగుమట్ల భూదాన్ బాధితులకు బిఆర్ఎస్ పార్టీ తరుపున అండగా ఉంటామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ భరోసా కల్పించారు. అంబేద్కర్ భవనంలో ఆశ్రయం పొందుతున్న వెలుగుమట్ల భూదాన్ బాధితులను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల నుంచి బాధితులను వెళ్లగొట్టే ప్రయత్నాలను ప్రభుత్వం చేస్తుందన్నారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగేంత వరకు పునరావాస కేంద్రం నుంచి బయటకు వెళ్లే ప్రసక్తి లేదన్నారు. బాధితులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఇండ్లు కోల్పోయిన జాగాలోనే బాధితులకు వంద గజాల స్థలం, ఐదు లక్షలు ఇచ్చి ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు నిరుపేదల సమస్యలను విస్మరించిందన్నారు. ప్రభుత్వం బాధితులను విడగొట్టేందుకు చేస్తున్న కుట్రలకు బలి కావద్దని బాధితులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మమత సంస్థల డైరెక్టర్ పువ్వాడ నరేన్, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. శనివారం వైరా మండలం విప్పలమడక గ్రామంలో గ్రామ సర్పంచ్ మేడా హెమీని చక్రపాణి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ 99 రోజులపాటు జరిగే ఈ ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని, ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించాలని, పారిశుద్ధ్యం పర్యవేక్షణ చేయాలని, పెండింగ్ సమస్యలను పూర్తి చేయాలని, ప్రతి సమస్య పరిష్కారం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, అధికారులు ఎక్కడ నిర్లక్ష్యం చేయవద్దని, 99 రోజులపాటు అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని అధికారులకు సర్పంచ్‌లకు సూచించారు. తొలుత విప్పలమడక గ్రామంలో అభివృద్ధి పనులతో నిర్మించిన సిసి రోడ్ల నిర్మాణాలను సర్పంచ్ మేడా హేమియా చక్రపాణితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, ఎంపిడిఒ సక్రియ, తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపిఒ రాజేశ్వరి, మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ వరప్రసాద్, వైరా మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంగారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, జవ్వాజి అశ్విని, రామారావు, శెట్టిపల్లి శ్రీనివాసరావు, కృష్ణారావు, పరశురాం, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# మహిళాభ్యుదయంతోనే ప్రగతి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**ప్రజాపక్షం/వైరా :** ప్రతి సంవత్సరం మార్చి8న మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటాం. సమాజంలో మహిళల పాత్ర వెలకట్టలేనిది. వారు లేనిది జీవితానికి ఒక అర్థం లేదనే చెప్పవచ్చును. ఒక కుటుంబం సక్రమంగా అన్ని మర్గాల్లో ముందుకెళ్లి ఉన్నతస్థాయిలో ఉండాలి అంటే దానికి తొలిమెట్టు మహిళల చేయూత వారి అండదండలు అలాంటి మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను పూజిద్దాం వారిని గౌరవిద్దాం. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం పురస్కరించుకొని పలువురు అభిప్రాయాలను తెలుసుకుందాం.

**సంగెపు లక్ష్మీ సాహితి, డిఎస్‌పి ట్రైనింగ్ అప్పా హైదరాబాద్**



నేటి సమాజంలో ఇప్పటికీ మహిళల పట్ల అసమానతలు అణచివేత కొనసాగుతూనే ఉంది. మహిళలు అన్ని రంగాల్లోకి ముందుకు రావాలంటే విద్య ఉద్యోగం వ్యాపారం రాజకీయాల్లో సరైన భాగస్వామ్యం అనేది తప్పనిసరి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇచ్చిన స్ఫూర్తి మనల్ని ముందుకు తీసుకెళుతుంది. తొలి ప్రయత్నంలోనే గ్రూప్ వన్‌లో డీఎస్పీ సాధించడం పట్ల నాలో మరింత పట్టుదల పెరిగింది. ఐఏఎస్ నా ధ్యేయం అని హైదరాబాద్ అప్పాలో డిఎస్‌పి ట్రైనింగ్‌లో ఉన్న వైరాకి చెందిన సంగెపు లక్ష్మీ సాహితి తెలిపారు.

**వుండ్రు వరలక్ష్మి, 20వ వార్డు కౌన్సిలర్ వైరా**



సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె ఒక కుటుంబాన్ని బలపరుస్తుంది. ఒక కుటుంబం బలంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుంది అనే నినాదంతో మనందరం ముందుకు వెళ్లినప్పుడే ఈ సమాజంతో ఆనందంగా ముందుకు వెళుతుంది అని వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి తెలిపారు.

**వేముల శ్రావణి, నాల్గో వార్డు కౌన్సిలర్ వైరా**



నేటి సమాజంలో ఇప్పటికీ మహిళల పట్ల అసమానతలు అణచివేత కొనసాగుతూనే ఉంది. మహిలు అన్ని రంగాల్లోకి ముందుకు రావాలంటే విద్య ఉద్యోగం వ్యాపారం రాజకీయాల్లో సరైన భాగస్వామ్యం అనేది తప్పనిసరి. మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడుతూ పురుషులకు ధీటుగా నిలుచున్నారు అని వేముల శ్రాణి తెలిపారు.

**మాడపాటి సునీత, ఉపాధ్యాయురాలు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కల్లూరు**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న జరుపుకుంటారు. మొదట ఈ దినోత్సవాన్ని మహిళా శ్రామిక దినోత్సవంగా జరుపుకునే వారు నేటి సమాజంలో ఇప్పటికీ మహిళల పట్ల అసమానతలు అణచివేత కొనసాగుతూనే ఉంది. మహిళలు అన్ని రంగాల్లోకి ముందుకు రావాలంటే విద్య ఉద్యోగం వ్యాపారం రాజకీయాల్లో సరైన భాగస్వామ్యం అనేది తప్పనిసరి. సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె ఒక కుటుంబాన్ని బలపరుస్తుంది. ఒక కుటుంబం బలంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుంది అనే నినాదంతో మనందరం ముందుకు వెళ్లినప్పుడే ఈ సమాజంలో ఆనందంగా మనందరం ముందుకు వెళ్లినప్పుడే ఈ సమాజంతో ఆనందంగా ముందుకు వెళుతుంది అని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మాడపాటి సునీత తెలిపారు.

**గోపిశెట్టి సుస్మిత, ఎంపిడివో లక్ష్మీదేవిపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**



మహిళలు ఇప్పుడు సివిల్ సర్వీసెస్‌లో మూడో వంతు ఉన్నారు. ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, టిఆర్ఎస్ లాంటి కీలకమైన ఉద్యోగాల్లో మహిళలు పెద్ద ఎత్తున ఉన్నారని, సివిల్ సర్వీసెస్ కాంపిటేషన్ సంఖ్య ఇంకా బాగా పెరగాలి, తద్వారా నిర్ణయాత్మక విధానాల్లో మహిళల పాత్ర బలోపేతం అవుతుంది. ప్రపంచంలో ప్రతి రంగంలో మహిళలు దూసుకుపోతున్నారని చెప్పవచ్చును. నాసా లాంటి ప్రయోగాల్లో కూడా మహిళలు చేస్తున్న కృషి ఎంతో గొప్పదని, పని జీవిత సమతుల్యత మహిళలు వృత్తిపరమైన బాధ్యతలను కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరని, వారిని కేవలం ఒకే కోణంలో చూడకూడదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి ఎంపిడివో గోపిశెట్టి సుస్మిత పేర్కొన్నారు.

**అన్ని రంగాల్లో పోటీకి సై అంటున్న మహిళలుః నూకల అన్న-పూర్ణ, గృహిణి వైరా**



ప్రస్తుతం ప్రపంచంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడుతున్నారని నూకల అన్నపూర్ణ అన్నారు. మగవాళ్లతో సమానంగా ఆడవాళ్లు కూడా ఆర్థికంగా ఎంతో ముందంజలో ఉంటున్నారు. ఇంటి పనులు చూసుకుంటూ బయట ఉద్యోగం చేసుకుంటూ మహిళలు ఎంతో రాణిస్తున్నారు. గతంలో మన అమ్మమ్మల కాలంలో స్త్రీలు బయటకి వచ్చే వాళ్లు కాదు, కాని ఇప్పుడు అలా కాదు ఆకాశం నుంచి సముద్ర గర్భాల వరకు స్త్రీ ఎన్నో విజయాలను సాధిస్తున్నారు. మహిళల జోలికి వెళ్లకుండా ఎలాంటి అత్యాచారాలు చేయకుండా కఠినంగా శిక్షించాలి.

**స్త్రీ లేనిదే జననం లేదు...స్త్రీ లేనిదే గమనం లేదుః రాయల అన్నపూర్ణ, వైరా**



మహిళ అంటే ఒక శక్తి మహిళ తలుచుకుంటే ఎంతటి కష్టాన్నైనా భరిస్తుంది. ఒక అమ్మా అక్కగా చెల్లిగా అత్తగా కుటుంబాన్ని సరిదిద్దుతుంది. మహిళ తలుచుకుంటే ఎంతటి కష్టాన్నైనా అవలీలగా పరిష్కరిస్తుంది అని రాయల అన్నపూర్ణ అన్నారు. మహిళలను వేధింపులకు గురికాకుండా పూర్తిస్థాయిలో అరికట్టాలి.

**జీవితంలో మహిళ పాత్ర చాలా గొప్పది, రంగా వాసవి, వైరా**



జీవితంలో స్త్రీలు చాలా పాత్రలు పోషిస్తున్నారు. తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలరు. ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోను ఎన్నో రోల్స్ పోషిస్తుంది. మగవారికి సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వంద శాతం వాటికి న్యాయం చేస్తుంది. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశన్నంటాయి. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోంస అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ముందుకాలంతో పోల్చితే రోజురోజుకి మహిళలు ముందుకు సాగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం అని రంగా వాసవి తెలిపారు.

## ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో అందరూ పాల్గొనాలి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా వేగంగా అమలవుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ గోపాలపురం చెరువు సమీపంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధా రాణి అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.అనంతరం స్థానికులతో ఎమ్మెల్యే, మేయర్ ప్రమాణం చేయించి అందరూ బాధ్యతగా తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం ఉంచుకోవాలి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికను రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సానిటరీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకి చెందిన బిక్కినేని అఖిల వెంకట్రావు గార్ల నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని, రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్ర మంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు,మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావత్ శీభా రాణి రాజేందర్, కౌన్సిలర్స్ బెజ్జం పాపరావు, నునావత్ కమిలి కీమా నాయక్, తిరుపెల్లి వాణి కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు కట్కూరి స్వామి, సమ్మెట సుధీర్, అన్వర్, కొండేటి సాంబయ్య, మహిళ నాయకురాలు రజిత రెడ్డి తో పాటు నాయకులు కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 5 క్వింటాళ్ల మిర్చి అపహరణ



**ప్రజాపక్షం/పరకాల:** హన్మకొండ జిల్లా పరకాల మండలం మల్లక్కపేటనాగారం గ్రామాల శివారులో రైతు అరబెట్టిన మిర్చిని గుర్తు తెలియని దొంగలు అపహరించిన ఘటన చోటుచేసుకుంది. మల్లక్కపేట గ్రామానికి చెందిన దొమ్మాటి బాబు అనే రైతు తన మిర్చిని బావి వద్ద అరబెట్టగా, అక్కడి నుంచి సుమారు 5 క్వింటాళ్ల మిర్చిని దొంగలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం.అపహరణకు గురైన మిర్చి విలువ లక్ష రూపాయలకు పైగా ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై బాధితుడు పరకాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఇటీవల మిర్చికి మార్కెట్లో డిమాండ్ పెరగడంతో కొంతమంది ముఠాలు చోరీలకు పాల్పడుతున్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఘటనకు సంబంధించిన సిసి కెమెరా పుటేజునుపోలీసులు పరిశీలిస్తున్నారు.మిర్చి నిల్వలను పొలాల్లో లేదా బావుల వద్ద ఆరబెట్టే రైతులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చుకోవాలని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. చీకటాయపాలెం గ్రామంలో ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రైతు శిక్షణ కేంద్రంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తక్కువ చేసి, భూమి సారాన్ని కాపాడుకోవాలని, అధిక పెస్టిసైడ్స్ వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మల్లాలని తద్వారా సారవంతమైన భూమిని వచ్చే తరాలకు అందించిన వారమవుతామని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను ,యంత్రాలను, డ్రోన్లను రైతులకు 50 శాతం సబ్సిడీతో అందిస్తుందని రైతులు ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి రామ నరసయ్య, ఎ ఇ ఒ లు భరత చంద్ర ,వినయ్ కుమార్ హరిప్రియ ,మానస, రైతులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే వినతి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వినతిని ఆత్మీయంగా ఆలకించిన మంత్రి పొంగులేటి పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తుందని హామీ ఇచ్చారని సమాచారం. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాధనలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధింత అధికారులకు సూచిస్తానని మంత్రి తెలిపారు.

# జనగణనకు సన్నాహాలు షురూ



**ప్రజాపక్షం/హనుమకొండ :**జిల్లాలలో జన గణనకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాద్, మలుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల యంత్రాంగాలు నిమగ్నమయ్యాయి. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, పర్యవేక్షణ అధికారుల నియామకం, సమకూర్చు కోవలసిన సామగ్రి తదితర అంశాలపై దృష్టి సారించాయి. ఇప్పటికే సిబ్బంది నియామకం, గ్రామాలవారీగా మ్యాచ్ లు తదితర వాటిపై కసరత్తులు జరుగుతున్నాయి. ఇది దేశంలో పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరిగే తొలి జనాభా గణన కావడంతో జిల్లా యంత్రాంగాలు సమగ్ర సన్నాహాలు ప్రారంభించాయి. డిజిటల్ గణనలలో మురికివాడలు, మారుమూల ప్రాంతాలన్నీ కవర్ చేస్తారు. ఎటువంటి లోటు పాట్లు ఉండకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. ముఖ్యంగా డబుల్ ఎంట్రీలు ఉండకుండా చూస్తారు.

**రెండు విడతలుగా గణన**

దేశవ్యాప్తంగా జన గణనకు కేంద్ర హోంశాఖ గత సంవత్సరం జూన్ లోనే గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2027 మార్చి 1 నాటికి రెండు దశల్లో జనాభా లెక్కలు సేకరించనున్నారు. తొలి దశలో ఇళ్ల జాబితాను వెలువరించి రెండో దశలో జన గణన చేపడతారు. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు సేకరించాలి. చివరిసారిగా 2011లో జన గణనను నిర్వహించారు. ఆ తర్వాత 2021 లెక్కించాల్సి ఉండగా, 2020లో కోవిడ్ మహమ్మారితో ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా 16వ జన గణనకు రంగం సిద్ధమైంది. జనగణనతో పాటు ఈ సారి కుల గణన, జాతీయ పౌర పట్టిక (నేషనల్ సివిల్ రిజిస్టర్) ఒకేసారి చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**తొలుత గృహాల గుర్తింపు**

ఈ యేడు ఎన్యుమరేటర్లు తొలుత గృహాల గుర్తింపు (హౌస్ లిస్టింగ్) ప్రక్రియ చేపడతారు. అనంతరం రెవెన్యూ, మునిసిపల్, గ్రామ పంచాయతీ, ప్రణాళిక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో సరిపోల్చుతారు. కలెక్టర్ నేతృత్వంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డీఆర్వో, సీపీవో సహా రాష్ట్ర ప్రభుత్వం నియమించే మరో అధికారితో జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్ జన గణన అదికారిగా వ్యవహరిస్తే, ఏఎస్వీ (అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్). సహాయకుడిగా పని చేస్తారు. గణకులు (ఎన్యుమరేటర్లు)గా ప్రభుత్వఇంటింటికీ వెళ్లి జన గణన నిర్వహిస్తారు.ఫిబ్రవరి 28 తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు జన్మించిన వారి వివరాలను నమోదు చేస్తారు. మార్చి 1కి జనగణన ప్రక్రియ ముగుస్తుంది. గణకులుగా నియమితులయ్యే ఉపాధ్యాయులకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సారి మొబైల్ యాప్ లో జనాభా వివరాలు నమోదు చేస్తారు. ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటికి రెండు దఫాలుగా వెళతారు. మొదటిసారి ఇళ్లను లెక్కించడంతో పాటు కుటుంబ స్థితిగతులు, ఆస్తులు, ఆదాయం, వసతులు వంటి అంశాలను సేకరిస్తారు.

> రెండు విడతలుగా జనగణన ప్రక్రియ
> ఈ ఏడు గృహాలు, వచ్చే ఏడు జనాభా గణన* జిల్లా,మండల స్థాయిలో కమిటీలు* ఎన్యూమరేటర్ల నియామకానికి కసరత్తు

రెండో దశలో జనాభా వివరాలు సేకరించేందుకు ఇంటింటికీ వెళతారు. కుల, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమాచారం సేకరిస్తారు.

**భవిష్యత్తు ప్రయోజనాలపై దృష్టి**

పట్టణీకరణకు (అవుట్ గ్రోత్) అనువైన ప్రాంతాలు గుర్తించాలని ఇటీవల జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పట్టణాలకు సమీపంలో ఉంటూ భవిష్యత్తులో విస్తరణకు నోచుకునేవి, మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు సహా మేజర్ గ్రామ పంచాయతీల సమీపంలో విస్తరించేందుకు అనువైన ప్రాంతాలు, రైల్వే కాలనీలు, విశ్వవిద్యాలయ ప్రాంగణాలు, ఓడరేవు ప్రాంతాలు, సైనిక శిబిరాలు, భౌగోళిక విస్తీర్ణం తదితరాలను ఈ జన గణన సందర్భంగా గుర్తిస్తారు. జనాభా లెక్కల ప్రయోజనం కోసం అలాంటి ప్రాంతాలను పట్టణ వ్యాప్తిలో భాగంగా పరిగణిస్తారు. ఈ వివరాల సేకరణకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లకు లేఖలు కలెక్టర్లు లేఖలు రాశారు.

**అధికారులకు బాధ్యతలు**

కలెక్టర్ నేతృత్వంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డిఆర్ఓ, సిపిఓ సహా రాష్ట్ర ప్రభుత్వం నియమించే మరో అధికారితో జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. మండలస్థాయిలో తహసీల్దార్ జన గణన అధికారిగా వ్యవహరిస్తే, ఎఎస్వి(అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్). సహాయకుడిగా పని చేస్తారు. గణకులు (ఎన్యుమరేటర్లు)గా ప్రభుత్వ ఉపాధ్యాయులు విదులు నిర్వహిస్తారు. ఐదారుగురు గణకులకు ఒక సూపర్వైజర్ ఉంటారు. వీరికి జిల్లా పరిధిలోనే వివిధ స్థాయిల్లో బాధ్యత ఇస్తారు. ఉన్నత స్థాయి. కమిటీలకు హైదరాబాద్ లో శిక్షణ ఉంటుంది. శిక్షణ పూర్తయ్యాక ప్రభుత్వం ఇచ్చే ప్రశ్నావళి ఆధారంగా జన గణన చేపడతారు.

## మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్:** మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అన్నారు. వరంగల్‌లోని సాయి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలు, ముస్లిం మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ , వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద , జి డబ్ల్యూ ఎం సి నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఒక మహిళగా తనకు ప్రజాప్రతినిధిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవ చేసే అవకాశం రావడం మహిళల ఎదుగుదలకు నిదర్శనమని అన్నారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. మహిళలను మహాలక్ష్మి గా గౌరవించడం మన సంస్కృతిలో భాగమన్నారు. ఇప్పటివరకు కోట్లాది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు సోదరుడిలా అండగా నిలుస్తూ ప్రజాపాలన అందిస్తున్నారని, హిళలు ఏ వ్యాపారం ప్రారంభించినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తి సమాన పనికి సమాన వేతనం అనే నినాదమని, లింగ వివక్షత లేకుండా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రానున్న రోజుల్లో మహిళల అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

## అన్నిరంగాలలో మహిళలు రాణించాలి: షీటీమ్ ఎస్ఐ స్వాతి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని నర్సంపేట షీ టీం ఎస్ఐ స్వాతి అన్నారు. నర్సంపేట పట్టణంలోని బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ ముహూర్తాల రామ్‌రాజ్ అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సంపేట షీ టీం ఎస్ఐ స్వాతి హాజరై ప్రసంగించారు. విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. నేడు మహిళలు కూడా అన్ని రంగాలలో రాణించి దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినిలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువుతోపాటు క్రీడా సాంస్కృతిక రంగాలలో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, అధ్యాపకులు రవీందర్, ప్రవీణ్, సురేష్, భిక్షపతి, మధు, రాజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


## వ్యవసాయ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్

**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** భారతదేశ వ్యవసాయక దేశమని, వ్యవసాయ రంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగిత కొనసాగుచున్నది కనుక వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించి దేశ రైతాంగాన్ని రక్షించాలని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ కేంద్ర పాలకవర్గాలను డిమాండ్ చేయడం జరిగింది. శనివారం రోజున ధర్మసాగర్ మండలం శాయిపేటలో శాఖ కార్యదర్శి కనుకటి రాజయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడుతూ రైతు పండించిన పంటలకు మద్దతు ధర గిట్టుబాటు ధర రాక అప్పుల పాలై దేశానికి అన్నం పెట్టే రైతన్న అన్నమో రామచంద్రా అంటూ అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి అప్పులు మాఫీ చేసి పసల్ బీమా రైతు బీమా కిసాన్ సన్మానం అందించాలని డిమాండ్ చేసినారు. వ్యవసాయ మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర గ్యారెంటీ హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతాంగానికి అనుబంధంగా ఉండాలని వారు తెలిపారు. కొట్టే వెంకటేష్ ధర్మసాగర్ మండల సిపిఐ కార్యదర్శి మాట్లాడుతూ ధర్మసాగర్ మండల కేంద్రంలో రాంపూర్ లో పెండ్యాల లో సెంటు గుంటలేని దళిత బహుజనులు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని వారికి వెంటనే గుడిసె పట్టా అందజేసి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. కుడికందుల రాజు, ఏసు పరమేశ్వర్ పాల్గొన్నారు.

## కస్తూర్బాలో ఉన్నత విద్య భవిష్యత్తుకు పునాది

### పాఠం బోధించి విద్యార్థులకు భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:**ఉన్నతమైన విద్య భవిష్యత్తుకు పునాది, అందుకే విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాన్ని ఎంచుకొని అందుకు అనుగుణంగా ఉన్నతులుగా ఎదగాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విద్యార్థులకు సూచించారు. శనివారం జనగామ మండలం చౌడారంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, విద్యార్థుల వసతి, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత వంటి అంశాలను పర్యవేక్షించారు. ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యం మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ఉపాధ్యాయులు ప్రయత్నం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. ఎస్ఓ రాణితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లను పర్యవేక్షించిన కలెక్టర్**

జనగామ మండలంలోని చౌడారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం పరిశీలించారు. గ్రామంలోని లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి మాతృనాయక్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**స్వయం సహాయక సంఘాలకు ఎరువుల విక్రయ కేంద్రాలు**

జిల్లా రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో సులభంగా అందుబాటులో ఉండే విధంగా ప్రతి క్లస్టర్‌లో స్వయం సహాయక సంఘాల ద్వారా ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఫర్టిలైజర్ షాపుల నిర్వాహణపై సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే సాగు సీజన్ దృష్టిలో ఉంచుకొని రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఇన్‌పుట్‌లు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 62 క్లస్టర్లు ఉన్నాయని, ప్రతి క్లస్టర్‌లో ఒక ఎరువుల విక్రయ కేంద్రంను స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేయాలన్నారు. దీని వలన గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. సంబంధిత అధికారులు డిఆర్‌డిఓతో సమన్వయం చేసుకొని అవసరమైన అర్హతలు, లైసెన్స్‌లు, శిక్షణ, ఇతర ఏర్పాట్లను త్వరిత గతిన పూర్తి చేసి ప్రతి క్లస్టర్‌లో ఎరువుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికాసోనితో పాటు డిఎ, వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్లు, కమ్యూనిస్టు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

**పక్కా యాక్షన్ ప్లాన్‌తో ముందుకు**

ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో పక్కా యాక్షన్ ప్లాన్‌తో ముందుకు పోవాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ని క్షేత్ర స్థాయిలో నిర్వహించే విధానంపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఘా సమావేశం నిర్వయించి దిశా, నిర్దేశం చేశారు.

## గ్రామ పరిపాలనపై అవగాహన తప్పనిసరి

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** గ్రామ పరిపాలన పై నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు వార్డు సభ్యులకు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.శనివారం వెంకటాపూర్ మండల కేంద్రంలో మంత్రి సీతక్క నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అనంతరం మండల కేంద్రానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వెంకటాపూర్ మండలం లక్ష్మి దేవి పేట గ్రామము లో ఉపాధి హామీ పథకం 10 లక్షల రూపాయల నిధులతో మహిళ సమాఖ్య భవన నిర్మాణ పనులకు, ఎల్లారెడ్డి పల్లె గ్రామంలో గ్రామ పంచాయతీరాజ్ శాఖ ద్వారా సుమారు 17 లక్షల 50 వేల రూపాయల నిధులతో అంతర్గత సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణాలను 20 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన పూసల యాదమ్మ కుమారస్వామి గారి ఇందిరమ్మ ఇంటి కి గృహప్రవేశం చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామ పరిపాలనపై ప్రజాప్రతినిధులకు నూతనంగా ఎన్నికైన వార్డ్ సభ్యులకు పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. గ్రామపంచాయతీ సమావేశాలలో తరచూ పాల్గొంటూ తమ వార్డు సమస్యలపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి బాటలు వేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడానికి అధికారులకు ప్రజలకు మధ్య ఒక వారధిలా ప్రజాప్రతినిధులు పనిచేస్తూ ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ రవీందర్ రెడ్డి, డిఆర్‌డిఓ శ్రీనివాస్, పిఆర్ ఈఈ అజయ్ కుమార్, డిఈ లింగారెడ్డి, యంపిడిఓ, యంపిఓ, సర్పంచ్ లు బొమ్మ కంటి వంశవతి రమేష్ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనుల ప్రారంభం**

ములుగు మండలం దేవగిరిపట్నం అదేవిధంగా కన్నాయిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం రూ.10లక్షల నిధులతో మహిళ సమాఖ్య భవన నిర్మాణ పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రామ సర్పంచ్ ఇస్లావత్ పులమ్మ, సంతోష్, డిఆర్‌డిఓ శ్రీనివాస్, పిఈర్ ఈఈ అజయ్ కుమార్, డిఈ లింగారెడ్డి, ఎంపిడిఓ, ఎంపిఓ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో పాల్గొన్న మంత్రి**

ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క



మాట్లాడుతూ ములుగు జిల్లాలో మొదటి సారిగా ఏర్పడ్డ ములుగు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేశామని ములుగు మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఇప్పటికే రూ.15 కోట్ల రూపాయలతో టెండర్లు జరిగాయని 5వ వార్డులో కూడా ఇప్పటికే అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని రానున్న రోజుల్లో వార్డులో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా, 5వ వార్డు కౌన్సిరల గుగ్గిళ్ల దివ్య సుజన్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# బుమ్రానే 'బెస్ట్'

**అహ్మదాబాద్:** టీ20 ప్రపంచ కప్ 2026 సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై భారత్ విజయం సాధించడంలో జస్‌ప్రీత్ బుమ్రా కీలక పాత్ర పోషించాడు. కఠిన పరిస్థితుల్లోనూ అత్యుత్తమ బౌలింగ్‌తో ఇంగ్లాండ్ బ్యాటర్లను కట్టడి చేశాడు. దీంతో పేస్ దిగ్గజాలు మాల్కమ్ మార్షల్, ఆంబ్రోస్, మెక్‌గ్రాత్ కంటే బుమ్రానే బెస్ట్ అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఇంగ్లాండ్ మాజీ పేసర్లు స్టువర్ట్ బ్రాడ్, స్టీవెన్ ఫిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'చరిత్రలో ఎంతో మంది గొప్ప బౌలర్లు, మంచి బౌలర్లు ఉన్నారు. ఇప్పుడు జస్‌ప్రీత్ బుమ్రా మాత్రం వారందరి కంటే చాలా ఎత్తులో ఉన్నాడు. ఇప్పటి బౌలర్లు పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్ కన్నా బుమ్రానే అత్యుత్తమం. ప్రస్తుత తరం బౌలర్లలో ఎవరితోనైనా పోల్చాలంటే అసాధ్యమే' అని ఫిన్ తెలిపాడు. మాల్కమ్ మార్షల్, రిచర్డ్ హ్యాడ్లీ, ఆంబ్రోస్‌ను మించి బుమ్రానే ఉత్తమ బౌలర్ అని ఫిన్ ప్రశంసించాడు. 'నువ్వు (ఫిన్) చెప్పినవారంతా దిగ్గజ పేసర్లు. అయితే, మాల్కమ్ మార్షల్ లేదా ఇతర మాజీని ఎప్పుడూ ఇలాంటి టీ20 ప్రపంచ కప్ సెమీస్‌లో బౌలింగ్ వేయడం మేం చూడలేదు. బ్యాట్‌దే ఆధిపత్యం ఉన్న సమయంలోనూ జస్‌ప్రీత్ బుమ్రా నుంచి అద్భుతమైన స్పెల్ వచ్చింది. అందుకే, నేను ఇప్పటి వరకు లైవ్‌లో చూసిన స్పెల్స్‌లో ఇదే బెస్ట్ అని చెబుతా' అని స్టువర్ట్ బ్రాడ్ వ్యాఖ్యానించాడు. ఇంగ్లాండ్‌పై నాలుగు ఓవర్లు వేసిన బుమ్రా 33 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. ఇన్నింగ్స్‌లో 16వ ఓవర్ వేసి 8 పరుగులు ఇవ్వగా... అత్యంత క్లిష్ట సమయంలో సంధించిన 18వ ఓవర్‌లో కేవలం ఆరే పరుగులు ఇచ్చాడు.

# తుదిపోరు నేడే

## అహ్మదాబాద్‌లో భారత్, కివీస్ మ్యాచ్

**అహ్మదాబాద్:** టీ20 ప్రపంచకప్ 2026 తుదిపోరుకు రంగం సిద్ధమైంది టైటిల్ కోసం భారత్, న్యూజీలాండ్ తహతహలాడుతున్నాయి. మూడోసారి టైటిల్ సొంతం చేసుకోవాలని భారత్ ఆరాటపడుతోంది. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య తుదిపోరు జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీమిండియా తడబడుతూనే ఫైనల్‌కు చేరుకుంది. అభిషేక్ శర్మ ఫామ్ లేమి, వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో తేలిపోతుండటం, శివమ్ దూబె బంతితో ధారాళంగా పరుగులివ్వడం వంటి సమస్యలు మన జట్టును వేధిస్తున్నాయి. సెమీస్‌లో భారీ స్కోర్ చేసినా... ఇంగ్లాండ్‌పై టీమిండియా కేవలం 7 పరుగుల తేడాతో మాత్రమే గెలిచింది. ఇది భారత శిబిరాన్ని కలవరపాటుకు గురి చేస్తోంది. మరోవైపు సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై భారీ విజయంతో న్యూజిలాండ్ రెట్టించిన ఉత్సాహంతో ఫైనల్‌లో అడుగుపెట్టింది. టీ20ల్లో టీమిండియాదే పైచేయి భారత్, కివీస్ ఇప్పటి వరకు 30 టీ20ల్లో ముఖాముఖి తలపడ్డాయి. ఇందులో భారత్ 18 మ్యాచ్‌లు గెలిస్తే... న్యూజిలాండ్ 11 మ్యాచుల్లో విజయం సాధించింది. ఒక మ్యాచ్ టైగా ముగిసింది. స్వదేశంలో టీమిండియా 11 మ్యాచుల్లో గెలిస్తే... కివీస్ 4 టీ20ల్లో విజయం సాధించింది. న్యూజిలాండ్ గడ్డపై భారత్ 7, భారత గడ్డపై న్యూజిలాండ్ 5 మ్యాచుల్లో సత్తా చాటింది. తటస్థ వేదికల్లో కివీస్ 2 మ్యాచ్‌లు గెలిచింది. ఇక ఈ టోర్నీలో రెండు జట్లు ప్రదర్శనను పరిశీలిస్తే... టీ20 వరల్డ్ కప్‌లో ఇప్పటి వరకు ఈ జట్లు మూడు సార్లు తలపడ్డాయి. ఆ మూడు సందర్భాల్లోనూ విజయం కివీస్‌దే. న్యూజిలాండ్‌పై



భారత్ ఒక మ్యాచ్‌లో అత్యధికంగా 180, అత్యల్పంగా 79 పరుగులు చేసింది. టీమిండియాపై న్యూజిలాండ్ అత్యధికంగా 190, అత్యల్పంగా 111 రన్స్ చేసింది. టీ20 ప్రపంచకప్‌లో కివీస్ జట్టు... టీమిండియాపై ఇప్పటి వరకు స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించింది. అయితే ఈసారి ఫైనల్‌లో భారత్ గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. భారత్ వరుసగా రెండు సార్లు టైటిల్ నెగ్గి రికార్డు సష్టించాలని ఆకాంక్షిస్తున్నారు.

## వరుణ్ బౌలింగ్ తీరు మారాల్సిందే: అశ్విన్

టీ20 ప్రపంచ కప్‌లో భారత్ ఆడిన గత రెండు మ్యాచుల్లో 'మిస్టరీ' స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తేలిపోయాడు. అతడి బౌలింగ్‌లో ప్రత్యర్థి బ్యాటర్లు దూకుడుగా ఆడి భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. దీనిపై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వరుణ్ బౌలింగ్ విషయంలో ఇప్పటికే చాలాసార్లు ఓ మాట చెప్పానని తెలిపాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో 'యాష్ కి బాత్' చర్చా కార్యక్రమంలో అశ్విన్ మరోసారి పలు సూచనలు చేశాడు. 'వరుణ్ విషయంలో ఏం జరుగుతుందనేది ఇప్పుడు పెద్ద చర్చ. ప్రత్యర్థి బ్యాటర్లు అతడిని లక్ష్యంగా చేసుకొని ఎటాకింగ్ చేస్తున్నారా? లేదా వారికి ఛాన్స్ ఇస్తున్నాడా? ఇంగ్లాండ్ బౌలర్ అదిల్ రషీద్ కూడా గూగ్లీలు వేస్తాడు. రషీద్‌ను మన బ్యాటర్లు బాగానే ఎదుర్కొన్నారు. కానీ, అతడు మరీ ఎక్కువ పరుగులు ఇవ్వలేదు. కానీ, వరుణ్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అలాంటప్పుడు వ్యూహాలు మార్చుకోవాలి. లైన్ అండ్ లెంగ్త్‌తోపాటు స్పీడ్ వేరియేషన్స్ చూపించాలి. ఇలాంటప్పుడే వరుణ్‌తో మేనేజ్‌మెంట్ మాట్లాడాలి. బ్యాటర్లు ఎటాకింగ్ చేయగానే అతడిలో విశ్వాసం సన్నగిల్లుతోంది.





# గందరగోళంలోనే మార్కెట్లు

గత వారం మాదిరిగానే ఈవారం కూడా మార్కెట్లు తీవ్ర గందరగోళ పరిస్థితుల్లో చిక్కుకున్నాయి. ఫలితంగా వాణిజ్య కార్యకలాపాలు తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగాయి. పెట్టుబడిదారులు మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. సరఫరా అంతరాయం సంభవించే అవకాశాలపై ఆందోళనల కారణంగా చమురు ఫ్యూచర్స్ మళ్లీ వేగంగా పెరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్త రవాణా సంస్థ మయెర్క్ మధ్యప్రాచ్యంలో రెండు సముద్ర రవాణా మార్గాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించడం ఆందోళనకు గురి చేస్తున్నది. ఫార్ ఈస్ట్ నుంచి మధ్యప్రాచ్యానికి సరుకులు తరలించే ఎఫ్ఎం1 సేవ మార్గం, అలాగే మధ్య ప్రాచ్యం నుంచి యూరప్‌కు సరుకులు పంపే ఎంఇ11 మార్గంలో రవాణాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని సంస్థ వెల్లడించింది. సిబ్బంది, నౌకల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ఇదిలా ఉండగా చిప్ తయారీ సంస్థ మార్వెల్ టెక్నాలజీ త్రైమాసిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించి రావడంతో ఆ సంస్థ షేర్లు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇవాళ తెలుసుకోవలసిన ముఖ్య విషయాలు ఇవి.

డిజిటల్ కరెన్సీ బిట్‌కాయిన్ వరుసగా రెండో రోజు కూడా విలువ కోల్పోయి 70,000 డాలర్లకు దిగువన ట్రేడింగ్ అవుతున్నది. ఈ వారం ప్రారంభంలో అది 74,000 డాలర్ల గరిష్ఠాన్ని తాకింది. భద్రతా పెట్టుబడిగా పరిగణించే బంగారం ఫ్యూచర్స్ ఒక ఔన్స్‌కు సుమారు 5,100 డాలర్ల వద్ద పెద్ద మార్పు లేకుండా ఉన్నాయి. వినియోగదారుల రుణాలపై వడ్డీ రేట్లను ప్రభావితం చేసే 10 సంవత్సరాల అమెరికా ట్రెజరీ నోట్ దిగుబడి 4.17 శాతానికి చేరింది. ఇది నిన్నటి 4.15 శాతం కంటే ఎక్కువ, అలాగే గత వారాంతంలో ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ముందు ఉన్న 3.96 శాతంతో పోలిస్తే కూడా ఎక్కువ. మధ్యప్రాచ్యంలో విస్తరిస్తున్న యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరా వ్యవస్థ దెబ్బతింటుందనే భయం సర్వత్రా నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులను చేపడుతున్న నేపథ్యంలో, చమురు, సహజవాయు సరఫరా నిలిచిపోవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వారం చమురు ధరలు ఇప్పటికే 25 శాతం కంటే ఎక్కువ పెరిగాయి. ప్రపంచ చమురు రవాణాలో సుమారు ఐదవ వంతు జరిగే హొర్ముజ్ జలసంధి మార్గంలో నౌకా రవాణా దాదాపు పూర్తిగా నిలిచిపోయిందని సముద్ర సమాచార కేంద్రాలు పేర్కొన్నాయి.



### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 78,918.90 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 81,287.19 పాయింట్లు. నష్టం 2,368.29 పాయింట్లు).

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 24,450.45 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,178.65 పాయింట్లు. నష్టం 728.20 పాయింట్లు).

### బులియన్ మార్కెట్

దేశ వ్యాప్తంగా శనివారం నాటికి బంగారం ధరలను పరిశీలిస్తే, స్వల్ప పెరుగుదల కనిపిస్తున్నది. ప్రస్తుతం 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,63,640, 22 క్యారెట్లు రూ. 1,50,000, రూ.18 క్యారెట్లు 1,27,730గా ఉంది.

## ఓడరేవులకు మార్గదర్శకాలు




పశ్చిమ ఆసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా సముద్ర రవాణా, వాణిజ్యంపై ప్రభావం పడే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని దేశంలోని అన్ని పోర్టులకు ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ కొన్ని మార్గదర్శకాలు జారీ చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. పోర్టులు తీసుకోవాల్సిన చర్యలపై ఒక ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఒపి) కూడా విడుదల చేసింది. మంత్రిత్వ శాఖ సూచనల ప్రకారం, ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితుల వల్ల వ్యాపారులకు, ఎగుమతిదారులకు లేదా షిప్పింగ్ కంపెనీలకు వచ్చే సమస్యలను తగ్గించడానికి పోర్టులు కొన్ని రాయితీలను పరిగణనలోకి తీసుకోవచ్చు. ముఖ్యంగా పోర్టు చార్జీలు, నిల్వ (స్టోరేజ్) అద్దె, నౌకలపై విధించే ఛార్జీలు వంటి వాటిని తగ్గించడం, మాఫీ చేయడం లేదా కొంతవరకు రిమిషన్ ఇవ్వడం వంటి అభ్యర్థనలను పోర్టులు పరిస్థితులను బట్టి పరిశీలించవచ్చని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఎస్ఒపి ప్రకారం ప్రతి పోర్టులో ఒక నోడల్ అధికారిని నియమించాలి. ఈ అధికారి సాధారణంగా విభాగాధిపతి లేదా ఉపవిభాగాధిపతి స్థాయిలో ఉంటారు. పోర్టులో ఏర్పడే సమస్యలను పరిష్కరించేందుకు ఈ నోడల్ అధికారి ఒకే సంప్రదింపు కేంద్రంగా పని చేస్తారు. సమస్య వచ్చిన వెంటనే ఆయన సంబంధిత అధికారులతో చర్చించి 24 నుంచి 72 గంటల లోపు చర్యలు తీసుకునేలా చూసుకోవాలి. ఇక పోర్టు చైర్‌పర్సన్లు తరచుగా వివిధ భాగస్వాములతో సమావేశాలు నిర్వహించాలని కూడా సూచించారు. ఇందులో షిప్పింగ్ లైన్లు, ఎగుమతిదారులు, టెర్మినల్ ఆపరేటర్లు, కస్టమ్స్ అధికారులు వంటి వారు ఉంటారు. పశ్చిమ ఆసియా ప్రాంతానికి వెళ్లాల్సిన సరుకులు తాత్కాలికంగా నిలిచిపోయే అవకాశం ఉన్నందున, అటువంటి సరుకులను ట్రాన్స్‌షిప్‌మెంట్ కార్గోగా నిల్వ చేసేందుకు పోర్టులు అనుమతించవచ్చు. అవసరమైతే అదనపు నిల్వ స్థలాన్ని కూడా కేటాయించవచ్చని పేర్కొన్నారు. అలాగే మధ్యప్రాచ్యానికి వెళ్లే సరుకులను దింపడానికి లేదా తీసుకెళ్లడానికి వచ్చే అదనపు నౌకలకు పోర్టులో తాత్కాలికంగా నిలిపే 'బెర్తింగ్' సౌకర్యాన్ని కల్పించవచ్చు. ఇక నౌకలకు అవసరమైన ఇంధనం (బంకెరింగ్) సరఫరా చేయడానికి కూడా పోర్టులు సాధ్యమైనంతవరకు అదనపు సామర్థ్యాన్ని కల్పించాలని సూచించారు. మొత్తంగా ఈ చర్యల ఉద్దేశ్యం పశ్చిమ ఆసియా సంక్షోభం వల్ల భారతదేశ సముద్ర వాణిజ్యంపై వచ్చే ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడం, ఎగుమతిదిగుమతి కార్యకలాపాలు అంతరాయం లేకుండా కొనసాగడంగా కనిపిస్తున్నది.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

# గీత కార్మికులకు రావాల్సిన రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి

- సూర్యాపేట జిల్లాకు బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలి
- తెలంగాణ గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గీత కార్మికులకు రావాల్సిన రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని, సూర్యాపేట జిల్లాకు స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధపోరాట యోధులు బొమ్మగాని ధర్మభిక్షం పేరును పెట్టాలని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత పనివారల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం శనివారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మగ్దూంభవన్‌లో జరిగింది. 'ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమం పూర్తయ్యేలోగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల బకాయిలను చెల్లించాలి. 560 జిఒ ప్రకారం వన పెంపకానికి భూములు కేటాయించాలి. కార్మికులకు భద్రత కిట్లు అందించాలి. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోనట్లయితే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి గీత పనివారల సంఘం సంసిద్ధమవుతుంది' అని సమావేశం తీర్మానించింది. సమావేశంలో బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలపై ఇప్పటికే సిఎం రేవంత్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బిసి సంక్షేమ శాఖ



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాల కలెక్టర్లకు విజ్ఞాపనపత్రాలు అందించడంతో పాటు రాష్ట్ర సదస్సును నిర్వహించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, కానీ నేటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడం అన్యాయమన్నారు. గీత వృత్తి అనేది తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రాచీనమైన, పేద బడుగువర్గాలు, బిసిలు ఆధారపడిన వృత్తి అని, ఈ వృత్తిలో లక్షలాది మంది కుటుంబాలు నిమగ్నమై జీవనోపాధి పొందుతున్నాయని వివరించారు. అప్పటి నిజాం సంస్థానం నుంచి ఇప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి గీత కార్మిక వృత్తి ఒక ప్రధానమైన వనరుగా నిలుస్తోందన్నారు. కానీ, ప్రభుత్వం గీత వృత్తి కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తూ తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం నేతృత్వంలో 1957లో ఏర్పడిన గీత పనివారల సంఘం చేసిన అనేక పోరాటల ఫలితంగా గీత వృత్తిలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ పథకంతో పాటు వన పెంపకం తదితర సదుపాయాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. బొమ్మగాని ధర్మభిక్షం పేరును సూర్యాపేట జిల్లా కు పెట్టాలని కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని, దానిని మార్చి 26న జరగనున్న ఆయన 15వ వర్ధంతి సందర్భంగా ధర్మభిక్షం పేరు పెట్టడంతో పాటు ఆయన జయంతి, వర్ధంతిలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గీత పనివారల సంఘం ఉపాధ్యక్షులు కెవిఎల్, పబ్బు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలు గౌడ్, సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్, నాయకులు దూసరి శ్రీరాములు, బూడిగ సైదులు, యాదయ్య, నాగార్జున, సుధాకర్, శ్రీశైలం, టి.రాములు గౌడ్, డిజి.నరేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైంది

## భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఉస్తెల సృజన

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని రోజురోజుకు మహిళలపై దాడులు జరుగుతున్నాయని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవనంలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరై జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు పరచడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని వాపోయారు. షీ టీం బృందాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో ప్రధాన కూడళ్లల్లో మహిళలను, బాలికలను వేధిస్తున్న ఆకతాయిలను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో జరుగు మహిళా దినోత్సవ కార్యక్రమానికి జిల్లా నుండి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉప్పునూతల కోటమ్మ, అంజమ్మ, నియోజక వర్గ అధ్యక్షకార్యదర్శులు దేశగాని హేమలత, పొదిల వెంకటమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను రద్దు చేయాలి

## ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో రాబోయే కాలంలో భారీ త్యాగాలతో కూడిన పోరాటాలు తప్పవని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎస్.విలాస్ హెచ్చరించారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో పి.పద్మకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల జరిగిన దేశవ్యాప్త సమ్మెలో సుమారు 40 కోట్ల మంది కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారని ఆయన గుర్త చేశారు. నిర్మల్ జిల్లాలో ఆటో, ఉపాధి హామీ, బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో ఎఐటియుసిలో చేరుతుండటం శుభపరిణామమని,రాబోయే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచార్చ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె.శ్రీనివాస చారి మాట్లాడుతూ, ఫిబ్రవరి 12న నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె నిర్మల్ జిల్లాలో అత్యంత విజయవంతమైందని పేర్కొన్నారు.ఏప్రిల్ 12వ తేదీన నిర్మల్ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ





మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులతో పాటు రాష్ట్రస్థాయి నాయకులు కూడా హాజరవుతారని తెలిపారు. అన్ని రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కామ్రేడ్ ఎస్.ఎన్.రెడ్డి, భూక్యా రమేష్, రమాదేవి, పుండాలిక్, పద్మావతి,వనమాల, కోట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు.

# మిత్ర ధర్మం పాటించని కాంగ్రెస్

## సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

**ప్రజాపక్షం /జనగామ :** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మిత్ర ద్రోహం చేసి సిపిఐని ఓడించిందని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌తో పొత్తుల్లో భాగంగా 11వ వార్డు నుండి సిపిఐ అభ్యర్థిగా ఆకుల సరస్వతి పోటీ చేయగా నామినేషన్ వేసినప్పటి నుండి చివరి వరకు కాంగ్రెస్‌లోని ఒక వర్గం మిత్ర ద్రోహానికి పాల్పడి బిఆర్ఎస్‌కు ఓట్లు వేసి ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించిందన్నారు. ఇది సరియైన పద్ధతి కాదని హెచ్చరించారు. శనివారం జనగామలోని సిపిఐ కార్యాలయం గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో సొప్పరి సోమయ్య అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం కలిసి మిత్రపక్షంగా పోటీ చేయగా 11వ వార్డులో మాత్రం కాంగ్రెస్ నాయకులు సిపిఐకి మద్దతు ఇవ్వలేదని, రెబల్‌గా బరిలో ఉన్న వారిని విత్‌డ్రా చేయించలేదన్నారు. సిపిఐకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న విషయాన్న ఆ పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పిలిచి మాట్లాడలేదని, సిపిఐ అభ్యర్థి చేత అధికంగా డబ్బులు ఖర్చు చేయించి గెలుపు సాధించే దిశలో ఉండగా మూకుమ్మడిగా బిఆర్ఎస్‌కు ఓట్లు వేయించారన్నారు. అందకు కావాల్సిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, జనగామ మున్సిపల్ చైర్మన్ పదవి దక్కడం కంటే సిపిఐ పార్టీని ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణునులు పనిచేశాయన్నారు. తమ అభ్యర్థి గెలవకుండా పనిచేసిన వారందరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకొని వారి నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ విధానం పట్ల కమ్యూనిస్టు పార్టీగా తాము కూడా ఆలోచించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సిపిఐ శ్రేణులు జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పట్ల ఆందోళనలు తీవ్రతరం చేస్తూ పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మార్చి 9,10,11 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాల్లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అనుసరించిన తీరును రాష్ట్ర నాయకత్వానికి నివేధిక రూపంలో అందజేస్తామని రాజారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, జిల్లా నాయకులు కావటి యాదగిరి, జువారి రమేష్, పాతూరి ప్రశాంత్, మోటే శ్రీశైలం, చామకూర యాకూబ్, పిట్టల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అందరి భాగస్వామ్యంతో..

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**కలెక్టర్ ఇలా త్రిపాఠి, '2 కె రన్'లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే, మేయర్**



**ప్రజాపక్షం/నిజామాబాద్:** అందరి భాగస్వామ్యంతో జిల్లాలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నగరంలో 2 కె రన్ నిర్వహించారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు నుంచి చేపట్టిన ఈ పరుగును కలెక్టర్ ఇలా త్రిపాఠి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, నగర మేయర్ ఉమారాణి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. కంఠేశ్వర్ బైపాస్ నుండి ప్రధాన మార్గాల మీదుగా పాత ఆర్డీఓ కార్యాలయం వరకు 2కె రన్ కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో సరికొత్త ఆలోచనలతో సృజనాత్మకతను చాటేలా కార్యక్రమాలు అమలు చేయాలని అధికారులకు సూచించారు. అంకితభావం, చిత్తశుద్ధితో ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో పాల్గొనే అధికారులు, సిబ్బందిని గుర్తించి ఉత్తమ అవార్డులు అందజేస్తామని కలెక్టర్ వెల్లడించారు. వివిధ వర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున మేలు చేకూరేలా సమర్థవంతంగా కార్యక్రమాలు అమలు చేయాలని, అందరినీభాగస్వాములు చేయాలని సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్ది నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్‌కు మంచి పేరు తేవాలన్నారు. వైద్య శాఖతో సమన్వయం చేసుకుని మహిళలందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ నిరోధం కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్మికులకు ప్రయోజనం చేకూరేలా, వారి న్యాయమైన కోరికలు పరిష్కారమయ్యేలా తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా మాట్లాడుతూ ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఆయా శాఖల వారిగా విస్తృత స్థాయిలో అమలు చేస్తూ నగరాభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సదుపాయాలు మెరుగుపర్చేందుకు ప్రగతి ప్రణాళిక ఎంతో చక్కటి కార్యక్రమమని, అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలందించి చక్కటి పేరు పొందాలని సూచించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, డిప్యూటీ కమీషనర్ రవిబాబు, తహసీల్దార్ విజయ్‌కాంత్ రావు, ఆయా డివిజన్ల కార్పోరేటర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కూళ్లు శుభ్రంగా ఉంచాలి: కలెక్టర్



**ప్రజా పక్షం/దహేగాం/కాగజ్ నగర్ :** ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. దహేగాం మండలంలోని ఐనం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, టాయిలెట్లు, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్త కుండీలలోనే వేయాలని, టాయిలెట్లను వినియోగంలోకి తెస్తూ శుభ్రత పాటించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక మౌలిక వసతులు కల్పిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని, ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచుగా బడికి రాని విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళల సాధికారతతో సమాజ వికాసం



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు అన్ని రంగాలలో మరింత ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆకాంక్షించారు. పురపాలక పరిపాలన శాఖ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం క్యాతనపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ మహిళలు ముందంజలో నిలుస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.భాగంగా పురపాలక సంఘానికి చెందిన మహిళా కౌన్సిల్ సభ్యులు, మెప్మా సిబ్బంది, కార్యాలయ మహిళా ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళల కృషిని గుర్తించి గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్ శ్రీధర్, మహిళా కౌన్సిలర్లు, ఆర్పీలు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనాలి

**కలెక్టర్ అభిలాష అభినవ్**



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో మహిళా ఉద్యోగులందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన,క్రీడల శాఖ ఆధ్వర్యంలో,కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన క్రీడ పోటీలను,శనివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,క్రీడల ద్వారా శారీరక,మానసిక ఉల్లాసం కలుగుతుందని,మహిళలందరూ ప్రతిరోజు క్రీడలను ఆడాలని పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా,మహిళా ఉద్యోగులకు లెమన్ స్పూన్, క్యారం బోర్డ్,చెస్ తదితర క్రీడా పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి,సిపిఓ జీవరత్నం,ఇతర అధికారులు,ఉద్యోగులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ప్రభుత్వ ఆదేశాలు, ప్రిన్సిపాల్ సెక్రటరీ, సంచాలకులు పురపాలక ఆదేశాల మేరకు 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలనప్రగతి ప్రణాళిక లో భాగంగా శనివారం మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించామని కమీషనర్ గోపు గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని, మహిళల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నా రు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి మహాళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి మహిళలను శాలువలతో ఘనంగా సన్మానించామన్నారు. వైస్‌చైర్‌పర్సన్ లత నర్సయ్య, కౌన్సిలర్ కుశలత అనంతరావు, సందీప్, సంగ్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు. 1, 2వ వార్డులలో కొనసాగుతున్న స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ పనులు కమీషనర్ గోపు గంగాధర్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిసర ప్రాంతాల్లోని చెడిపోయిన వస్తువులను తొలగించామన్నారు.

## అంగన్వాడీ కేంద్రాం తనిఖీ

**ప్రజాపక్షం/నిజాంపేట్:** అంగన్వాడీ కేంద్రాన్ని నిజాంపేట ఎంపిడిఓ రాజీరెడ్డి, సర్పంచ్ భాను ప్రకాష్ రెడ్డి తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలకు పసిపిల్లలకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణీలు, పసిపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పసి పిల్లలకు అందుతున్న నెలసరి ఇస్తున్న టీకాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రాజిరెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామస్తులు తడి పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అంది ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి భాగ్యలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు గణేష్, దశరథం, అంగన్వాడీ టీచర్ జ్యోతి ఆశా వర్కర్ పుష్పలత పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో వ్యవసాయ మంత్రీకరణ పథక రాయితీపై యంత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.నియోజకవర్గంలోని ఖానాపూర్,కడెం,దస్తురాబాద్,పెంబి,మండల లాలో గల 41 మంది లబ్ధిదారులకు వ్యవసాయ యాత్రికరణ పథకం ద్వారా వచ్చిన వ్యవసాయం యంత్రాలు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడు నేటి రైతులు వ్యవసాయ రంగంలో ప్రస్తుత టెక్నాలజీకి సంబంధించిన యంత్రాలను ఉపయోగించి వ్యవసాయం చేస్తున్నారని,అలాంటి రైతులకు ప్రభుత్వం ద్వారా అందించే వ్యవసాయ పనిముట్లను సబ్సిడీ లో అర్హులైన వారికి అందజేయడం జరుగుతుందని,కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కొసం అనేకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతుల అభ్యున్నతికి పాటు పడుతుందని,అదే విధంగా రైతుల వ్యవసాయనికి ఉచితంగా విద్యుత్ అందజేస్తూ సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లను అందజేయడంతో పాటు మంచి పంటలను పండించిన రైతులకు మంచి గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని,భవిష్యత్తులో కూడా వ్యవసాయ రంగంలో రైతులు తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలోఓ నిలిచే విధంగా కృషి చేయాలని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగేలా భూషణ్,ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం,ఏడిఏ సుజాత,ఏఓ నవీన్,మండల అధ్యక్షుడు దోనికేని దయానంద్, కౌన్సిలర్లు నిమ్మల రమేష్,రాజురా సత్యం,మాజీ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్,నాయకులు గంగాధర్,జమల్,కార్యకర్తలు,అధికారులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయుల భర్తీ

**సోమవారం 'వాక్ ఇన్' ఇంటర్వ్యూలు**

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 202627 విద్యా సంవత్సరం కు సంబంధించి పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం నిజామాబాద్, కేంద్రీయ విద్యాలయం బోధన్ పట్టణాలలో కాంట్రాక్ట్ ఆధారంగా ఉపాధ్యాయుల నియామకానికి వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు ఈనెల 9న సోమవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు శనివారం తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం నిజామాబాద్ ప్రాంగణంలో జరుగుతాయన్నారు. ప్రైమరీ టీచర్ (పీఆర్‌టీ), టీజీటీ (ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, గణితం, సైన్స్, సోషల్ సైన్స్, తెలుగు లాంగ్వేజ్ ఇన్‌స్ట్రక్చర్, కంప్యూటన్ ఇన్‌స్ట్రక్చర్, ఎటిఎల్ ఇన్‌స్ట్రక్చర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్చర్, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ స్పెల్ ఎడ్యుకేటర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నియామకాలు పూర్తి పారదర్శకంగా జరుగుతాయని, సీటెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు ఉదయం 9 గంటల నుంచి ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లు, అనుభవ పత్రాలు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరు కావలని సూచించారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఖానాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై ఆమె సుదీర్ఘంగా సమీక్షించారు.పంచాయతీరాజ్,రహదారులుభవనాల (ఆర్.అండ్ బి)శాఖల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు,కల్వర్టులు,వంతెనల పనుల్లో జాప్యం చేయరాదని స్పష్టం చేశారు.ప్రతి పనినిన నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. అటవీ శాఖ అనుమతులతో ముడిపడి ఉన్న పనుల కోసం వెంటనే 'పరివేశ్'పోర్టల్‌లో దరఖాస్తులు సమర్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఖానాపూర్ పట్టణ పరిధిలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి,సమగ్రంగా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.సర్కారు భూములను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపటిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వెం టనే పూర్తి చేయాలని అధికారులను కోరారు.అటవీ క్లియరెన్స్ విషయంలో అధికారులు వేగంగా స్పందించాలని,అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా తాను చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.పనుల పురోగతిలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్,జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే,ఆర్డీఓ రత్నకళ్యాణి,ఆర్ అండ్ బి,పంచాయతీరాజ్,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## వేగంగా నిధులు మంజూరు చేయాలి

**కలెక్టరేట్‌లో మంత్రి వివేక్ ఆదేశం**

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** సంగారెడ్డి, సదాశివపేట, మున్సిపాలిటీలతో పాటు సంగారెడ్డి నియోజకవర్గంలో రూ. 4311 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనుల ప్రతిపాదనలను జిల్లా ఇంచార్జీ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కి టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అందించారు. వివిధ ధశల్లో ఉన్న పనుల అనుమతుల ప్రక్రియ నిధుల మంజూరును వేగవంతం చేయాలని వినతిలో పేర్కొన్నారు. 1) మహాబూబ్ సాగర్ సుందరీకరణ కొరకు రూ. 500 కోట్లు, 2) సంగారెడ్డి మున్సిపాలిటీ లో వివిధ హద్దుల్లో అభివృద్ధి కి ,రూ.300 కో ట్లు,3) సదాశివపేట పట్టణంలో మంచి నీటి సరఫరా అభివృద్ధి కొరకు రూ. 170 కోట్లు,4) సదాశివపేట పట్టణంలో మంచి నీటి సరఫరా అభివృద్ధికి 136 కోట్లు,5) కొండాపూర్ మండలం తొగర్‌పల్లి అలియాబాద్‌లలో 125 గజాల చొ ప్పున 93 మంది లబ్దిదారులకు పింఛిణి. 6) సం గారెడ్డి పట్టణంలో బైపాస్ రోడ్‌లో టూటౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు, 7) సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ గృహకల్ప ఇళ్ల సముదాయంలో మౌళిక వసతుల కల్పన కోసం 40 కోట్లు, 8) సంగారెడ్డి పట్టణంలోని ఇల్లు లేని 5000 నిరుపేదలకు ఇంటి స్థలాల కో సం 200 ఎకరాల స్థలం 9) సదాశివపేట పట్టణంలోని ఇంటి స్థలం లేని 5000 మంది నిరుపేదలకు కోసం 200 ఎకరాల స్థలం, 10) సంగారెడ్డి నియోజకవర్గ లో వివిధ గ్రామాల్లో మంచి నీటి సరఫరా కోసం రూ. 15 కోట్లు 11) సంగారెడ్డి పట్టణంలోని వరద నీటి మళ్లింపుకు ప్రత్యేక డ్రైనేజ్ నిర్మాణం కోసం రూ. 130.75 కోట్లు, 12) సంగారెడ్డి మార్కెట్‌కమిటిలో అభివృద్ధి పనుల కోసం రూ. 6 కోట్లు,13) సంగారెడ్డి నియోజకవర్గంలోని చెరువుల సుందరీకరణ కోసం రూ. 3000 కోట్లు,14 సంగారెడ్డి పట్టణంలోని శిల్పారామం ఓ పెండింగ్ పనులు కోసం రూ. 10 కోట్లు ,15) సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్‌లో పట్టాలు కలిగి ఉన్న 2100 మంది లబ్దిదారుకు పోజిషన్ ఇవ్వడం వంటి వివరాలను మంత్రికి వినతి పత్రంలో టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి వివరించారు.

## ఐఎన్‌టిఎస్ఓ ఫలితాల్లో .. శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం / మంచిర్యాల :** ఐఎన్‌టిఎస్ఓ లెవల్ 2 ఫలితాల్లో మంచిర్యాల శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. గతేడాది డిసెంబర్ 28న నిర్వహించిన ఈ పరీక్షకు పాఠశాల నుండి 781 మంది విద్యార్థులు హాజరు కాగా, తాజాగా వెల్లడైన ఫలితాల్లో 304 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. ఇందులో ముగ్గురు విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్ లు కైవసం చేసుకోవడం విశేషం. ఆరో తరగతి విద్యార్థి శివరామ్ తేజ ల్యాప్‌టాప్, తొమ్మిదో తరగతి విద్యార్థిని అక్షిత ట్యాబ్, మూడో తరగతి విద్యార్థి ఏ. కార్తికేయ స్మార్ట్ వాచ్‌ను బహుమతులుగా గెలుచుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య చేతుల మీదుగా శనివారం విజేతలకు బహుమతులను అందజేశారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవ్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రకాల పోటీ పరీక్షలు, క్రీడల్లోనూ ముందంజలో ఉంటున్నారని కొనియాడారు. డీన్ నాగేశ్వర్ రావు, ఇంచార్జ్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేందర్ పాల్గొన్నారు. విద్యార్థుల ఘనత పట్ల పాఠశాల చైర్మన్, యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

## భూనిర్వాసితులతో ఆర్‌డిఓ సమావేశం

**న్యాయం చేయాలని కోరిన రైతులు**



**ప్రజాపక్షం/రామాయంపేట:** దక్‌ఎల్కతుర్తి జాతీయ రహదారి 765డిజిలో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో మెదక్ ఆర్డీవో రమాదేవి శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రైతులు తమ ఆవేదనను ఆమెకు వివరించారు. గతంలో ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రోహిత్‌రావు అప్పటి కలెక్టర్లు తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో భూములు ఇవ్వడానికి అంగీకరించడం జరిగిందన్నారు. కానీ మాకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంలో అన్యాయం చేస్తుందన్నారు. 2022 సంవత్సరంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నివేదిక ప్రకారం భూముల విలువ గజానికి 7వేల రూపాయలు ఉండగా మాకు 2వేల పరిహారం ఇస్తున్నట్లు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. 7వేలకు మూడింతలు 21వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎండిఏ,ఆర్‌ఆర్‌ఆర్ పరిదిలో ఎకరా కు 45 లక్షల పరిహారం ఇస్తుంటే ఇక్కడ 8లక్ష ల 50వేలు ఇవ్వడం పక్షపాత దోరణితో ప్ర భుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. మాకు సరైన నష్టపరిహారం ఇవ్వని ఎడలా తాము భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని ఆర్డీవో కు అందజేసిన వినతిపత్రంలో రైతులు డిమాండ్ చేశారు. రైతులతో జరిగిన సమావేశ వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్డీవో తెలిపారు. తహశీల్దార్ రజనికుమారితో పాటు భూనిర్వాసితులు పాల్గొన్నారు.

# అణచివేత నుంచి ఆదేశించే స్థాయికి..



**ప్రతి రంగంలో ప్రతిభ చాటుతున్నా స్త్రీలు**

**ప్రజాపక్షం/మెదక్ :** ఒకప్పుడు ఇంటి గడప దాటకుండా అణచివేతకు గురైన మహిళలు నేడు సమాజంలోని ప్రతి రంగంలో తమ ప్రతిభను చాటుతూ ఆదేశాలు జారీ చేసే స్థాయికి ఎదుగుతున్నారు. ఒక వైపు కుటుంబ బాధ్యతలు మోస్తూ, అన్ని రంగాల్లో స్త్రీలు ఉత్తమ ప్రతిభను కనబరుస్తూన్నారు. చదువు సమాజిక స్పృహతో మహిళల్లో చైతన్యం వచ్చింది. సమాజంలో స్త్రీలకు అవకాశాలు తక్కువగా ఉన్న కాలం నుంచి ఇప్పుడు అవకాశాలను సృష్టించుకునే స్థాయికి మహిళలు ఎదగడం ఒక గొప్ప సామాజిక మార్పుగా భావించవచ్చు. విద్య, ఉద్యోగం, రాజకీయాలు, వ్యాపారం వంటి అనేక రంగాల్లో ఆడవారు తమ ప్రతిభను నిరూపిస్తూ నాయకత్వ స్థానాలను అధిరోహిస్తున్నారు. పురుషులతో సమానంగా అవకాశాలు పొందుతూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారు. ప్రత్యేకంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంతో మెదక జిల్లాలో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో మహిళల భాగస్వామ్యం పెరిగింది. దీంతో పట్టణాల, గ్రామాల అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల నిర్ణయాలు కీలకంగా మారుతున్నాయి. జిల్లాలో అనేక చోట్ల మహిళా మున్సిపల్ చైర్మన్లు, సర్పంచులు, నాయకులు అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో అవకాశాల లేమి, సామాజిక వివక్ష కారణంగా మహిళలు వెనుకబడినా, ప్రస్తుతం విద్యావకాశాలు పెరగడం, ప్రభుత్వ పథకాలు, చట్టపరమైన రక్షణలు పెరగడం వల్ల మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలు స్థానిక సంస్థల్లో, స్వయం సహాయక సంఘాల్లో కీలక పాత్ర పోషిస్తూ అభివృద్ధికి దోహదపడుతున్నారు. అణిచివేత నుంచి బయటపడి నిర్ణయాలు తీసుకునే స్థాయికి స్త్రీలు ఎదగడం సమాజ అభివృద్ధికి మంచి సంకేతంగా చెప్పవచ్చు. అయితే ఇంకా కొన్ని ప్రాంతాల్లో మహిళల పై వివక్ష, హింస, బాల్య వివాహాలు, విద్యలో వెనుకబాటు వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సమస్యలను తొలగించి మహిళలకు సమాన హక్కులు తొలగించి మహిళలకు సమాన హక్కులు కల్పించడం ప్రభుత్వ భాద్యత. మహిళల శక్తి , ధైర్యం, త్యాగం సమాజాన్ని ముందుకు నడిపించే ప్రధాన బలం. మహిళలను గౌరవించడం వారి హక్కులను కాపాడడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని మహిళా దినోత్సవం మనకు గుర్తు చేస్తుంది. నే డు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మె దక్ జిల్లాలో వివిధ రంగాల్లో, వివిధ హోదాల్లో పని చేస్తు న్న మహిళల అభిప్రాయాలపై"ప్రజాపక్షం" అందిస్తున్న ప్రత్యేక కథనం.విద్యతోనే మహిళలకు సమాజంలో గౌరవం

**హేమభార్గవి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి**

మహిళలపై వివక్ష నిర్మూలించాలంటే ప్రతి బాలిక విద్య నేర్చుకోని, చట్టులు, కుటుంబ విలువలు, సమాజంలో జరుగుతున్న సంఘటనలు తెలుసుకోవాలి. మహిళలకు సమాన హక్కులు, గౌరవం లభించినప్పుడే సమాజం నిజంగా అభివృద్ధి చెందుతుంది. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం వివిధ చట్టులు, పథకాలను అమలు చేస్తోంది. వాటిని ఉపయోగించుకోవాలి.మహిళ గౌ రవం, భద్రతతో జీవించాలంటే ప్రతి ఒక్కరి కృషి అవస రం. అందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.మహిళలు తమకుమలుచుకుంటూ ఎదగాలి

**రాధిక భూపతి రాజ్, మున్సిపల్ చైర్మన్**

మహిళలు తమకు తము మలుచుకుంటూ సమాజంలో ఉన్నతంగా ఎదగాలి ప్రతి ఒక్కరికి అందం ముఖ్యం కాదు, ఆత్మ విశ్వాసం ముఖ్యం. ఆత్మవిశ్వాసంతో వెళ్ళాలి. నేటి సమాజంలో జాబ్ చేస్తూ ఉన్నికి కా పడుకోవడం కోసం తపత్రయ పడుతున్నారు. ఉదయం లేచిన దగ్గర నుండి అష్టలక్ష్మి ల ఇంట్లో అన్ని పనులు చే స్తూనే బయట పనులు చేస్తుంది. స్త్రీలు, పురుషుతో సమానంగా ఎదగాలి. మహిళపై ఇంకా కోంచం చిన్న చూపు ఉంది.

**శ్వేతా కిరణ్ గౌడ్, సర్పంచ్**

మహిళల నాయకత్వం పెంపొందించేందుకు ప్రభుత్వం రాజకీయాలు, పరిపాలన, సంస్థల్లో స్త్రీలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలి. నాయకత్వ లక్షణాలు ఉన్న మహిళలు ఇతరులకు ప్రేరణ అవుతారు. కుటుంబ వ్యవస్థను నిలబెట్టే స్త్రీ నేడు సమాజంలోని రాజకీయ రంగాల్లో తన ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతోంది. దింతో ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమౌతుంది. సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న వివక్షను ప్రతి మహిళ సమర్థవంతంగా ఎదుర్కొని ముందుకు సాగాలి.


**రేణుక, సిఐ,**

మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతున్నప్పటికి ఇంకా సముచిత స్థానం లేదు. ఉదయం నిద్ర లేచి నుంచి నిద్ర పోయేవరకు కష్టపడేది మహిళ. తన ప్రాణాలు పణంగా పెట్టి బిడ్డకు జన్మనిస్తుంది. స్త్రీ, పురుషులు ఇద్దరు సమానం అనేది తప్పుడు ఆలోచన. మహిళల పై వివక్ష లేకుండా సరైన గౌరవం ఇచ్చినప్పుడే నిజమైన మహిళ దినోత్సవం. చాలా మంది చదువుకోని విజ్ఞానంతో ము ందజలో ఉన్నారు. అయిన ఎక్కోడో ఒక లోపం అనిపిస్తుంది. స్త్రీ,పురుషుల తేడా తేకుండా జాగ్రత్త వహించాలి. చట్టసభలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి.అప్పుడే మహిళలకు సరైన గౌరవం దక్కుతుంది.

## మందుబాబుకి జైలు శిక్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మద్యం తాగి వాహనాన్ని రోడ్డుపై అతివేగంగా జాగ్రత్తగా నడుపుకుంటూ పోయే మందుబాబులు ట్రాఫిక్ పోలీసులకు చిక్కితే జైలుకెళ్లడం ఖాయమే. మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ రోడ్లపై తిరిగి ప్రమాదాలకు కారకులు కావొద్దనే ఆలోచనతో చట్టపరంగా కఠిన శిక్షలను విధిస్తున్నారు. పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 41 మందిని శనివారం స్థానిక కోర్టులో హాజరుపర్చారు. విచారణ జరిపిన సెకండ్ క్లాస్ ఇన్చార్జి జడ్జి మంజుల పెద్దపల్లి శాంతినగర్ ఒకరికి ఒకరోజు జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారని ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు. మిగతా 40 మందికి రూ.37,200 జరిమానా విధిస్తున్నట్లు తీర్పులో పేర్కొన్నారని సీఐ వివరించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన శిక్షలు తప్పవని మందు బాబులకు సిఐ అనిల్ కుమార్ హెచ్చరించారు.

## రైతన్న తనయుడికి సివిల్స్ ఫలితాల్లో 748వ ర్యాంకు



రైతు కుటుంబం నుంచి మెరిసిన ముత్యం

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేటకు చెందిన పూదరి రాహుల్ సివిల్స్ ఫలితాల్లో 748వ ర్యాంకు సాధించారు. తన తల్లిదండ్రులు గంగలక్ష్మి మల్లేశం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద కుటుంబం అని రాహుల్ తెలిపారు. రాహుల్ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే విద్యాభ్యాసమంతా కొనసాగిందని రాహుల్ 7వ తరగతి వరకు జగిత్యాలలో 8 నుంచి పదో తరగతి వరకు పోరండ్ల జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో చదివాడని బాసర ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తి చేశానని రాహుల్ చెప్పుకొచ్చారు. ఒకసారి గ్రూప్ 1 పరీక్ష రాశారు. సివిల్స్ లక్ష్యంగా హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుంటూ పరీక్షలకు సన్నద్ధమయ్యానని మొదటిసారి ఆశించిన ఫలితం రానప్పటికీ రెండో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లానని మూడో ప్రయత్నంలో 748వ ర్యాంకు సాధించానని రాహుల్ తెలిపుతూ ప్రతి రోజు 8 నుంచి 10 గంటలు చదివానని తన సోదరుడు రవితేజ పీజీ వైద్య విద్య చదువుతుండగా, సోదరి రాజశ్రీ డిగ్రీ పూర్తి చేశారని అన్న వైద్యవిద్యకు ఎంపికావడం తనకు స్ఫూర్తినిచ్చిందని ఐఏఎస్, ఐపీఎస్ కాకుండా ఇతర సర్వీసుల్లో ఉద్యోగం వస్తుందని తను భావిస్తున్నాను అని ఐఏఎస్ సాధనే లక్ష్యమని పూదరి రాహుల్ చెప్పుకొచ్చారు.

## గ్రామాలకు రూ.21.04 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.21 కోట్ల నాలుగు లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 13 గ్రామీణ మండలాల పరిధిలో ఉన్న గ్రామాలకు 2023–24, 2024–25 సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు 13 జనవరి 2026, 17 ఫిబ్రవరి 2026, 26 ఫిబ్రవరి 2026 తేదీలలో మూడు విడతల్లో మొత్తం ఇప్పటి వరకు దాదాపు 21 కోట్ల 4 లక్షల రూపాయలు విడుదల కావడం జరిగిందని,ఇందులో అన్ టైడ్ గ్రాంట్ 5 కోట్ల 73 లక్షలు, టైడ్ గ్రాండ్ 15 కోట్ల 31 లక్షలు ఉన్నాయని తెలిపారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులతో సంబంధిత కరెంట్ బిల్లుల చెల్లింపు, జీతాల చెల్లింపు, ఇతర కార్యాలయ ఖర్చులు ఉంటాయని, టైడ్ గ్రాంట్ నిధులతో అభివృద్ధి పనులకు సంబంధించి వినియోగించడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మరణంలోనూ వీడని భార్యాభర్తల బంధం

భర్త మరణించిన కొన్ని గంటల్లోనే భార్య మృతి

**ప్రజాపక్షం/చొప్పదండి :** వేదమంత్రాల సాక్షిగా అన్ని వేళలా తోడునీడగా ఒకరికి ఒకరు ఉంటామని వివాహ సమయంలో చేసిన ప్రతిజ్ఞ వృద్ధ దంపతుల విషయంలో అక్షర సత్యమైంది. మరణంలోనూ వారి బంధం విడదీయలేదు. గంటల వ్యవధిలో భార్యభర్తలు మరణించిన సంఘటన కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని 13వ వార్డుకు చెందిన పొన్నాల లచ్చయ్య (85) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. అప్పటికే అనారోగ్యంతో వరంగల్ ఎంజిఎం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆయన భార్య పొన్నాల హనుమమ్మ (80) భర్త మరణ వార్త విన్న దిగ్భ్రాంతిలో రాత్రి 10 గంటలకు ఆమె సైతం ప్రాణాలు వదిలింది. ఐదు గంటల వ్యవధిలోనే భార్య భర్తలు చనిపోవడంతో స్థానికంగా విషాదం నెలకొంది.

## అరవింద్ మాటలు ఆయన విజ్ఞతకే..

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల :** నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఇటీవల జగిత్యాల పర్యటనలో చేసిన మాటలు ఆయన విజ్ఞతకే వదిలివేస్తున్నాని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మోతె రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో సంజయ్ కుమార్ శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంపీ అర్వింద్ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే సంజయ్ కాలయాపన చేస్తున్నారని విమర్శించడం, ఈర్శతో మాట్లాడడడం, నిందలు వేయడం పనిగా పెట్టుకున్నారన్నారు. జగిత్యాల ప్రాంతాన్ని అభివృద్ధితో తీర్చి దిద్దుతున్నానని, అభివృద్ధే నా ఎజెండాగా ముందుకు వెళుతున్నానన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి 2025 నవంబరులోనే కేంద్రీయ విద్యాలయ స్థలం కోసం లేఖ రాయడం జరిగిందని మంత్రి కూడా సానుకూలంగా స్పందించారన్నారు. జగదల్‌పూర్–నిజామాబాద్ జాతీయ రహదారిపై ఉన్న అనంతారం బ్రిడ్జి, రాయికల్ మండలం సింగరావు పేట బ్రిడ్జిల విషయంలో నిధులు మంజూరు చేయాలని ఎంపీని స్వయంగా కోరినా నేటికి నిధులు ఎందుకు మంజూరు చేయడం లేదో సమాధానం చెప్పాలన్నారు. ఒక ప్లాన్ ప్రకారమే బీఆర్ఎస్‌లో ఉన్న శ్రావణి బీజేపీలో చేరి నాపై వ్యక్తిగత దూషణలు చేశారన్న విషయాలు ఎంపీ అర్వింద్ మాటల్లోనే అర్థమయ్యిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పర్వీన్ మున్నా, నాయకులు భీరం రాజేష్, చాంద్ పాషా, గట్టు సతీష్, నాగయ్య, బాలె శంకర్, మల్లిఖార్జున్, జగదీష్, అనీల్, రాజు, బిక్షపతి, రాజ్ కుమార్, మహేష్, జగన్ తదితరులు ఉన్నారు.

# జగిత్యాలలో మహిళా అధికారుల ప్రతిభ

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**ప్రజాపక్షం/జగిత్యాల :** ఇంటిలో ఆమె, చదువులో ఆమె, కొలువులో ఆమె ఇలా మహిళలు పురుషులతో సామానంగా రాణిస్తున్నారు. జగిత్యాల జిల్లాలో పని చేస్తున్న జిల్లా స్థాయి అధికారులు ప్రజలకు ఉన్నత సేవలు అందిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారు. రెవెన్యూ, పోలీస్, మార్కెటింగ్, ట్రెజరరీ, కార్మిక, ఉపాధి, బీసీ వేల్ఫేర్, ఆరోగ్య తదితర శాఖల్లో విశిష్ట సేవలను అందిస్తూ జిల్లా అధికార యంత్రాగానికి మంచి పేరు తెస్తూ పాలానాధికారికి అండగా నిలుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా పలువురు రెండు రోజుల ముందు నుంచే మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తూ మహిళా శక్తిని ప్రపంచానికి చాటేలా చర్యలు చేపట్టారు. జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న మహిళా అధికారులను ప్రజాపక్షం దినపత్రిక పలకరించింది. ఈ సందర్భంగా వారు తమ అభిప్రాయాలను ఇలా పంచుకున్నారు.

**జిల్లా స్థాయిలో ముఖ్య అధికారులు వీరే...**

జగిత్యాల జిల్లాలో అదనపు కలెక్టర్‌గా బిఎస్ లత, బిసి వెల్ఫేర్ అధికారిగా సునీత, జిల్లా వైద్యాధికారిగా సుజాత, జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా స్పందన, జిల్లా ఆడిట్ ఆఫీసర్‌గా సుజాత, జగిత్యాల బస్‌డిపో మేనేజర్‌గా కల్పన, బిసి వెల్ఫేర్స్ రెసిడెన్సినియల్ జిల్లా కోఆర్డినేటర్‌గా సుస్మిత, ఫుడ్ సేఫ్టీ అధికారిగా అనూష, జిల్లా ఉపాధి కల్పన అధికారిగా సత్యమ్మతో పాటు ఎంపీడీవోలు, తహసీల్దార్లు ఇలా తదితర అన్ని శాఖల్లో మహిళా ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

**మహిళల్లో వెనుకబాటుతనం పోవాలి..**
**– బిఎస్.లత, అదనపు కలెక్టర్, జగిత్యాల జిల్లా**



మహిళల్లో వెనుకబాటు తనం పారద్రోలేందుకు వారిలో ధైర్యం కల్పించాలి. మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాలు, శిక్షలపై వారికి వివరిస్తూనే మనో ధైర్యం పెంచాలి. ఇప్పటికి చాలా మంది చిన్న చిన్న సంఘటనలు జరిగినా తప్పులు లేనప్పటికి మహిళలు అన్న భావనతో పాటు పరువు పోతుందన్న భయంతో నిమ్మకుండిపోతున్నారు. అలా కాకుండా ధైర్యంగా ముందుకు వచ్చే విధంగా వారికి ప్రొత్సాహం కావాలి. వారిలో చైతన్యం తీసుకవచ్చే విధంగా స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలు చేపట్టాలి. ఆడ, మగ అనే తేడా మనస్సులోకి కూడా రావొద్దు..

**మహిళలు తమ శక్తిని చాటుకోవాలి..**
**– జి.సునీత, బిసి వెల్ఫేర్ అధికారి, జగిత్యాల జిల్లా**



మహిళలు వంటింటికే పరిమితం కాకూడదు. చదువులో ముందుండి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ శక్తిని చాటుకోవాలి. తమకు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని స్వశక్తితో ముందుకు వెళ్లాలి. సమాజంలో మహిళల పాత్ర ఎంత గొప్పదనే విషయాన్ని ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా ఎదగాలి. మహిళ ఉద్యోగులను గౌరవించాలి.

**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..**
**– బి.సుజాత, జిల్లా ఆడిట్ అధికారి**



ఒకప్పుడు నాలుగు గోడల మధ్య వంటింటి కుందేళ్లుగా మహిళలు ఉండేవారు. ఈ రోజు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. స్వశక్తితో మహిళలు రాజకీయ రంగాల్లో దూసుకెళ్తున్నారు. ఉద్యోగం స్త్రీ బాధ్యతగా చేపట్టినపుడే మహిళా లోకం ఆర్థికంగా ఎదుగుతారు.

**స్త్రీ చదువు సమాజానికి వెలుగు...**
**– సత్యమ్మ, ఉపాధి కల్పన అధికారి, జగిత్యాల జిల్లా**



ప్రతి స్త్రీ చదువుకుంటేనే సమాజం వెలుగుతుంది. మహిళలు తమ హక్కులను స్వచ్ఛందంగా పొందాలి. రిజర్వేషన్ల ఆధారంగా అన్నిరంగాల్లో మహిళలు పురుషులతో పోటీ పడాలి. వరకట్నం, ఆడవాళ్లపై కక్ష సాధింపులు కొనసాగుతున్నాయి. వీటిని అరికట్టాలి. ప్రభుత్వం మహిళా హక్కులపై చొరవ చూపడం అభినందనీయం.

**మహిళలపై చిన్న చూపు తగదు..**
**జి.సుజాత. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, జగిత్యాల జిల్లా**



సమాజంలో మహిళలను ప్రతి ఒక్కరూ చిన్న చూపు చూడడం తగదు. మహిళలు నేటి ప్రపంచంలో ఒక శక్తిగా ఎదుగుతున్నారు. కుటుంబం బాధ్యతలు చేపట్టే ప్రతి మహిళా అదే బాధ్యతగా ఉద్యోగం సాధించేలా కృషి చేయాలి. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కుటుంబ సభ్యుల అనారోగ్య విషయంలో అశ్రద్ధ వీడాలి.

## కన్నకొడుకే కాలయముడై..!



**ప్రజాపక్షం/రామడుగు :** మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం హత్యకు గురైన ఈరళ్ల గౌరమ్మ హత్య కేసును స్థానిక పోలీసులు చేధించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరీంనగర్ ఏసీపి విజయకుమార్ చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్ ఎస్సై రాజు హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వారి కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన ఈరళ్ల మహేష్ నిందితుడు అనిల్ కుమార్ ఇరువురు సోదరులు, మహేష్ సింగపూర్ నుండి పంపిన రూ.5 లక్షలు, ఇటీవల వ్యవసాయంలో వచ్చిన నాలుగు లక్షల రూపాయలను అనిల్ కుమార్ తన తల్లిదండ్రులకు తెలియకుండా జల్సాల కోసం వాడుకున్నాడు. ఈ నేపథ్యంలో మహేష్ కుమార్‌కు ఇదే గ్రామానికి చెందిన యువతితో వివాహం నిశ్చయం కావడంతో స్వగ్రామానికి తిరిగి వచ్చి అనిల్ కుమార్ వాడుకున్న డబ్బుల గురించి తల్లిదండ్రుల సమక్షంలో గట్టిగా నిలదీశాడు. వివాహం పూర్తయిన తర్వాత ఎట్టి పరిస్థితిలో డబ్బులు చెల్లించాలని షరతు విధించడంతో ఖర్చు అయిన డబ్బులు తాను చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఎలాగైనా తన తల్లిని చంపి వివాహాన్ని ఆపితే తప్ప తనకు గత్యంతరం లేదని ఇంట్లో ఎవరు లేని సమయంలో అనిల్ కుమార్ తన తల్లి ఈరళ్ళ గౌరమ్మ మధ్యాహ్నం గాఢ నిద్రలో ఉండగా గొంతు నులిమి ఇంట్లో ఉన్న కత్తితో గొంతు కోసి హత్య చేశాడని తమ విచారణలో ఒప్పుకున్నట్లు వివరాలను వెల్లడించారు. హత్యకు ఉపయోగించిన కత్తి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడు అనిల్ కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం రోజున పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మహిళా సోదరీమణులను సన్మానించి, ముందుగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 10 లక్షల రూపాయలతో మున్సిపల్ వారు కొనుగోలు చేసిన మూడు ట్రాక్టర్ ట్రాలీలను ప్రారంభించి అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో 26 మంది వికలాంగులకు టివిఎస్ జుపిటర్ స్కూటీలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నుగిళ్ళ మల్లన్న, వైస్ చైర్ పర్సన్ ముస్కాన్ నాజ్, మున్సిపల్ కమిషనర్ మరియు కౌన్సిలర్లు మరియు వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్, కూర మల్ల రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణు గోపాల్, మున్సిపల్ అధికారులు, మెప్మా మహిళలు, మున్సిపల్ కౌన్సిలర్, మరియు సర్పంచ్‌లు అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాయవాదుల దీక్షలకు సిపిఐ సంపూర్ణ మద్దతు

న్యాయవాదుల దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిపిఐ నాయకులు గౌతమ్ గోవర్ధన్, మోహన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి అతని గన్ మెన్ న్యాయవాదుల పట్ల దురుసుగా ప్రవర్తించడం గర్హ నీయమని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక గోదావరిఖని కోర్టు వద్ద న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించిన అనంతరం సిపిఐ రాష్ట్ర సభ్యులు కామ్రేడ్ గౌతమ్ గోవర్ధన్, కామ్రేడ్ గోషికమోహన్, సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే.కనకరాజ్, సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్యలు మాట్లాడుతూ వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డిని వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయాలని అతని గన్‌మెన్‌పై వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. న్యాయవాదులపై జరిగిన దాడిపై ఉన్నత అధికారులకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఫిర్యాదు చేసినప్పటికీ ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరైన కాదని వారు అన్నారు. రామగుండం ముఖ్య ప్రజా ప్రతినిధి అండదండలతో సీఐ తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని వారు ఆరోపించారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డిని అదేవిధంగా అతని గన్ మెన్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని వారన్నారు. ఇంకా న్యాయవాదుల దీక్ష శిబిరాన్ని సందర్శించిన వారిలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు కామ్రేడ్ తాళ్ళపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, సిరిసిల్ల మల్లేష్, పడాల కనకరాజు, జైపాల్ రెడ్డి, సుధీర్, దుబాసి రేణుక, అసాల నవీన్, నాగరాజు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం




ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్స్ విడుదల

**ప్రజాపక్షం/కరీంనగర్ :** దేశం కోసం ప్రాణాలర్పించిన షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వర్ధంతి పురస్కరించుకొని గీతా భవన్ చౌరస్తాలో వాల్ పోస్టర్స్ విడుదల చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భామండ్లపల్లి యుగంధర్ మాట్లాడుతూ షహీద్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలను సైతం లెక్కచేయకుండా, భవిష్యత్తు తరాల కోసం బ్రిటీష్ ముష్కరులను ఎదిరించి వీరోచిత పోరాటాలు చేసి వీరమరణం పొందరన్నారు. కానీ, భగత్ సింగ్ కలలుగన్న స్వరాజ్య ఆకాంక్షలకు అనుగుణంగా నేటి విద్యార్థులు, యువత పయనుంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికే ఆదర్శప్రాయుడైన భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత చెడు మార్గాలను,చెడు అలవాట్లను విడనాడాలని వారు పిలుపునిచ్చారు. మతోన్మాద ముక్త భారతం సాధించడానికి భగత్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్ కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర చంచాల మురళి, పెనుమల్ల భాస్కర్, అవినాష్, రాజేష్, ఎండి రెహాన్, ఎస్.అరవింద్, కే.సాగర్, ఎస్.మనోజ్, ఎస్.శివరాం, గౌతమ్, అనిల్, సాయి, ప్రణీత్, అనిల్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగినులకు అండగా టిఎన్‌జిఒ సంఘం

టిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బొంకూరి శంకర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మహిళా ఉద్యోగులకు టిఎన్‌జిఒ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షులు బొంకురి శంకర్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులతో కార్యక్రమ ఏర్పాటు చేశారు. ఎల్లప్పుడు ఉద్యోగులకు అండగా, ఉద్యోగుల సంక్షేమం ఔన్నత్యానికి సదా కృషి చేస్తూ ప్రతి కార్యక్రమాన్ని వైభవంగా అందరినీ కలుపుకుంటూ జరుపుతూ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్నదనీ, ప్రతి సంవత్సరం మహిళల స్థానాన్ని సుస్థిరం చేస్తూ, మహిళా శక్తికి ప్రాముఖ్యతను ఇస్తూ ప్రతి కార్యక్రమాన్ని మహిళా ఉద్యోగులను భాగస్వామ్యం చేస్తూ ముందు కు సాగుతున్నదని, ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ శ్రీ దాసరి వేణు, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, జిల్లా విద్యాధికారి శారద, డీఆర్డీఓ కాళిందిని జిల్లా యువ క్రీడా అధికారి సురేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టగ్ ఆఫ్ వార్, పొటాటో గేమ్, షాట్ పుట్, లెమన్ & స్పూన్ క్రీడలు పీఈటీలు మంజు, టీమ్ నిర్వహించగా,మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఆటల్లో పొటాటో గేమ్ ఆటలో ప్రథమ బహుమతి అనిత (మిషన్ భగీరథ), ద్వితీయ బహుమతి లావణ్య (ఇరిగేషన్), తృతీయ బహుమతి ప్రవళిక (ఇరిగేషన్)లు గెలుపొందగా, లెమన్ స్పూన్ ఆటలో ప్రథమ బహుమతి స్నేహ(ఎడ్యుకేషన్), ద్వితీయ బహుమతి దివ్య(ఇరిగేషన్), తృతీయ బహుమతి అంజలి(మత్స్య శాఖ)లు గెలుపొందగా, షాట్ పుట్ ఆటలో ప్రథమ బహుమతి గౌతమి (ఎస్సీ కార్పొరేషన్), ద్వితీయ బహుమతి అనూష (రోడ్లు భవనాలు), తృతీయ బహుమతి అనిత(మిషన్ భగీరథ)లు గెలుపొందగా, టగ్ ఆఫ్ వార్ ఆటలో మొదటి బహుమతి స్వప్న కుమారి (ట్రెజరీ), హారిక (ట్రెజరీ), స్రవంతి (ఇరిగేషన్), స్రవంతి (ఇరిగేషన్), అన్విక (రోడ్లు భవనాలు)లు, ద్వితీయ బహుమతి అనసూర్య టీమ్ గెలుపొందారు. విజేతలందరికీ ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు అయిరెడ్డి సందీప్ రెడ్డి, జిల్లా బాధ్యులు కొమురయ్య, మహేందర్ రెడ్డి, శిల్ప, సౌమ్య, రమేష్, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, రామగుండం అధ్యక్షులు జగన్, సంపత్, రాజీ రెడ్డి, ప్రేమ్ సాగర్, నిఖిల్, అఖిల్,తదితరులు పాల్గొన్నారు.

## స్థల కేటాయింపుపై ముఖ్యమంత్రికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖ

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల ప్రాంత రైతులు వరిసాగుతోపాటు వివిధ రకాలైన పంటలు, పండ్ల తోటలు ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్ట్ నిర్మాణ దశలో వ్యవసాయ రంగంలో నీటి వనరుల వినియోగం నీటి నిర్వహణ పద్ధతులపై పరిశోధనలు చేయటం రైతులు అధికారులకు శిక్షణ సాగునీటి వినియోగాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ప్రస్తుతం జగిత్యాల రూరల్ గ్రామీణ మండలంలోని చల్‌గల్‌లో రెవెన్యూ గ్రామంలో వాలంటరీ వ్యవసాయ ప్రదర్శన క్షేత్రం సుమారు 120 ఎకరాల భూమి సేకరించి ఏర్పాటు చేయటం జరిగిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. వాలంటరీ వ్యవసాయ ప్రదర్శన క్షేత్రం స్థలంలో నుండి జగిత్యాల ప్రాంతంలోని మామిడి రైతుల సౌలభ్యం కోసం మామిడి మార్కెట్ ఏర్పాటు కోసం 25 ఎకరాల భూమి కేటాయించడంతో పాటు వ్యవసాయ మార్కెట్ కోసం మరో 5 ఎకరాలు, గోదాముల నిర్మాణానికి, రైల్వే లైను ఏర్పాటుకు మరో 10 ఎకరాలు భూమి కేటాయింపు ద్వారా వినియోగం చేయటం జరుగుతున్నది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు కావాల్సిన స్థలం వాలంటరీ వ్యవసాయ ప్రదర్శన క్షేత్రంలో సుమారు 25 ఎకరాల భూమి కేటాయించాలని సీఎంను జీవన్ రెడ్డి కోరుతూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చొరవతో కేంద్ర ప్రభుత్వం జగిత్యాల జిల్లాకు మంజూరు చేయబడిన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి కూడా ఇదే చల్ గల్‌లోని వాలంటరీకి చెందిన స్థలంలో అవసరమైన 5 ఎకరాలు స్థలం కేటాయింపు కోరుతూ చదువు ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం భారీ వ్యయంతో నిర్మింపబడే అన్ని స్పోర్ట్స్ స్టేడియం ల్యాండ్ క్రీడలు, ఆటలు, మైదానం స్టేడియం ఏర్పాటుకు సుమారు 10 ఎకరాలు కేటాయించాలని, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు 25 ఎకరాలు, కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరు అయిన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాలు, స్పోర్ట్స్ క్రీడలు, క్రీడా ప్రాధాన్యతతో స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు 10 ఎకరాలు స్థలం మొత్తం 35 ఎకరాలు మంజూరికి ప్రత్యేక చొరవతో తగు నిర్ణయం తీసుకొని స్థలం కేటాయింపునకు చర్యలు త్వరగా చేయగలరని ముఖ్యమంత్రికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖ రాశారు.

## మోదీ, రేవంత్‌రెడ్డి ఇద్దరూ రైతు వ్యతిరేకులే

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



**ప్రజాపక్షం/సిద్దిపేట :** పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు రోడ్ల మీద ఉన్నారని.. పదేండ్ల కెసిఆర్ పాలనలో రైతులు ఏనాడు రోడ్ల మీదకు రాలేదని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు దర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ మళ్లీ సమైక్య ఆంధ్రాలో ఉన్న రోజులు మళ్లీ వస్తున్నాయని.. సిఎం రేవంత్‌రెడ్డి ఆ రోజులు మళ్లీ తీసుకొచ్చారని.. మెల్లమెల్లగా రేవంత్‌రెడ్డి అసలు రంగు బయటపడుతుందన్నారు. సమైక్యాంధ్రాలో తెలంగాణ రైతులు అష్టకష్టాలు పడ్డారన్నారు. నాగర్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణలో కట్టి ఆంధ్రకు నీళ్లు తీసుకెళ్లారని ఆ నీళ్లతోనే గుంటూరుకు సంపద పెంచిందన్నారు. సిద్దిపేట ప్రజల మీద ప్రేమ ఉన్న ఎమ్మెల్యే హరీష్‌రావు సిద్దిపేటను అన్నిరంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కెసిఆర్ మళ్లీ అధికారంలోకి వచ్చి యుంటే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి అయ్యేదన్నారు. రైతులకు ఉచిత కరెంట్ ఎత్తివేసే కుట్రజరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టే ఆలోచనలో ఉన్నారన్నారు. అమెరికా నుండి పత్తి, సోయా, మొక్కజొన్న దిగుమతి చేసుకునే ఒప్పందంపై మోదీ సంతకం చేసినట్లు తెలిపారు. భారతదేశ రైతువెన్నముఖ విరిచేసే కుట్ర జరగుతుందన్నారు. ప్రజలు ఆలోచించాలని.. ఎవ్వరు నిజమైతే రైతుబంధు, ఎవ్వరు రైతువ్యతిరేకో తెలుసుకోవాలన్నారు. నిజమైన రైతుబంధు కెసిఆర్‌కు ప్రజలు మద్దతుఉగా నిలవాలన్నారు. రైతువ్యతిరేక మోదీ. రేవంత్‌రెడ్డిలకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు శ్రీకాంత్‌రెడ్డి. ఎడ్ల సోమిరెడ్డి, లింగం గౌడ్, పాపారావు, కోల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాకు తెలంగాణ ప్రభుత్వం తనను ఉత్తమ నటిగా ఎంపిక చేయడం పట్ల రశ్మిక సంతోషం వ్యక్తం చేశారు. 2025వ సంవత్సరానికి గానూ తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుకు తనను ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని రశ్మిక తెలిపారు.

రీల్

# 'వదలా'లో ప్రధాన పాత్రలో జగపతి బాబు



జగపతి బాబు ప్రధాన పాత్రలో ఆకెళ్ల వి కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న మిస్టరీ సస్పెన్స్ థ్రిల్లర్ 'వదలా'. ఎస్వి సిఎల్ఎల్‌పి బ్యానర్‌పై చరిత చిత్ర బ్యానర్ పై కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్‌లో జగపతిబాబు ప్రెజెన్స్ పోస్టర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఇం టెన్స్ లుక్, కళ్లద్దాల వెనుక కనిపించే కూల్ కాన్ఫిడెన్స్ పాత్రలోని పవర్‌ను సూచిస్తున్నాయి. బ్యాక్ డ్రాప్‌లో నీలంఎరుపు రంగుల మధ్య విభజించిన అమ్మాయి ముఖం వెనుక ఒక పెద్ద మిస్టరీ దాగి ఉందనే ఫీలింగ్‌ను ఇస్తోంది. మొత్తానికి ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఫోటోగ్రఫీ డైరెక్టర్‌గా చోటా కె. నాయుడు, ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు, సంగీతం కార్తీక్ బి. కొడకండ్ల అందిస్తున్నారు. లక్ష్మీ భూపాల రచయితగా పని చేస్తున్నారు.త్వరలోనే ఈ చిత్రం థియేటర్స్‌లో విడుదల కానుంది. జగపతి బాబు, లయ, హృతిక ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్: బజ్జా బ్రహ్మయ్య, స్టంట్స్: డ్రాగన్ ప్రకాష్, సాహిత్యం: కృష్ణవేణి మల్లవజ్జల, శివ కృష్ణ చారి ఎర్రోజు, వీరు గడ్డం.

# కెరీర్‌లో ఇది మరో గొప్ప ఘట్టం: చిరంజీవి




తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్సు2025లో ఎన్టీఆర్ జాతీయ అవార్డుకు తనను ఎంపిక చేయడం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. తన కెరీర్‌లో ఇది మరో గొప్ప ఘట్టం అని చిరంజీవి వ్యాఖ్యానించారు. తెలుగు సినిమా పరిశ్రమకు చిరంజీవి చేసిన సేవకు గాను ఈ అత్యున్నత ఎన్టీఆర్ జాతీయ పురస్కారానికి తెలంగాణ ప్రభుత్వం ఎంపిక చేసింది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు పురస్కారాన్ని మెగాస్టార్ చిరంజీవికి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రదానం చేయనున్నారు. భారతీయ సినీ పరిశ్రమకు ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ గౌరవంతో సత్కరిస్తున్నారు. తెలుగు కమర్షియల్ సినిమాకు కొత్త దిశ చూపించిన హీరోగా చిరంజీవి ప్రత్యేక గుర్తింపు పొందారు. తన అద్భుతమైన నటన, డ్యాన్స్, మాస్ అప్పీల్తో ఆయన తరతరాల ప్రేక్షకులను అలరిస్తున్నారు.చిన్న చిన్న పాత్రల తో మొదలైన చిరంజీవి ప్రయాణం భారతీయ సినిమా చరిత్రలో అత్యంత ప్రభావశీలమైన నటుల్లో ఒకరిగా ఎదిగే వరకు అద్భుతంగా సాగుతోంది. ఆయన ప్రయాణం ఎంతోమంది కొత్త నటులు, దర్శకులకు ప్రేరణగా నిలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం తనను ఎన్టీఆర్ అవార్డుతో గౌరవించాలనుకోవడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా చిరంజీవి పేర్కొన్నారు.

# మంచి సినిమా చేసినందుకు చాలా సంతోషంగా : వరలక్ష్మి శరత్ కుమార్



వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్‌తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మించిన చిత్రం 'సరస్వతి'. హైకాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించారు. మార్చి 6న ఈ సినిమా థియేటర్స్‌లో విడుదలై అద్భుతమైన రెస్పాన్స్‌తో ఘన విజయాన్ని సాధించి, సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ డైరెక్టర్ వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ నేను నిన్న చాలా థియేటర్స్‌కి వెళ్లాను. ప్రతి సీన్‌కి ప్రతి డైలాగ్స్ చప్పట్లు కొడుతున్నారు. క్లైమాక్స్ చూసి చాలా సర్‌ప్రైజ్ అయ్యారు. ఆడియన్స్ రెస్పాన్స్ చూస్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇది కేవలం విమెన్ సెంట్రిక్ సినిమా కాదు. ఇది ఒక మంచి థ్రిల్లర్. యాక్షన్, ఎమోషన్ లవ్ అని ఉన్నాయి. తప్పకుండా ఒక సారి వెళ్లి సినిమా చూడండి. మీ అందరికీ నచ్చుతుంది. ఈ సినిమా చూసి అందరూ కూడా చాలా మంచి మెసేజులు పెట్టారు. తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది. ఎంత ఎక్కువ మంది చూస్తే అంత సంతోషమని అన్నారు. ఈ సక్సెస్ మీట్ లో నిర్మాత పూజా శరత్ కుమార్ కూడా పాల్గొన్నారు.

# యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరణలో 'భోగి'



శర్వానంద్ హీరోగా సంపత్ నంది తో కలిసి భారీ పాన్ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' సినిమా చేస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆరట్స్ బ్యానర్ పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తున్నారు . ఈ చిత్రం శర్వా కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన వెంచర్‌లలో ఒకటిగా రూపొందుతోంది. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సందర్భంగా ఒక ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో శర్వా పూర్తిగా మాసీ, ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. రగ్గడ్ జుట్టు , గడ్డంతో శర్వా, రెబెలియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. పెదవుల మధ్య బీడి పెట్టుకుని, దాని నుంచి నెమ్మదిగా బయటకు వస్తున్న పొగ ఆయన పాత్రలోని అటిట్యూడ్‌ను మరింత హైలైట్ చేస్తోంది. చెమట తో తడిసిన ముఖం, రఫ్ టెక్స్చర్ పాత్రలోని గ్రిటీ రియలిజాన్ని చూపిస్తోంది. ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్ ఫియర్స్, రాజీ పడని వ్యక్తిత్వాన్ని ప్రజెంట్ చేస్తోంది. ఎ బ్లడ్ ఫెస్ట్ అనే ట్యాగ్‌లైనుతో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. ఈ చిత్రంలో శర్వానంద్ ఇప్పటివరకు కనిపించని రస్టిక్, ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. డైరెక్టర్ సంపత్ నంది ఈ చిత్రాన్ని 1960ల కాలంలో ఉత్తర తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో యాక్షన్ సీక్వెల్‌ను చిత్రీకరిస్తున్నారు.ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథా నాయికలుగా నటిస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె, సినిమాటోగ్రఫీ కిషోర్ కుమార్ అరోకియా నిర్వహిస్తుండగా, బ్లాక్ బాస్టర్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 28న రక్షా బంధన్ సందర్భంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఒకేసారి రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# 'శ్రీనివాస మంగాపురం' మూడో షెడ్యూల్ పూర్తి



ఆర్ఎక్స్ 100, మంగళవారం చిత్రాలలో ప్రశంసలు అందుకున్న దర్శకుడు అజయ్ భూపతి ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడు దివంగత రమేష్ బాబు కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రం ద్వారా తెలుగు సినిమాకు హీరోయిన్ గా పరిచయం అవుతోంది. మంచు మోహన్ బాబుఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు.అగ్ర నిర్మాత అశ్విని దత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నిర్మాత పి కిరణ్ నిర్మిస్తున్న శ్రీనివాస మంగాపురం ఇప్పటికే విడుదలైన టైటిల్ రివీల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్‌లు ప్రేక్షకుల ఆసక్తిని రేకెత్తించాయి. ఇటీవల చిత్రబృందం తిరుపతిలో జరిగిన కీలకమైన మూడో షెడ్యూల్ను పూర్తి చేసింది. ఈ షెడ్యూల్ లో కృష్ణ ఘట్టమనేని, రాషా తడాని తదితర ప్రధాన తారాగణంపై ముఖ్య సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ షెడ్యూల్ పూర్తవడంతో సినిమా షూటింగ్ దాదాపు 60 శాతం పూర్తయింది. ప్రస్తుతం చిత్ర నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. జివి ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ గా జయకృష్ణ , ఎడిటింగ్ బాధ్యతలను మాధవ్ కుమార్ గుల్లపాటి నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైనర్ సాహి సురేష్. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా రియల్ సతీష్ పని చేస్తున్నారు. ఈ చిత్రానికినిర్మాత: పి.కిరణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాకమూరి నారాయణ స్వామి.

# 'ధురంధర్: ది రివేంజ్' ట్రైలర్ రిలీజ్



ధురంధర్ ది రివేంజ్ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ధురంధర్ బాక్సాఫీస్ వద్ద ఒక సంచలనం, ఆల్ టైం బిగ్గెస్ట్ హిందీ చిత్రంగా నిలిచిన తర్వాత, ఇప్పుడు సీక్వెల్ రాబోతోంది. ట్రైలర్‌లో రణవీర్ సింగ్ జస్కిరత్ సింగ్ రంగీ పాత్రలో మరోసారి కనిపించారు. ఈసారి ఆయన జస్కిరత్, హమ్జా అనే రెండు పాత్రల్లో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కథలో కీలక పాత్రలుగా ఆర్. మాధవన్ వ్యూహాత్మక మాస్టర్మైండ్ అజయ్ సన్యాల్, అర్జున్ రాంపాల్ ఐఎస్ఐ మేజర్ ఇక్బాల్ పాత్రలో భయంకరమైన విలన్గా, అలాగే సంజయ్ దత్ ఎస్పీ చౌధరి అస్లంగా శక్తివంతమైన పాత్రలో కనిపించారు.అత్యంత భారీ యాక్షన్ సన్నివేశాలు, పదునైన డైలాగ్స్, సన్నివేశాలతో ట్రైలర్ మొత్తం ఒక భారీ రివెంజ్ సాగాకు నాంది పలుకుతోంది. హోంసాల. ఈంధన్. బద్లా. అనే ట్యాగ్‌లైన్ ఈ సీక్వెల్‌ను ముందుకు నడిపించే రివెంజ్ కథను సూచిస్తోంది. జియో స్టూడియోస్ సమర్పణలో, బీ62 స్టూడియోస్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.ఈ యాక్షన్ చిత్రానికి ఆదిత్య ధర్ కథ, దర్శకత్వం అందించగా జ్యోతి దేశ్పాండే, లోకేష్ ధర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా మార్చి 19న గుడి పాడ్వా, ఉగాది పండుగల సందర్భంగా 'ధురంధర్: ది రివేంజ్' థియేటర్లలో విడుదల కానుంది.

# కెటిఆర్, హరీష్‌ను ప్రజలు పట్టించుకోరు

**భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెటిఆర్, హరీష్ రావు ప్రతి రోజు మొరిగినా ప్రజలు పట్టించుకోరని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రోగ్రాంను ప్రారంభించిందని, రెండేళ్ళలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజలు ఏమనుకుంటున్నారో? తెలుసుకోనున్నామని వివరించారు. కానీ హరీష్ రావు, కెటిఆర్ యధావిధిగా ప్రజల్లోకి ప్రభుత్వం వెళ్లవద్దని భావించడంతో పాటు ప్రజల మదిలో ఉండకూడదనీ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం కోల్పోతామని ఎన్నడూ కెటిఆర్, హరీష్ రావులు అనుకోలేదని, అధికారం వారికి శాశ్వతంగా ఉంటుందనే ఆలోచనలో ఉండగా, ప్రజల తీర్పుతో బొక్కబొర్ల పడ్డారని చమత్కరించారు. 'ఫామ్‌హౌస్‌లో మీరు మీ కుటుంబ సభ్యులు మాట్లాడుకోవడం తప్ప ఎప్పుడైనా మంత్రులు,ఎంఎల్‌ఏలతో మాట్లాడారా?' అని ప్రశ్నించారు. కెటిఆర్,హరీష్ రావు రోజు మాట్లాడినంత మాత్రాన ప్రభుత్వం పడిపోదనీ, అంతిమంగా న్యాయ నిర్ణేతలు తెలంగాణ ప్రజలే అని, బిఆర్ఎస్, బిజెపి నాయకులు ప్రజా పాలన,ప్రగతి ప్రణాళికలో భాగస్వామ్యం కావాలని చామల కిరణ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ టీచర్లు బిఆర్ఎస్ నాయకుల ఉచ్చులో పడొద్దు

**కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ చనగాని దయాకర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ విద్యావ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశాడని, ప్రభుత్వ టీచర్లు బిఆర్ఎస్ నాయకుల ఉచ్చులో పడకండి అని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మా ప్రభుత్వ ప్రియార్టీ ఎడ్యుకేషన్, ఇరిగేషన్. కావాలనే సిఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్ద పెట్టుకుని, విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై బిఆర్ఎస్‌కు ఎందుకు అక్కసు? పేదపిల్లలకు చదువు అందిస్తే బిఆర్ఎస్ నాయకులకు ఎందుకు కడుపు మంట? కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేయడం తప్పా? దేశంలో ఎక్కడా లేని ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కడుతున్నాం. కెసిఆర్ కులాల వారిగా గురుకులాలు తెచ్చాడు. కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షత లేని విద్యావిధానం తెస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే విద్యాభివృద్ధి జరుగుతోంది. విద్యా వ్యవస్థను పారదర్శకంగా తయారు చేస్తున్నారు. టీచర్ల గౌరవాన్ని కెసిఆర్ తగ్గించారు. ఒకటవ తారీఖున జీతం ఇస్తున్న ప్రభుత్వం మాది. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కెసిఆర్ ఏజెంట్. ఆయన విద్య గురించి మాట్లాడితే ప్రజలు నవ్వుతున్నారు' అని దయాకర్ పేర్కొన్నారు.

## సినిమా థియేటర్లలో పార్కింగ్ ఫీజు వద్దు

హైదరాబాద్

మున్సిపల్ పరిధిలోని సింగిల్ స్క్రీన్ సినిమా థియేటర్లలో పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా ఆదేశించింది. సినిమా టిక్కెట్ తీసుకున్న ప్రేక్షకుల నుంచి అదనంగా పార్కింగ్ రుసుము వసూలు చేయకుండా చూడాలని రాష్ట్రంలోని అన్ని థియేటర్లకు సమాచారం ఇవ్వాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. హైదరాబాద్ దిల్‌షుక్‌నగర్‌లోని కోణార్క్ థియేటర్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేయడాన్ని సవాలు చేస్తూ రామావత్ ప్రేమ్‌కుమార్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. 2021లో జీవో 121ను విడుదల చేసి పార్కింగ్ వసూలుకు అనుమతి ఇవ్వడాన్ని నిలిపివేశారు.

# దేశానికే బెంచ్ మార్క్

(మొదటి పేజీ తరువాయి)

ఇండ్లలో ఇంకా 20 శాతం వరకు పనులు ప్రారంభం కాలేదని, వాటిని మార్చి 31లోపు యుద్ధప్రాతిపదికన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇండ్లు మంజూరైన తర్వాత కూడా ఇంకా పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, వారి ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఒకటి లేదా రెండు విడతల బిల్లులు చెల్లించి, మధ్యలో ఆగిపోయిన పేమెంట్లను తక్షణమే క్లియర్ చేయాలని, ఇందులో జాప్యం చేస్తే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వివిధ దశల్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను కూడా మార్చి 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగి లబ్ధిదారులపై భారం పడకుండా జిల్లా స్థాయి ధరల నియంత్రణ కమిటీలు చురుకుగా పనిచేయాలని మంత్రి సూచించారు. ఇటుకల కొరత తీర్చేందుకు ప్రతి మండలంలో ఎస్‌హెచ్‌జి మహిళా సంఘాల ద్వారా బ్రిక్ యూనిట్లను ప్రోత్సహించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తోందని, అది లబ్ధిదారులకు సులభంగా అందేలా చూడాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. ఏప్రిల్‌లో రెండో విడత ఇండ్ల మంజూరు ప్రారంభమయ్యే నాటికి మొదటి విడత పనులు ఒక కొలిక్కి రావాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆధిపత్యం కోసమే యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ప్రయోజనాలకు, స్వాతంత్ర్యానికి, స్వీయ పరిపాలన హక్కుకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద ప్రయోజనాల సేవలో సాగుతున్నాయి. ఈ ప్రాంతం, ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించేందుకు, నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రాంతంలో, లాటిన్ అమెరికన్ ఖండంలోని ఇతర ప్రాంతాలలో సార్వభౌమ దేశంలో 'పాలన మార్పు' చేయాలనే ఆలోచనను ట్రంప్ ప్రభుత్వం ప్రకటించడమంటే ప్రజల సార్వభౌమత్వాన్ని, గౌరవాన్ని తీవ్రంగా అణిచివేయడమే. తద్వారా అంతర్జాతీయ చట్టం, ఎంతో కాలం నుంచి అమలవుతున్న నియమ నిబంధనల ఉనికి, అర్థాన్ని కాలరాయడమే అవుతుంది. ప్రజల ప్రయోజనం కోసం కాకపోయినా, అమెరికా, ఇజ్రాయెల్ చేసే ప్రతి యుద్ధం, దురాక్రమణతో వారికి మరింత పెరిగే ముప్పు ఏర్పడింది. వలసవాదం, సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొంటున్న పాలస్తీనా, ఇరాక్, లిబియా, సిరియా, సూడాన్, లెబనాన్, ప్రపంచంలోని దక్షిణార్థగోళంలోని ప్రతి దేశంలోని ప్రజల అనుభవాలను విస్మరించలేము. ప్రజల ఉద్యమాలు, దేశభక్త నాయకత్వంలోనే ప్రతిఘాత, నిరంకుశ పాలకుల నుండి నిజమైన విముక్తి, లభిస్తుందే తప్ప వాషింగ్టన్ లేదా టెల్ అవీవ్ నుండి కాదు.ఇరాన్, ఆ దేశ ప్రజలపై జరుగుతున్న దాడి ఈ ప్రాంతంలోని మిగిలిన దేశాలపై పూర్తి ఆధిపత్యానికి నాంది అని పునరుద్ఘాటిస్తున్నాము. దీని కి సంబంధించిన ప్రణాళికను ఇజ్రాయెల్ ప్రభుత్వం, అమెరికా పాలకులు బహిర్గతం చేయడానికి వెనుకాడబోవు. అమెరికా, ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద సైనిక దురాక్రమణ, నిరంకుశత్వం... ప్రస్తుత నియంతృత్వం నుండి ఇరాన్ విముక్తిని ప్రకటించడమే కాకుండా, ఇరాన్‌ను సమర్థవంతమైన ప్రాంతీయ రాజ్యంగా మనుగడ సాగించకుండా నాశనం చేయడానికే. ప్రస్తుత ప్రభుత్వ స్థానంలో అణిగిమణిగి ఉండే వారి ప్రత్యర్థులను కూర్చోపెట్టి నిరంకుశ పాలన చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. అంతర్జాతీయ కమ్యూనిస్ట్ పార్టీలుగా తమ దేశాలలోని దోపిడీ, అణచివేత ప్రభుత్వాల నుంచి నిజమైన విముక్తిని కోరుకునే అన్ని శక్తులు ఏకమవ్వాలి. ప్రస్తుత సంక్లిష్ట, నిర్ణయాత్మక సమయంలో యుద్ధం, పోరాడేందుకు, ప్రపంచంలోని శాంతిని ప్రేమించే, ప్రగతిని కాంక్షించే శక్తులను, పూర్తి శక్తితో ఐక్యంగా తమ ప్రయత్నాలను సాగించాలని పిలుపునిస్తున్నాం' అని ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా కమ్యూనిస్టు పార్టీలు ప్రకటనలో పేర్కొన్నాయి.

# మహా శక్తులు

(మొదటి పేజీ తరువాయి)

పి.ప్రేంపావని, మహిళా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు పడాల నళిని అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె.రజని, సీనియర్ నాయకురాలు ఆరుట్ల సుశీలదేవి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎన్.కరుణ కుమారి, ఎస్‌టియు సీనియర్ నాయకురాలు సరళా దేవి, ఎస్.ఛాయాదేవి, మహిళా సమాఖ్య కార్యదర్శి చక్రిబాయి, ఉపాధ్యక్షురాలు అంజూమ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శాఖ కార్యదర్శి జె.లక్ష్మి , రంగారెడ్డి జిల్లా శాఖ కార్యదర్శి ఫమీదా, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రజని మాట్లాడుతూ 115 ఏళ్ల క్రితం మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు నేడు ఒక్కొక్కటిగా హరించబడుతున్నాయని, ఈ చర్యలకు వ్యతిరేకంగా నాటి ఉద్యమస్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఒకే ఒక్కడు ఈ ప్రపంచాన్ని శాసిస్తూ యుద్ధ కాంక్షతో అమాయకులైన చిన్నారులు మొదలు మహిళల ప్రాణాలను బలితీసుకుంటున్న ట్రంప్‌కు వ్యతికంగా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శాంతి ఉద్యమంలో మహిళలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రేంపావని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పని చేసే మహిళలు అనేక ఉద్యమాల ద్వారా తమ హక్కులతో పాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కూడా సాధించుకున్నారన్నారు. నాటి పోరాటాలతో సాధించుకున్న అనేక కార్మిక చట్టాలు, హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఉన్న చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌ల రూపంలో తీసుకువచ్చిందని శ్రామిక మహిళలు మరింత పెద్ద ఎత్తున ఉద్యమించాలని కోరారు. ఎన్.జ్యోతి మాట్లాడుతూ మహిళలది నిత్యం పోరాటాల బతుకేనని, వారి కష్టాలు మాత్రం తీరడం లేదన్నారు.

# భారత్ డేటా

(మొదటి పేజీ తరువాయి)

పన్నులు ఉండేవి కాదని అభిప్రాయపడ్డారు. కేరళ తిరువనంతపురంలోని టెక్నో పార్క్‌లో ఐటి ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు రాహుల్ వ్యాఖ్యానించారు. సరైన విధానాలు, విజన్‌తో భారత్ ఎలక్ట్రిక్ మొబిలిటీలో చైనాతో పోటీ పడగలదని రాహుల్ గాంధీ తెలిపారు. యుద్ధాలు ఎక్కువగా చైనా ఆధిపత్యం చెలాయించే బ్యాటరీ ఆప్టిక్స్, ఎలక్ట్రిక్ మోటార్లు (సాంకేతికత) వైపునకు వేగంగా మారుతున్నాయని అన్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్, యుఎస్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న వివాదాలను ఈ సందర్భంగా రాహుల్ ప్రస్తావించారు. 'మీరు ఉక్రెయిన్‌కు వెళ్లి యుద్ధభూమిలో ఏమి జరుగుతుందో చూస్తే అసలు విషయం తెలుస్తుంది. సర్క్యులర్ మోషన్‌లో డ్రోన్లు విరుచుకుపడుతున్నాయి. ఇరాన్‌లో సైనికులు బ్యాటరీ ఆప్టిక్స్, ఎలక్ట్రిక్ మోటారుపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ సాంకేతికతలపై చైనా ఆధిపత్యం చెలాయిస్తోంది. అయితే సరైన విధానాలు, విజన్‌తో భారత్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సర్క్యులర్ మోషన్‌లో చైనాతో పోటీ పడగలదు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. చైనా ప్రపంచంలోనే అద్భుతమైన పారిశ్రామిక వ్యవస్థను నిర్మించిందని, కానీ ఆ పనిని బలవంతంగా, ప్రజాస్వామ్య విరుద్ధంగా చేసిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా, భారత్, ప్రపంచంలోని చాలా దేశాలు వినియోగ రంగంలో దూసుకెళ్తున్నాయని అన్నారు. చైనా పారిశ్రామిక ఉత్పత్తి వైపు దృష్టి సారించిందని తెలిపారు. నిజమైన ఉద్యోగాలు పారిశ్రామిక ఉత్పత్తి రంగంలో ఉన్నాయని అభిప్రాయపడ్డారు. 'చైనా ప్రపంచంలోనే అద్భుతమైన పారిశ్రామిక వ్యవస్థను నిర్మించింది. వారు బలవంతంగా ఆ వ్యవస్థను నిర్మించారు. ప్రజాస్వామ్యబద్ధంగా లేరు. భారత్ తన ప్రజాస్వామ్య విలువలను కొనసాగిస్తూ పారిశ్రామిక ఉత్పత్తి వ్యవస్థను నిర్మించగలిగితే అది దేశ ప్రజలకు, ప్రపంచానికి ఒక గొప్ప సేవ అవుతుంది. సైనిక శక్తి ఎక్కువగా విద్యుత్ మోటార్లు, బ్యాటరీలపై ఆధారపడుతోంది. ఈ సాంకేతికతలో భారత్, అమెరికా, యూరప్ కాకుండా చైనా ఆధిపత్యం కొనసాగిస్తోంది. ఇది ఆందోళన కలిగించే అంశం. చైనా ప్రస్తుతం పారిశ్రామిక వ్యవస్థలో స్వేచ్ఛగా ఉంది. కానీ ఆ రంగంలోకి భారత్ ప్రవేశిస్తే వారు ఆందోళన చెందుతారు. దేశంలో చాలా తక్కువ వ్యాపారాలు పారిశ్రామిక ఉత్పత్తిలో నిమగ్నమై ఉన్నాయి. అదానీ, అంబానీ వంటి బడా బిజినెస్ మ్యాన్‌ల వ్యాపారాలు మన స్థానిక ఉత్పత్తిని దెబ్బతీసే ప్రొడక్ట్స్‌ను విక్రయిస్తాయి. జీఎస్టీని ఉత్పత్తిదారులకు హాని కలిగించే విధంగా రూపొందించారు' అని అన్నారు.

**నేను చాలా ఇతర పనులు చేస్తాను!**

తాను రాజకీయాల్లో లేకుంటే బహుశా ఏరోస్పేస్ ప్రపంచంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ చేసి ఉండేవాడిని అని రాహుల్ గాంధీ అన్నారు. తాను, తన తండ్రి రాజీవ్ గాంధీ, మామయ్య కూడా పైలట్లమని, అందుకే తనకు ఏరోస్పేస్‌పై కాస్త ఆసక్తి ఉంటుందన్నారు. తనను చాలా మంది రాజకీయ నాయకుడిగా భావిస్తారని, కానీ వాస్తవానికి తాను చాలా ఇతర పనులు చేస్తానని తెలిపారు.

**'రాజకీయ ప్రచారం కోసమే ఆ సినిమా'**

రాహుల్ గాంధీ ఇడుక్కిలోని మరియన్ కళాశాల విద్యార్థులతో సంభాషించారు. ఈ సందర్భంగా 'ది కేరళ స్టోరీ 2' సినిమా గురించి ప్రస్తావించారు. రాజకీయ ప్రచారం కోసం సినిమా, మీడియాను ఉపయోగించడంపై మండిపడ్డారు. సమాజంలో విద్వేషాలు పెంచడానికి, కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకోవడానికి కొందరు వ్యక్తులు సినిమాలను, మీడియాను ఆయుధంలా వాడుకుంటున్నారని ఆరోపించారు. సినిమా, మీడియా ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావాలని కోరారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com